www.visalaandhra.com

శనివారం
09-8-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 319
పేజీలు : 8, వెల: రూ.5.00

Simultaneously published from
Hyderabad, Vijayawada, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

విశాలాంధ్ర

స్థాపితం : 1952

అక్షరాక్షరం అభ్యుదయం

VISALAANDHRA Regd No.VJ/042/2021-23

అమెరికా తర్వాత స్థానం భారత్‌దే

న్యూయార్క్: ఓపెన్‌ఏఐకి అమెరికా తర్వాత భారత్ అతిపెద్ద మార్కెట్ అని ఆ సంస్థ సీఈవో శామ్ ఆల్ట్‌మన్ అన్నారు. జీపీటీ–5ను విడుదల చేసిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్‌లో ఏఐ వినియోగం అతి వేగంగా పెరుగుతోందని, అమెరికాను అధిగమించగలదని అన్నారు. భారత్‌లో సాధారణ ప్రజల నుంచి వ్యాపార సంస్థల వరకు ఏఐ వినియోగం చూస్తే ఆశ్చర్యంగా ఉందని తెలిపారు. ఓపెన్‌ఏఐ ఉత్పత్తులను భారత్‌లో మరింతగా అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు. సెప్టెంబర్‌లో శామ్ ఆల్ట్‌మన్ భారత్ పర్యటనకు వచ్చే అవకాశం ఉంది.

పుతిన్‌కు మోదీ ఫోన్

న్యూదిల్లీ: రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తుండడంతో భారత్‌పై అమెరికా దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆక్రోశం వెళ్లగక్కుతున్నారు. తన మాట వినడం లేదంటూ భారత్‌పై ప్రతీకార సుంకాలను అంతకంతకు పెంచుకుంటూ పోతున్నారు. అలాంటి వేళ రష్యా అధ్యక్షుడు పుతిన్‌కి భారత ప్రధాని నరేంద్ర మోదీ ఫోన్ చేశారు. భారత్‌లో పర్యటించాలని పుతిన్‌ను ఆహ్వానించారు. ఈ ఏడాది చివరిలో 23వ భారత్, రష్యా వార్షిక శిఖరాగ్ర సదస్సు జరగనుంది. ఈ సదస్సుకు హాజరు కావాలని పుతిన్‌ను మోదీ కోరారు. భారత్, రష్యా దేశాల మధ్య భాగస్వామ్యం మరింత బలోపేతం కావడంపై ఇద్దరూ చర్చించారు.

అమెరికా సుంకాలపై మౌనమెందుకు?

కేంద్రానికి వామపక్ష ఎంపీల ప్రశ్న: పార్లమెంటు వద్ద నిరసన

న్యూదిల్లీ: వాణిజ్యాన్ని అడ్డుపెట్టుకొని భారీ సుంకాలు, అదనపు జరిమానాలు విధిస్తూ భారత్‌తో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆటాడుకుంటున్నారని సీపీఐ ఎంపీలు పి.సంతోశ్ కుమార్, వి.సెల్వరాజ్, పీపీ సునీర్ విమర్శించారు. అమెరికా వేధిస్తుంటే కేంద్రం ఎందుకు మౌనంగా ఉంటోందని నిలదీశారు. ప్రధాని, కేంద్రమంత్రులు దీటుగా సమాధానం ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. అమెరికా సామ్రాజ్యవాదాన్ని, ఒడిశాలో నన్స్‌పై దాడిని సీపీఎం, సీపీఐ(ఎంఎల్) ఎంపీలు మార కె.రాధాకృష్ణన్, జాన్ బ్రిట్టాస్, ఏఏ రహీం, ఆర్. సచ్చితానందం, సుధామ ప్రసాద్, రాజారామ్‌తో కలిసి శుక్రవారం పార్లమెంటు

- మిగతా 2 లో

వాస్తవాలు కప్పిపుచ్చలేరు



అఫిడవిట్ ఇవ్వండి

రాహుల్‌కు ఈసీ సవాల్

2లో

- ప్రతిపక్షం నుంచి తప్పించుకోలేరు
- న్యాయం, ప్రజాస్వామ్యం కోసం పోరాడతాం
- బెంగళూరు సభలో ఈసీకి రాహుల్ హెచ్చరిక
- ఐక్యంగానే మోదీ మోసాలు ఆపగలం: ఖర్గే

బెంగళూరు: ఎన్నికల సంఘం తన రాజ్యాంగబద్ధ బాధ్యతను మరిచిందని, సీట్లు, గెలుపును బీజేపీకి దోచిపెట్టిందని, ఓట్లు చోరీ కాదు... దోపిడీ చేసిందని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో విమర్శించారు. ఎన్నికల సంఘం మోసాలను బయట పెట్టేందుకు సాక్ష్యాధారాలతో ప్రజల ముందుకు వచ్చామని శుక్రవారం కర్నాటక రాజధాని బెంగళూరులోని ఫ్రీడం పార్కులో 'మన ఓటు, మన హక్కు, మన పోరు' నినాదంతో కాంగ్రెస్ ఆధ్వర్యంలో 'ఓట్ అధికార్ ర్యాలీ, ఆపై బహిరంగ సభలో రాహుల్ మాట్లాడారు. 'వాస్తవాలను కప్పిపుచ్చలేరు... ముఖం చాటేయలేరు... ప్రతిపక్షాన్ని ఎదుర్కోవాల్సిందే' అంటూ ఎన్నికల సంఘాన్ని హెచ్చరించారు. 'పార్లమెంటులో రాజ్యాంగం పట్టుకొని ప్రతిజ్ఞ చేశాను. ఓట్ల చోరీ జరిగిందని మళ్లీ చెబుతున్నాను. నా ఆరోపణలపై ఎన్నికల సంఘం అఫిడవిట్ కోరుతోంది. నేను చూపిన డేటా ఆధారంగా ప్రజలు నిలదీస్తుండటంతో ఎన్నికల సంఘం తన అధికారిక వెబ్‌సైట్‌ను ఆపేసింది. మధ్యప్రదేశ్,

- మిగతా 2 లో

విశాఖ బాధితులకు రూ.10 లక్షల పరిహారం

విశాలాంధ్ర బ్యూరో – అమరావతి : విశాఖపట్నంలో ఫిషింగ్ హార్బర్ వద్ద వెల్డింగ్ షాపులో గ్యాస్ సిలిండర్ పేలి మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. ప్రమాదంలో మృతి చెందిన ముగ్గురికి ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున పరిహారం అందించాలని అధికారులను ఆదేశించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య చికిత్స అందించాలని సూచించారు.

ప్రణాళికాబద్ధంగా ఎస్ఎల్‌బీసీ పునరుద్ధరణ

సొరంగం తవ్వకానికి వరద నీరు ఆటంకం

నీటి ఎత్తిపోతకు ఏటా రూ.750 కోట్లు

మంత్రి ఉత్తమ్

విశాలాంధ్ర – హైదరాబాద్ : ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్ట్ పనుల పునరుద్ధరణకు ప్రణాళికా బద్ధంగా కార్యాచరణకు పూనుకున్నట్టు రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. అంబేద్కర్ సచివాలయంలో శుక్రవారం జరిగిన సమీక్షా సమావేశానికి నీటిపారుదల రాష్ట్ర సలహాదారుడు ఆదిత్యాదాస్ నాథ్, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఈఎన్‌సీలు అంజద్ హుస్సేన్, రమేష్ బాబు, ఆర్ అండ్ ఆర్ కమిషనర్ శివకుమార్ నాయుడు, సీఈ అజయ్ కుమార్ హాజరయ్యారు. మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ ఎస్ఎల్‌బీసీ పనులకు అవసరమైన నిధులు సమకూర్చుకోవడంతో పాటు పాలనా పరమైన అనుమతులు పొందేందుకు త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలతో సమావేశం కానున్నట్లు

- మిగతా 2 లో

ఓటు హక్కు పరిరక్షిస్తాం

11న పార్లమెంటు నుంచి ఈసీ కార్యాలయం వరకు 'ఇండియా' మార్చ్: డి.రాజా

న్యూదిల్లీ: స్వాతంత్ర్య పోరాటం ద్వారా సాధించుకున్న ఓటు హక్కుకు ఎట్టిపరిస్థితుల్లోనూ విఘాతం కలగనివ్వబోమని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా తేల్చిచెప్పారు. ఓటు హక్కును హరిస్తే సహించే ప్రసక్తే లేదని, అలా ఎప్పటికీ జరగనివ్వబోమని స్పష్టంచేశారు. ఓటర్ ఎమ్యునరేషన్, బీహార్ ఎస్ఐఆర్‌తో పాటు ఎన్నికల మోసాలపై ఈసీ నుంచి స్పష్టత రావాలని డిమాండ్ చేస్తూ ఈనెల 11న పార్లమెంటు నుంచి ఈసీ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించాలని ఇండియా ఐక్య సంఘటన నిర్ణయించినట్లు రాజా వెల్లడించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ నివాసంలో 'ఇండియా' నాయకుల భేటీలో కీలక అంశాలపై నిశితంగా చర్చించినట్లు తెలిపారు. ఎన్నికల సంఘం పని తీరుపై అనుమానాల దృష్ట్యా రాహుల్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారని, ఆరు నెలల విచారణలో వెల్లడైన వివరాలను ఇండియా నాయకులకు వివరించారని చెప్పారు. ప్రాథమిక హక్కుగా ఉన్న ఓటు హక్కు పరిరక్షణకు, దాని తొలగింపు చర్యలకు వ్యతిరేకంగా ఇండియా ఐక్య సంఘటన ఒకే మాటపై ఉందని, కలిసికట్టుగా ఉమ్మడి కార్యాచరణతో ముందుకెళుతున్నదని రాజా అన్నారు.

తయారీ రంగానికి కేంద్రం

- కొత్త పరిశ్రమల ఏర్పాటుకు కృషి
- 'తోషిబా' రూ.347 కోట్ల పెట్టుబడి: మంత్రి దుద్దిళ్ల

విశాలాంధ్ర – హైదరాబాద్ : తెలంగాణను గ్లోబల్ మాన్యుఫాక్చరింగ్ హబ్‌గా మార్చేందుకు తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తుందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. సంగారెడ్డి జిల్లా రుద్రారంలోని తోషిబా ట్రాన్స్‌మిషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్స్ (ఇండియా) ప్రాంగణంలో రూ.347 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసిన ఈహెచ్‌వీ పవర్ ట్రాన్స్ ఫార్మర్ల ప్లాంట్ విస్తరణ పనులకు శుక్రవారం ఆయన భూమి పూజ చేశారు. స్టేట్ ఆఫ్ ది ఆర్ట్ మాన్యుఫాక్చరింగ్ ఫెసిలిటీ ఫర్ సీఆర్జీవో కోర్ ప్రాసెసింగ్ సెంటర్, సర్జ్ అరెస్టేర్ యూనిట్లను లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం దుద్దిళ్ల మాట్లాడుతూ... "అనతి కాలంలోనే తెలంగాణ తయారీ రంగంలో దేశానికి దిక్సూచిగా మారింది. 2024 –25 లో ఇండస్ట్రియల్ అవుట్‌పుట్ రూ.2.77 లక్షల కోట్లు. ఇందులో 48 శాతం

- మిగతా 2 లో



కూనంనేని ఎన్నికపై పిటిషన్ సుప్రీంకోర్టు కొట్టివేత

విశాలాంధ్ర– హైదరాబాద్ : కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఎన్నికను సవాల్ చేస్తూ మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావు వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు ధర్మాసనం శుక్రవారం డిస్మిస్ చేసింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్ బాగ్చీ ధర్మాసనం అడ్మిషన్ స్థాయిలోనే కొట్టివేసింది. గతంలో ఎమ్మెల్యే కూనంనేనిపై తెలంగాణ హైకోర్టులో ఎన్నికల పిటిషన్ దాఖలైంది. జస్టిస్ కె.లక్ష్మణ్ ఎదుట సీనియర్ న్యాయవాది విద్యాసాగర్ వాదనలు వినిపించారు. ఉభయ పక్షాల వాదనలు విన్న ఏకసభ్య ధర్మాసనం జూన్ తొమ్మిదిన ఎన్నికల పిటిషన్ కొట్టివేసింది. హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ జలగం వెంకట్రావు సుప్రీంకోర్టులో అప్పీలు చేశారు. దీనిపై శుక్రవారం సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసం ఎదుటకు రాగా, అడ్మిషన్ స్థాయిలోనే అప్పీల్‌ను జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్ బాగ్చీ కొట్టివేశారు.

భారత్‌తో వాణిజ్య చర్చల్లేవ్: ట్రంప్

2లో



14 మందికి ఐపీఎస్‌లుగా పదోన్నతులు

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 14 మంది గ్రూప్–1 పోలీసు అధికారులకు ఐపీఎస్‌లుగా పదోన్నతులు కల్పిస్తూ... కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2010 బ్యాచ్‌కు చెందిన చౌడేశ్వరి, లక్ష్మీనారాయణ, ఈశ్వర్‌రావు, హిమావతి, లావణ్య లక్ష్మీ, వెంకటరత్నం, లత మాధురి, సురేశ్‌బాబు, కరీముల్లా షరీఫ్, సత్తిబాబు, సుప్రజ, కృష్ణ ప్రసన్న, శ్రీనివాస్, కె.శ్రీనివాస్‌కు కన్ఫార్మ్‌డ్ ఐపీఎస్‌లుగా పదోన్నతి ఇచ్చింది. దీనికి సంబంధించి అధికారిక గెజిట్ నోటిఫికేషన్ శుక్రవారం కమిటీ విడుదల చేసింది.

సమ్మిళిత అభివృద్ధి దిశగా పాలన

- బీసీ రిజర్వేషన్ల కోసం అలుపెరుగని పోరు
- రైతన్నలకు కొత్త వంగడాలు, సాంకేతిక పరిజ్ఞానం
- బీసీ సెల్ ప్రారంభోత్సవంలో మంత్రి పొన్నం



విశాలాంధ్ర – రాజేంద్రనగర్ : రాజేంద్రనగర్‌లో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ పాలనా భవనంలో ఏర్పాటు చేసిన బీసీ సెల్‌ను రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం ప్రారంభించారు. బీసీ కమిషన్ జి.నిరంజన్, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య సమక్షంలో బీసీ సెల్ ఇంచార్జి అధికారిగా నియమితులైన ప్రొఫెసర్ డాక్టర్ దామోదర రాజు బాధ్యతలు స్వీకరించారు. తొలుత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్,

- మిగతా 2 లో

సముద్రం నుంచే సంపద సృష్టి

- తీరంలో నాచు సాగుతో సరికొత్తగా ఉపాధి
- పెట్టుబడి తక్కువ... లాభాలు అధికం
- మహిళలకు ఆదాయ వనరుగా సముద్రతీరం

8లో

రాష్ట్రంలో అత్యంత పొడవైన సముద్ర తీరాన్ని మహిళలు తమకు ఆదాయ వనరుగా మార్చుకుంటున్నారు. తూర్పు గోదావరి నుంచి శ్రీకాకుళం వరకూ సముద్ర తీరంలో సరికొత్త దృశ్యం ఆవిష్కారమవుతోంది.

హైకోర్టు అదనపు జడ్జిలకు పదోన్నతి

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో నలుగురు అదనపు న్యాయమూర్తులకు పదోన్నతి లభించింది. జస్టిస్ హరనాథ్ నూనెపల్లి, జస్టిస్ కిరణ్మయి, జస్టిస్ సుమతి, జస్టిస్ న్యాపతి విజయ్‌కు పూర్తి స్థాయి జడ్జిలుగా పదోన్నతి కల్పిస్తూ కేంద్ర న్యాయశాఖ ఉత్తర్వులు వెలువరించింది. ఆంధ్రప్రదేశ్ సహా ఆరు రాష్ట్రాల్లోని 16 మంది హైకోర్టు జడ్జిలకు పదోన్నతి కల్పించాల్సిందిగా సుప్రీం కొలీజియం ఇటీవల సిఫార్సు చేసింది. అందుకు రాష్ట్రపతి ఆమోదంతో కేంద్ర న్యాయశాఖ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఇదీ లోకం!

కాస్త ఓపిక పట్టరా..పైగా ఇవాళ అసలే ఆదివాసీ దినోత్సవం!

మళ్లీ మొదటికే!

- ఏపీ డీఎస్సీ 'కీ'లపై అభ్యంతరాలు
- ఎస్ఏ బయాలజీ అభ్యర్థుల అనుమానాలు
- అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: డీఎస్సీ–2025 పరీక్షల కీల వ్యవహారం మళ్లీ మొదటికి వచ్చింది. తుది కీ విడుదలయ్యాక అభ్యర్థుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. తుది కీలో అభ్యంతరాలను సరిగ్గా పరిశీలించకుండానే...అవే తప్పులతోనే తుది కీ ఎలా రూపొందిస్తారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల తామంతా నష్టపోతున్నామని వాపోతున్నారు. జూన్ 10న రెండో విడతలో నిర్వహించిన స్కూల్ అసిస్టెంట్(ఎస్ఏ) బయాలజీ పరీక్షకు సంబంధించి ప్రాథమిక కీలో తప్పులు దొర్లాయని అభ్యర్థులు వాపోతున్నారు. దీనిపై అప్పట్లోనే ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి మార్పులు చేయకుండానే తుది కీ విడుదల చేసినట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిభా జాబితాలో మార్కులు కోల్పోవాల్సి ఉంటుందని లబోదిబోమంటున్నారు. తమ గోడు పట్టించుకునే నాథుడేలేడన్నారు. ఈ పరీక్షకు సంబంధించి 14 నుంచి 16 ప్రశ్నల వరకు తప్పులు దొర్లినట్లు అభ్యర్థులు చెబుతున్నారు. రెండో విడత జరిగిన ఈ పరీక్షకు రాష్ట్ర వ్యాప్తంగా తొమ్మిదివేల మంది పరీక్ష రాశారు. జూన్ ఆరు నుంచి జులై రెండో తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ పరీక్ష కేంద్రాల్లో ఆన్‌లైన్ విధానంలో నిర్వహించారు. అదే నెలలో అన్ని సబ్జెక్టులు ప్రాథమిక జవాబు కీలను విద్యాశాఖ విడుదల చేయగా..వాటిపై అభ్యంతరాలను

- మిగతా 2 లో

అంగుళం భూమి లాక్కోనివ్వం

- పంజాబ్ ప్రభుత్వానికి దలేవాల్ స్పష్టీకరణ
- లూథియానాలో రైతుల భారీ ప్రదర్శన
- 25న దిల్లీలో కిసాన్ మహా పంచాయత్

లూథియానా: తమకు చెందిన అంగుళం భూమిని కూడా ప్రభుత్వం లాక్కునేందుకు వీల్లేదని రైతు నాయకుడు జగ్జీత్ సింగ్ దలేవాల్ తేల్చిచెప్పారు. పంజాబ్‌లో భూ సేకరణ విధానాన్ని తిరస్కరించారు. సారవంతమైన భూములను ఎలా సేకరిస్తారని ప్రశ్నించారు. ఈ విధానానికి వ్యతిరేకంగా దలేవాల్ నాయకత్వంలో లూథియానాలో భారీ నిరసన ప్రదర్శన జరిగింది. వేలాది మంది రైతులు పాల్గొన్నారు. పంజాబ్‌లో ల్యాండ్ పూలింగ్ విధానాన్ని రైతులు తీవ్రంగా వ్యతిరేకించారు. సారవంతమైన భూముల

- మిగతా 2 లో

గాజా స్వాధీనానికి ఇజ్రాయిల్ దూకుడు

టెల్ అవీవ్: గాజా స్వాధీనం చేసుకునే ప్రణాళికలను ఇజ్రాయిల్ కేబినెట్ ఆమోదించింది. ఈమేరకు ప్రధాని నెతన్యాహు కార్యాలయం ప్రకటించింది. ఐడీఎఫ్ దళాలు గాజాను స్వాధీనం చేసుకోవడానికి సిద్ధమవుతున్నట్లు తెలిపింది. యుద్ధభూమికి వెలుపల ఉన్న ప్రజలకు మానవతా సాయం అందించనున్నట్లు వెల్లడించింది. హమాస్ వద్ద బందీలను విడిపించే ప్రణాళికలలో భాగంగా ఈ చర్యలు తీసుకోబోతున్నట్లు పేర్కొంది. అంతకుముందు నెతన్యాహు విలేకరులతో మాట్లాడుతూ గాజా స్వాధీనం చేసుకోవడం తమ ప్రణాళిక కాదని చెప్పారు. హమాస్ అంతానికి, బందీల విముక్తికి ఆ ప్రాంతాన్ని తాత్కాలిక ప్రభుత్వానికి అప్పగించడమే తమ లక్ష్యమని వెల్లడించారు. అయితే 22 నెలలుగా సాగుతున్న ఇజ్రాయిల్, హమాస్ మధ్య పోరులో ఇప్పటికే 61వేల మందికిపైగా పలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారు. దాదాపు 75శాతం భూభాగం ఐడీఎఫ్ నియంత్రణలో ఉంది. మిగలిన ప్రాంతాన్నీ స్వాధీనం చేసుకొనే దిశగా చర్యలకు ఐడీఎఫ్ వైపు నుంచి ప్రతిఘటన ఎదురవుతున్నట్లు సమాచారం. అక్కడ ఆపరేషన్ కొనసాగిస్తే హమాస్ వద్ద బందీలుగా ఉన్న ఇజ్రాయిల్ పౌరుల ప్రాణాలకు నష్టం కలగవచ్చని ఐడీఎఫ్ భావిస్తోంది. హమాస్ మౌలిక వసతులన్నీ నాశనం చేయాలంటే సంవత్సరాలు పట్టవచ్చని అంచనా వేసింది. ఈ పరిణామాల క్రమంలో గాజా స్వాధీనానికి ఇజ్రాయిల్ కేబినెట్ పచ్చ జెండా ఊపడం చర్చనీయాంశంగా మారింది.

ఆ ఆలోచన తక్షణమే మానుకోవాలి: ఐరాస

గాజా స్ట్రిప్ స్వాధీనం దిశగా వేసే అడుగులను ఇజ్రాయిల్ తక్షణమే ఉపసంహరించుకోవాలని ఐక్యరాజ్య సమితి (ఐరాస్) తేల్చిచెప్పింది. తమ సైన్యం గాజాను సంపూర్ణంగా ఆక్రమించుకోవాలనే ఇజ్రాయిల్ ప్రభుత్వ ప్రణాళికను ఇప్పటికిప్పుడు ఆపేయాలని ఐరాస మానవ హక్కుల అధినేత వోల్కర్ టర్క్ శుక్రవారం స్పష్టంచేశారు. అంతర్జాతీయ న్యాయ వ్యవస్థ (ఐసీసీ) ఆదేశాలకు విరుద్ధంగా ఇజ్రాయిల్ యోచన ఉన్నదని, దురాక్రమణను ఇజ్రాయిల్ తక్షణమే ఆపేయాలని, టూ స్టేట్ పరిష్కారానికి అంగీకరించాలని, పలస్తీనా సార్వభౌమత్వాన్ని గుర్తించాలని టర్క్ వెల్లడించారు.

ప్రపంచ దేశాల అభ్యంతరం

గాజా స్వాధీనం దిశగా ఇజ్రాయిల్ అడుగులపై ప్రపంచ దేశాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. గాజా పలస్తీనా ప్రజలకు చెందుతుందని, దానిని మీరెలా స్వాధీనం చేసుకుంటారని చైనా ప్రశ్నించింది. ఇటువంటి ప్రమాదకరమైన చర్యలను తక్షణమే ఆపేయాలని ఇజ్రాయిల్‌కు సూచించింది. 'గాజా పలస్తీనా ప్రజలకు చెందినది. పలస్తీనా భూభాగంలో విడదీయలేని భూభాగం. గాజాలో మానవతా సంక్షోభాన్ని పరిరక్షించడం, బందీల విడుదలకు సురక్షితమైన మార్గం ఏమైనా ఉందంటే అది తక్షణ కాల్పుల విరమణ' అని చైనా విదేశాంగ శాఖ శుక్రవారం ఒక ప్రకటన చేసింది. అదే విధంగా ఇజ్రాయిల్ ముమ్మాటికీ తప్పు చేస్తోందని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ అన్నారు. ఈ నిర్ణయాన్ని పున: సమీక్షించాలని ఇజ్రాయిల్‌కు సూచించారు. ఇలాంటి చర్యలతో ఘర్షణలు మరింతగా పెరుగుతాయని హెచ్చరించారు. ఇజ్రాయిల్ తక్షణమే తమ ప్రణాళికను ఉపసంహరించుకొనేలా ప్రపంచ దేశాలు ఒత్తిడి తేవాలని టర్కీ పిలుపునిచ్చింది. ఈ నిర్ణయం అమల్లోకి రాకుండా బాధ్యతాయుతంగా అంతర్జాతీయ సమాజం వ్యవహరించాలని కోరుతున్నామంటూ టర్కీ విదేశాంగ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. పలస్తీనినా ప్రజలను తమ మాతృభూమి నుంచి బలవంతంగా తరలించేయాలని ఇజ్రాయిల్ రూపొందించుకున్న ప్రణాళికలు ఎట్టిపరిస్థితుల్లో కార్యరూపం దాల్చరాదని పేర్కొంది.

ప్రణాళికకు కేబినెట్ ఆమోదం: నెతన్యాహు కార్యాలయం ప్రకటన

గాజాపై సైనిక చర్యలను మరింత పెంచాలని, మరింతగా వినాశనం చేయాలని, అక్కడి ప్రజల వెతలను పెంచాలని, గాజా భూభాగాన్ని పూర్తిస్థాయిలో ఆక్రమించుకోవాలని ఇజ్రాయిల్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామంటూ స్పెయిన్ విదేశాంగ శాఖ జోసె మాన్యుల్ అల్‌బేరస్ వెల్లడించారు. శాశ్వత కాల్పుల విరమణ, తక్షణమే మానవతా సాయానికి అనుమతి, ఆపై బందీలందరినీ విడిపించడం తక్షణమే తీసుకోవాల్సిన చర్యలన్నారు.

అంతర్జాతీయ చట్టాన్ని ఉల్లంఘిస్తూ, గాజా ఆక్రమణ దిశగా ముందుకెళ్లే ఇజ్రాయిల్ ప్రయత్నం ఆక్షేపణీయమని స్వీడెన్ విదేశాంగ శాఖ మంత్రి మారియా మల్మార్ స్టీనెగార్డ్ అన్నారు. 'ఇజ్రాయిల్ ప్రభుత్వ నిర్ణయం తీవ్రస్థాయిలో ఆందోళన కలిగిస్తోంది. మేము తక్షణమే కాల్పుల విరమణ జరగాలని కోరుతున్నాం' అని ఆమె వెల్లడించారు.

భారత్‌తో వాణిజ్య చర్చల్లేవ్: ట్రంప్

వాషింగ్టన్: రష్యాతో వాణిజ్యం కారణంతో భారత్‌పై సుంకాల భారాన్ని మోపిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్... సుంకాలపై వివాదం పరిష్కారం అయ్యేంత వరకు వాణిజ్యపరంగా ఎలాంటి చర్చలను భారత్‌తో జరపబోమని వెల్లడించారు. ఓవల్ కార్యాలయంలో ప్రముఖ వార్తా సంస్థతో మాట్లాడిన సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్ నుంచి జరిగే దిగుమతులపై సుంకాలను రెట్టింపు చేస్తూ ట్రంప్ ప్రభుత్వం ఇటీవల ప్రకటన చేసింది. దీనిని భారత్ ఖండించింది. దేశ ప్రయోజనాలే తమకు ముఖ్యమని తెలిపింది. ఈ క్రమంలో భారత్‌పై 50 శాతం సుంకాలు విధించాక వాణిజ్యపరంగా సంప్రదింపులను పెంచే అవకాశం ఉందా అన్న ప్రశ్నకు... లేదంటూ ట్రంప్ బదులిచ్చారు. సమస్య పరిష్కారం అయ్యేంత వరకు అందుకు ఎంత మాత్రం ఆస్కారం లేదని ఆయన తేల్చిచెప్పారు. ఇదిలావుంటే, తమ దేశానికి భారత్ వ్యూహాత్మక భాగస్వామి అని అమెరికా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి టామీ పిగోట్ తెలిపారు. సుంకాల నేపథ్యంలో రెండు దేశాల మధ్య ఉద్రిక్తత కొనసాగుతున్నప్పటికీ చర్చలు పూర్తిస్థాయిలో జరుగుతాయని చెప్పారు. వాణిజ్యం, రష్యా నుంచి చమురు కొనుగోలు వంటి విషయాల్లో ట్రంప్ చర్యలు తీసుకున్నారన్నారు. రష్యా నుంచి చమురు కొన వద్దంటే భారత్ పట్టించుకోలేదు కాబట్టే ఆ దేశంపై విధించిన 25 శాతం సుంకాన్ని 50 శాతానికి పెంచారని టామీ వెల్లడించారు. కాగా, సుంకాలు ఈనెల 27 నుంచి అమలవుతాయి.

మళ్లీ మొదటికే!

(మొదటిపేజీ తరువాయి)

స్వీకరించింది. ఇటీవల ఈ పరీక్షలకు సంబంధించిన తుది ఆన్సర్ కీలు విడుదలయ్యాయి. పరీక్షా ఫలితాలు త్వరలో విడుదలకానున్న నేపథ్యంలో అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు.

కన్వీనర్ ఎలా స్పందిస్తారో...

షెడ్యూలు ప్రకారం ఇప్పటికే డీఎస్సీ నియామక ప్రక్రియ పూర్తవ్వాల్సి ఉంది. కీలలో తప్పిదాలతో జాప్యం జరుగుతోంది. ఎట్టకేలకు తుది కీలు విడుదలయ్యాక... మళ్లీ వాటిని సవరించే పరిస్థితి ఉండబోదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ సమయంలో తుది కీలో లోపాలను సవరించకుండా...వాటితోనే తుది కీను రూపొందించడం సరికాదని అభ్యర్థులు వాపోతున్నారు. దీనిపై మంగళగిరిలోని విద్యాభవన్‌లో డీఎస్సీ కన్వీనర్ కృష్ణారెడ్డిని అభ్యర్థులు కలిసి విన్నవించారు.

తప్పులతో కూడిన సమాధానాలు ఉన్న సదరు ప్రశ్నలకు తగిన ఆధారాలతో వివరణ ఇచ్చారు. తమకు న్యాయం చేయాలని వారంతా డిమాండ్ చేశారు. దీనిపై డీఎస్సీ కన్వీనర్ ఏ విధంగా స్పందిస్తారనేది వేచి చూడాలి. డీఎస్సీ తుది ఆన్సర్ వచ్చిన వారం రోజుల్లోగా ఫలితాలు వెల్లడిస్తామని గతంలో అధికారులు తెలిపారు. నోటిఫికేషన్‌లోనూ ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. దాని ఆధారంగా ఆగస్టు మొదటి వారంలో తుది కీలు విడుదలయ్యాయి.

ఈ వారంలోనే ఫలితాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. ఇంత తక్కువ వ్యవధిలో ఆన్సర్‌కీలో మార్పులు చేస్తారా లేదా అనేది ఉత్కంఠగా మారింది. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది తర్వాత డీఎస్సీ పరీక్షలను నిర్వహించింది.

వాస్తవాలు కప్పిపుచ్చలేరు

(మొదటిపేజీ తరువాయి)

రాజస్థాన్, బీహార్‌లో ఈసీ వెబ్‌సైట్ పనిచేయడం లేదు' అని రాహుల్ వివరించారు. తమ డేటా ఆధారంగా ప్రజలు ప్రశ్నించడం మొదలుపెడితే ఈ వ్యవస్థ కుప్పకూలుతుందన్నారు. ఎన్నికల మోసాలపై దర్యాప్తు జరిపించాలని కర్నాటక ప్రభుత్వాన్ని కోరారు. అదే సమయంలో ఈసీకి ఐదు ప్రశ్నలు సంధించారు. ప్రతిపక్షానికి డిజిటల్ ఓటర్ జాబితాలు ఎందుకు ఇవ్వడం లేదు? ఏం దాస్తున్నారు? సీసీటీవీ, వీడియో సాక్ష్యాధారాలను నాశనం చేస్తున్నారు ఎందుకు? ఎవరు చెబితే చేస్తున్నారు? ఫేక్ ఓటింగ్, ఓటర్ జాబితాల్లో లోపాలు ఎందుకున్నాయి? ప్రతిపక్ష నాయకులను హెచ్చరించడం, బెదిరించడం ఎందుకు? కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) బీజేపీకి ఏజెంటుగా మారిందా? స్పష్టం చేయండి అంటూ రాహుల్ నిలదీశారు. దేశ ప్రజాస్వామ్యం విలువ కట్టలేనిదిగా వర్ణించారు. దానిని దోచుకోవాలనుకోవడం దారుణమన్నారు. న్యాయం కోసం, ప్రజాస్వామ్యం కోసం పోరాడతామని రాహుల్ స్పష్టంచేశారు. గత లోక్‌సభ ఎన్నికలప్పుడు కర్నాటకలోని మహదేవపుర అసెంబ్లీ నియోజకవర్గంలో ఓట్ల చోరీపై విచారణ జరిపించాలని, తప్పు చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని సిద్దరామయ్య ప్రభుత్వానికి సూచించారు.

2024 లోక్‌సభ ఎన్నికలప్పుడు బీజేపీ గెలుపుకు కారణమైన 1,00,250 నకిలీ ఓట్లు మహదేవపురలో బయట పడ్డాయని తెలిపారు.

గత పదేళ్ల ఎలక్ట్రానిక్ ఓటర్ డేటా, పోలింగ్ కేంద్రాల వీడియోలు ఇవ్వాలని ఈసీని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఓట్లు దోచుకున్న నేరంలో ఆధారాలు దాస్తున్నట్లు భావించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఐదు రకాలుగా ఓట్లను ఈసీ దోచుకున్నట్లు ఆరోపించారు. నకిలీ ఓటర్లను సృష్టించడం ద్వారా బీజేపీ కోసం ఓటర్లను పెంచేలా ఈసీ పనిచేసిందని గత ఆరు నెలలలో కనిపెట్టామన్నారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించాలంటే ప్రజలు చైతన్యవంతం కావాలని, ఎన్నికల్లో న్యాయం ఉండాలంటే ప్రభుత్వ కక్షసాధింపు ఆగాలని రాహుల్ చెప్పారు. 'ఎన్నికలు-ఓట్ల దొంగలను వదిలిపెట్టేది లేదు. ఎంత తెలివిగా దాక్కున్నా వెతికి పట్టుకుంటాం. అయితే కొంత సమయం పట్టవచ్చు' అని అన్నారు. ప్రజాస్వామ్యంలో ఓట్లను దోచుకోవడం అంటే ప్రజల గొంతు నొక్కేయడమేనని, ఎన్నికల సంఘం రాజ్యాంగానికి కట్టుబడాలే తప్ప బీజేపీ కోసం పనిచేయరాదని అన్నారు. రాజ్యాంగాన్ని, దేశ పౌరుల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత ఈసీకి ఉందని, స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా పనిచేయాలని హితవుపలికారు. అధికారం కోసం ప్రధాని మోదీ 25 స్థానాలు దోచుకున్నారని వ్యాఖ్యానించారు. దేశవ్యాప్తంగా ఎన్నికల సమగ్రత ప్రశ్నార్థకంగా మారిందనిన్నారు. కాగితాలకే పరిమితమైన ఓటర్లు పరిమితమైనట్లు ఉన్నారని తమ విచారణలో తేలిందని చెప్పారు. 'మీరు ఆధారాలను దాచిపెట్టలేరు... ప్రతిక్షాన్ని ఎదుర్కోక తప్పదు' అని ఎన్నికల సంఘాన్ని రాహుల్ హెచ్చరించారు. రాజ్యాంగ పరిరక్షణలో ప్రతి ఒక్క కార్యకర్త భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు.

ఓట్లు దోచుకున్న సర్కారు కొనసాగలేదు: ఖర్గే

ఓట్లు, సీట్లు దోచుకొని అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఎంతో కాలం కొనసాగలేదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యానించారు. బీజేపీ నాయకత్వం పెద్దఎత్తున ఎన్నికల మోసాలకు పాల్పడిందని, ప్రజామోదంతో అధికారంలోకి రాలేదని, ఓట్లు దొచుకొని గద్దెనెక్కిందన్నారు. బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ నియోజకవర్గంలో 6.6లక్షల ఓట్ల అక్రమాలను రాహుల్ బయటపెట్టారని చెప్పారు. 2024 ఎన్నికలు 'ప్రజలకు జరిగిన మోసం'గా వర్ణించారు. రాజ్యాంగాన్ని, ఓటు హక్కును, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడం కోసం కాంగ్రెస్ కట్టుబడి ఉందన్నారు. ప్రజామోదం లేకపోయినా ఓట్లు దోచుకోవడం ద్వారా ఎన్నికల్లో గెలిచేందుకు మోదీ-అమిత్‌షా యత్నిస్తున్నారని, ఎన్నికల సంఘాన్ని దుర్వినియోగిస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుత పాలనలో నైతిక చట్టబద్ధత లేదని ఖర్గే దుయ్యబట్టారు. 'ఇది దోపిడీ ప్రభుత్వం. దేశాభివృద్ధి కోసం పని చేస్తున్నట్లు మోదీ చెబుతున్నది పచ్చిఅబద్ధం. మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, బీహార్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో ఎన్నికల మోసాలు వెలుగు చూశాయి. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సీబీఐ, ఐటీ ద్వారా ప్రతిపక్ష నాయకులను బెదిరించడం, వ్యూహాత్మక ఫిరాయింపులు చేయించడం ద్వారా ప్రజామోదం లేకున్నా కర్నాటక, మహారాష్ట్ర, గోవా, మణిపూర్‌లో బీజేపీ ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. దేశ ఆర్థిక వ్యవస్థను ప్రధాని నాశనం చేశారు. నోట్ల రద్దు వంటి ఘోర తప్పిదాలతో తీవ్ర నష్టం కలిగించారు. ఇప్పుడు దేశానికి హానికలిగించే మరో తప్పు చేయబోతున్నారు. ఎన్నికల దోపిడీని ప్రతి ఒక్కరు గుర్తించాలి. దానిని ప్రతిఘటించాలి' అని ఖర్గే ఉద్ఘాటించారు. ఎన్నికల మోసాలకు సహకరించడం ద్వారా విశ్వసనీయతను కోల్పోయిందంటూ తమ పార్టీ ఎంపీలంతా సోమవారం ఈసీకి వినతులు అందజేస్తారన్నారు. ఈసీ అక్రమాలపై ప్రతిపక్ష పార్టీలన్నీ ఐక్యంగా ఉన్నాయని ఖర్గే చెప్పారు. ఉమ్మడి సందేశం ఇచ్చేలా ఇండియా ఐక్య సంఘటన నాయకులు ఏకతాటిపైకి వచ్చారని అన్నారు. ఐక్యంగానే మోదీ మోసాలను ఆపగలమని వక్కాణించారు. మన ఓట్లు ఒకసారి దోపిడీకి గురయ్యాయంటే మన మనుగడకు ముప్పు ఏర్పడినట్లే అని హెచ్చరించారు.

నాడు మహాత్మా గాంధీ చేపట్టిన క్విట్ ఇండియా ఉద్యమాన్ని ఆదర్శకంగా చేసుకొని 'చావో-రేవో' అన్న స్ఫూర్తితో మన రాజ్యాంగం, ప్రజాస్వామ్యం పరిరక్షణ కోసం పోరాడదామంటూ ఖర్గే పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ తన పదవికి రాజీనామా చేయాలని, ఆ పదవిలో కొనసాగే నైతిక హక్కు ఆయనకు లేదని కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అన్నారు. మోదీ అధికారం కోసం సీట్లను దోచుకున్నట్లు రాహుల్ బయట పెట్టిన ఎన్నికల మోసాలతో స్పష్టమైందన్నారు. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మాట్లాడుతూ దేశంలో న్యాయబద్ధమైన బ్యాంకులు (లీగల్ బ్యాంక్స్) ఏర్పాటు చేసి, బూత్‌స్థాయిలో ప్రతి ఒక్క ఓటరు హక్కును పరిరక్షించాలని రాహుల్ ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. బ్లడ్ బ్యాంకుల తరహా లీగల్ బ్యాంకుల ఏర్పాటు దిశగా అడుగులు వేస్తామన్నారు.

అమెరికా సుంకాలపై మౌనమెందుకు?

(మొదటిపేజీ తరువాయి)

వెలుపల నిరసనకు దిగారు. భారత సార్వభౌమత్వం, స్వయంప్రతిపత్తిపై రాజీ వద్దని కేంద్రానికి వామపక్ష ఎంపీలు హితవు పలికారు. ట్రంప్‌కుగానీ, ఇతర ఏ శక్తికిగానీ దేశ సార్వభౌమత్వానికి సంబంధించిన వ్యవహారాల్లో జోక్యం చేసుకొనే హక్కు లేదని ఎంపీలు స్పష్టంచేశారు. భారత్‌ను బాహ్య ఒత్తిళ్లకు తలొగ్గనివ్వబోమన్నారు. చత్తీస్‌గఢ్, ఒడిశాలో హిందూత్వ మూకలు రెచ్చిపోతుండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కులం పేరిట దూషణలు, దాడులను ఆపాలని వామపక్ష ఎంపీలు డిమాండ్ చేశారు.

ప్రణాళికాబద్ధంగా ఎస్ఎల్‌బీసీ పునరుద్ధరణ

(మొదటిపేజీ తరువాయి)

వెల్లడించారు. శ్రీశైలం దిగువ నుంచి వచ్చే వరద ... మిగిలిన తొమ్మిది కిలోమీటర్ల టన్నెల్ తవ్వకానికి ఆటంకంగా మారిందని చెప్పారు. ఫలితంగా ప్రతి ఏటా ఆ నీటిని ఎత్తిపోసేందుకే ఏడాదికి రూ. 750 కోట్లు విద్యుత్ చార్జీలకు చెల్లించాల్సి వస్తుందన్నారు. నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ అధ్వర్యంలో హెలికాప్టర్ ద్వారా ఎలక్ట్రోమేఘ్నటిక్ సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. జియాలజికల్ సర్వేని కుడా పనుల్లో భాగస్వామ్యం చేస్తామన్నారు. పునరుద్ధరణ పనులు ప్రణాళికాబద్దంగా నిర్వహించేందుకు లిడార్ సర్వే కుడా నిర్వహించ బోతున్నట్లు ప్రకటించారు.

మూడు దశాబ్దాల తరువాత పదోన్నతులు

మూడు దశాబ్దాల అనంతరం నీటిపారుదల శాఖలో పదోన్నతుల ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేశామన్నారు. 47 మంది అసిస్టెంట్ ఇంజినీర్ల నుంచి డిప్యూటీ ఇంజినీర్ల వరకు 127 మంది, ఎస్ఈల సీఈల వరకు 13 మంది ఉన్నారన్నారు. ప్రతిభ, సీనియారిటీలను ప్రాతిపదికగా తీసుకున్నామన్నారు.

సింగూర్ డ్యామ్‌కు భద్రత కల్పించండి

సింగూర్ డ్యామ్ ను పరిశీలించి అత్యవసర భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి ఆదేశించారు. వర్షాకాలంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న డ్యామ్ లు, రిజర్వాయర్‌లతో పాటు ఇతర జలాశయాలను నిత్యం పర్యవేక్షించాలని సూచించారు. ములుగు జిల్లా ఏటూరునాగరం మండలం తుపాకులగూడెం సమీపంలో నిర్మిస్తున్న సమ్మక్క బ్యారేజ్ నిర్మాణం ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ బ్యారేజ్ నిర్మాణంతో చత్తీస్‌గఢ్‌లో సుమారు 40 వేల హెక్టార్లు, కోటూర్, తార్లగూడ, గంగారాం, కంబల్పేటలతో 10.9 చ.కి.మీ భూబాగం ముంపునకు గురౌతుందని అధ్యయనంలో తేలిందన్నారు. అయితే చత్తీస్‌గఢ్‌తో సంప్రదించి అవసరమైన అనుమతులు తీసుకుంటామన్నారు.

28న ప్రతిజ్ఞా దినం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : చంద్రబాబు ప్రభుత్వం ప్రజలపై వేస్తున్న విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా, అదానీ స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ విద్యుత్ ఉద్యమ అమరవీరుల సంస్మరణ దినమైన ఈ నెల 28న ప్రతిజ్ఞాదినంగా రాష్ట్ర వ్యాప్తంగా పాటించాలని పది వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. ఈ మేరకు విజయవాడ సీపీఎం రాష్ట్ర కార్యాలయంలో జరిగిన పది వామపక్ష పార్టీల సమావేశం శుక్రవారం తీర్మానించింది.

అఫిడవిట్ ఇవ్వండి

న్యూఢిల్లీ: బీజేపీ, ఎన్నికల సంఘం (ఈసీ) కలిసి ఎన్నికల్లో 'భారీ నేరపూరిత మోసానికి' పాల్పడ్డాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేస్తున్న సంచలన ఆరోపణలపై కేంద్ర ఎన్నికల సంఘం ఆగ్రహం వ్యక్తం చేసింది. మీరు చేసిన ఆరోపణలు నిజమైతే సంతకం చేసిన అఫిడవిట్ ఇవ్వండని సవాల్ విసిరింది. బీహార్‌లో 65 లక్షల ఓట్లు తొలగిస్తున్నామని తాము ఆగస్టు 1న ప్రకటన విడుదల చేసినా... మార్పులు చేర్పులపై ఇప్పటివరకు ఏ పార్టీ తమను సంప్రదించలేదని ఈసీ స్పష్టం చేసింది. ఓట్ల తొలగింపుపై విమర్శలు చేస్తున్న రాహుల్ గాంధీ సైతం ముసాయిదాపై ఇంతవరకు ఎటువంటి అభ్యంతరాలు నమోదు చేయలేదని పేర్కొంది. అభ్యంతరాలు చెప్పడానికి ఆయన ఎందుకింత ఆలస్యం చేస్తున్నారని ప్రశ్నించింది. తాము విడుదల చేసిన ఓట్ల తొలగింపు ముసాయిదాపై తన అభ్యంతరాలను రాహుల్ గాంధీ ఇప్పుడు కాకుండా ఎప్పటిలాగే బీహార్ ఎన్నికలు పూర్తయ్యాక ఇస్తారేమోనని ఈసీ వ్యంగ్యాస్త్రాలు విసిరింది. ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, హర్యానా, కర్నాటకలోని పలు ప్రాంతాల్లో ఎన్నికల సమయంలో జరిగిన ఓట్ల చోరీ గురించి రాహుల్ గాంధీ ఎన్నికల సంఘాన్ని హెచ్చరించిన అనంతరం ఈసీ ఈ వ్యాఖ్యలు చేసింది.

ఈసీకి ఎలా తెలుసు: ప్రియాంక

ఎన్నికల రిగ్గింగ్‌కు సంబంధించి రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలకు తగిన ఆధారాలు సమర్పించాలని ఎన్నికల కమిషన్ రాహుల్‌ను సవాల్ చేయడంపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ ఆగ్రహం వ్యక్తంచేశారు. మహారాష్ట్ర, హర్యానా మొదలైన రాష్ట్రాల్లో ఎన్నికల సమయంలో అవకతవకలు జరిగినట్లు పేర్కొన్న వెంటనే ఈసీ ఆ విషయంలో దర్యాప్తు చేయడం మానేసి... రాహుల్‌గాంధీ తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారని దబాయిస్తోందన్నారు. అసలు దర్యాప్తే చేయనప్పుడు ఆయన వాదనలు తప్పని ఎన్నికల కమిషన్‌కు ఎలా తెలుస్తుందని ప్రశ్నించారు. తాము సమర్పించిన ఆధారాలు ఈసీ ముందే ఉన్నాయని, వాటిని పరిగణనలోకి తీసుకొని దర్యాప్తు చేయాలని సూచించారు. తాము ఆందోళన వ్యక్తం చేస్తోంది కేవలం ఒక పార్టీ గురించి మాత్రమే కాదని, దేశంలోని ప్రజాస్వామ్య వ్యవస్థ గురించని ఆమె పేర్కొన్నారు.

తయారీ రంగానికి కేంద్రం

(మొదటిపేజీ తరువాయి)

వాటా తయారీ రంగానిదే. తొమ్మిది నెలల్లోనే రూ.లక్ష కోట్ల విలువైన వాణిజ్య ఎగుమతులు జరిగాయి. జీఎస్ డీపీ వృద్ధి రేటు 8.2 శాతం. ఇది జాతీయ సగటు కంటే ఎక్కువ" అని వివరించారు. "2040 నాటికి దేశీయ విద్యుత్ డిమాండ్ రెట్టింపు అవుతుందని ఆర్థిక సర్వే(2024 - 25) లెక్క తేల్చింది. ఈ డిమాండ్‌ను అందిపుచ్చుకొని రాష్ట్రానికి కొత్త పరిశ్రమలను తీసుకొచ్చేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నాం. తెలంగాణను రెన్యువబుల్ ఇంజిన్ ఆఫ్ ఇండియాగా మార్చాలనే సంకల్పంతో క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ - 2025 ను తీసుకొచ్చాం. ఇప్పటికే క్లీన్ ఎనర్జీలో రూ.29వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించగలిగాం. 2030 నాటికి న్యూ రెన్యువబుల్ కెపాసిటీని 20వేల మెగావాట్లకు పెంచేలా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నాం" అని చెప్పారు. "బ్యాటరీలు, పవర్ కాంపోనెంట్స్, స్మార్ట్ గ్రిడ్స్ తదితర రంగాల్లో తోషిబా వంటి దిగ్గజ సంస్థలను తెలంగాణాకు ఆహ్వానించేందుకు ప్రత్యేకంగా గ్రీన్ ఎనర్జీ ఎక్విప్‌మెంట్ జోన్లు ఏర్పాటు చేయబోతున్నాం. స్మార్ట్ ఎనర్జీ సొల్యూషన్స్ కోసం తోషిబా - తెలంగాణ ఆర్ అండ్ డీ హబ్ కు శ్రీకారం చుట్టబోతున్నాం. క్లీన్ టెక్, సెమీ కండక్టర్స్, రోబోటిక్స్, అడ్వాన్స్ మాన్యుఫ్యాక్చరింగ్ లో పెట్టుబడులకు తెలంగాణలో అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఈ వేదిక ద్వారా జపాన్ కంపెనీలను రాష్ట్ర ప్రభుత్వం తరఫున సాదరంగా ఆహ్వానిస్తున్నా" అని అన్నారు.

దుష్ప్రచారానికి ధీటైన సమాధానం...

"కొత్త పరిశ్రమలను రాష్ట్రానికి తీసుకొచ్చి యువతకు ఉపాధి కల్పించాలనే సంకల్పంతోనే

అంతర్జాతీయ, జాతీయ కంపెనీలతో ఒప్పందాలు చేసుకుంటున్నాం. కానీ... కొందరు కావాలని పని గట్టుకొని వాటిని ఉత్తుత్తి ఎంవోయూ లు అంటూ మాపై దుష్ప్రచారం చేస్తున్నారు. ఈ విమర్శలకు ఈరోజు మేం కాదు, తోషిబా కంపెనీనే మీకు ధీటైన సమాధానం ఇస్తుంది. ఏప్రిల్‌లో జపాన్ పర్యటనలో రూ. 562 కోట్ల పెట్టుబడులకు సంబంధించి తోషిబా కంపెనీతో ప్రభుత్వం ఎంవోయూ చేసుకుంది. బుల్లెట్ ట్రెన్ స్పీడ్ తో ఈరోజు రూ.177 కోట్లతో ఏర్పాటు చేయబోయే ఈహెచ్‌వీ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల ప్లాంట్ విస్తరణ పనులకు భూమి పూజ నిర్వహించాం. రూ.65 కోట్లతో ఏర్పాటు చేసిన స్టేట్ ఆఫ్ ది ఆర్ట్ మాన్యుఫాక్చరింగ్ ఫెసిలిటీ ఫర్ సీ ఆర్ జీవో కోర్ ప్రాసెసింగ్ సెంటర్, రూ.105 కోట్లతో స్టేట్ ఆఫ్ ది ఆర్ట్ మాన్యుఫాక్చరింగ్ ఫెసిలిటీ ఫర్ సర్జ్ అరెస్టేర్ ను ప్రారంభించాం. ఈ పెట్టుబడులతో ఎనర్జీ రంగంలో తెలంగాణ బ్రాండ్ మరింత విశ్వవ్యాప్తం అవుతుంది" అని ఆశాభావం వ్యక్తం చేశారు. మంత్రి వివేక్ వెంకట స్వామి, ఐటీ శాఖ స్పెషల్ సీఎస్ సంజయ్ కుమార్, జపాన్ ఎంబసీ ఎకనామిక్ అండ్ డెవలప్మెంట్ మంత్రి క్యోకో హుకుగో, తోషిబా కార్పొరేషన్ కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ హీరోషి కనేట, సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య తదితరులు పాల్గొన్నారు.

అంగుళం భూమి లాక్కోనివ్వం

(మొదటిపేజీ తరువాయి)

పరిరక్షణకు దలేవాల్ ప్రతిజ్ఞ బూనారు. నాలుగు నెలల కిందట నిరాహార దీక్ష విరమించిన దలేవాల్... తన మద్దతుదారులతో కలిసి పంజాబ్ భూసేకరణ విధానానికి వ్యతిరేకంగా పోరాటం చేపట్టారు. జోధన్‌లోని ధాన్యం మార్కెట్ వద్ద భారీ సభ నిర్వహించారు. రైతుల బల ప్రదర్శనకు చిహ్నంగా ర్యాలీ నిర్వహించారు. రైతులు వేలాదిగా పాల్గొనడంతో మార్కెట్ వద్ద వెయ్యి మంది పోలీసులు మోహరించారు. ర్యాలీలో కర్నాటక, హర్యానా, రాజస్థాన్, మహారాష్ట్ర నుంచి జాతీయస్థాయి నాయకులు పాల్గొన్నారు. గ్రామాల మనుగడే ప్రశ్నార్థకమయ్యే వినాశకర విధానాలు మానుకోవాలని పంజాబ్ ప్రభుత్వాన్ని దలేవాల్ హెచ్చరించారు. భూసేకరణ విధానం కింద సాగు భూముల్లో ఒక్క అంగుళం కూడా ప్రభుత్వం లాక్కునేందుకు రైతులు అంగీకరించబోరని తేల్చిచెప్పారు. భూసేకరణ విధానానికి వ్యతిరేకంగా ఈనెల 25న ఢిల్లీలో ఒక రోజు ఆందోళనకు పిలుపునిచ్చారు. ప్రతి అంగుళాన్ని రైతులు కాపాడుకుంటారన్న స్పష్టమైన సందేశం కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలకు ఈ ఆందోళన ద్వారా ఇవ్వనున్నట్లు దలేవాల్ వక్కాణించారు. వ్యవసాయం, డెయిరీ, పౌల్ట్రీ, మత్స్య సాగు రంగాల్లో అమెరికా కాలు మోపేందుకు ప్రయత్నిస్తున్న వేళ భారతీయ రైతులపై అన్ని వైపుల నుంచి దాడులు జరుగుతున్నాయని రైతు నాయకులు ఆందోళన వ్యక్తంచేశారు. వ్యవసాయ రంగాన్ని పరిరక్షించుకోవడం కోసం రైతులంతా ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈనెల 25న ఢిల్లీలో కిసాన్ మహాపంచాయత్ జరగబోతోందని తెలిపారు. 10వ తేదీన ఇస్రానా, పానిపట్‌లో, 11,12 తేదీల్లో రాజస్థాన్‌లోని శ్రీగంగానగర్, హనుమాన్‌గఢ్‌లో, 14-15 తేదీల్లో మధ్యప్రదేశ్‌లోని ఇటార్సి, అశోక్‌నగర్‌లో, 17, 18, 19 తేదీల్లో ఉత్తరప్రదేశ్‌లోని అలీగఢ్, సంబల్, బాఘ్‌పట్‌లో మహా పంచాయత్‌లు నిర్వహిస్తామని రైతు నాయకులు వెల్లడించారు.

సమ్మిళిత అభివృద్ధి దిశగా పాలన

(మొదటిపేజీ తరువాయి)

మహాత్మా జ్యోతిరావు పూలే, ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటాలకు మంత్రి ఘన నివాళులర్పించారు. అనంతరం కళాశాలకి అనుబంధంగా ఉన్న అకడమిక్ బ్లాక్‌లోని సెమినార్ హాల్ ను పొన్నం ప్రారంభించారు. అనంతరం బోధన బోధనేతర సిబ్బందితో సమావేశమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, విద్యాసంస్థల్లో బీసీ సెల్ లను ఏర్పాటు చేయాలని సూచించారు. బీసీ రిజర్వేషన్ కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో అన్ని స్థాయిల్లోనూ అలుపెరుగని పోరాటం చేస్తున్నట్టు వివరించారు. రిజర్వేషన్ వల్ల విద్యార్థులు... ఉద్యోగులకి చాలా ప్రయోజనం జరుగుతుందన్నారు. అన్నదాతలకు కొత్త వంగడాలు, సాంకేతిక పరిజ్ఞానం అందించడానికి శాస్త్రవేత్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. తమ ప్రభుత్వానికి వ్యవసాయం ప్రాధాన్యత అంశమన్నారు. వ్యవసాయ కళాశాలలు, పరిశోధన స్థానాలకు వెళ్లేందుకు రైతులు, విద్యార్థులకు అవసరమైన రవాణా ఏర్పాటు చేస్తామన్నారు. స్కాలర్‌షిప్‌ల పెండింగ్ అంశాన్ని సమీక్షిస్తానన్నారు. వెస్ట్రన్ సిడ్నీ విశ్వవిద్యాలయంతో కలిసి డ్యూయల్ డిగ్రీ అందించడం గొప్ప ముందడుగు అని మంత్రి అభినందించారు. ఆ ఒప్పందంలో భాగంగా యూజీ పీజీ విద్యార్థులకు కొంత శాతం ఆర్థిక సాయం అందించే అంశాన్ని పూర్తి సానుకూలంగా పరిశీలిస్తానని హామీ ఇచ్చారు. స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ... బీసీ సెల్ మౌలిక వసతులకి రూ.10 లక్షలు అందిస్తారని పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. అనుభవం, పట్టుదల ఉన్న అల్దాస్ జానయ్య నేతృత్వంలో విశ్వవిద్యాలయం మంచి అభివృద్ధి పథాన సాగుతుందని దేశ, విదేశాల్లోని అధునాతన విజ్ఞానం రైతులకు చేరువవుతుందని పొన్నం ఆకాంక్షించారు. భారతదేశం విభిన్న వర్గాల, కులాల సమాహారం అని అందరూ అందరి అభివృద్ధికి కలిసి పనిచేయాలని అభిప్రాయపడ్డారు. వర్సిటీ అభివృద్ధికి ఉపకులపతి జానయ్య బాగా కృషి చేస్తున్నారని ప్రశంసించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాజ్యాంగ విలువలకు అనుగుణంగా పాలన సాగిస్తున్నట్టు ఉపకులపతి అల్దాస్ జానయ్య అన్నారు. ప్రజాస్వామిక స్ఫూర్తి, సామాజిక న్యాయం, సమ్మిళిత అభివృద్ధి, సంక్షేమం ప్రధాన అంశాలుగా ప్రభుత్వ పాలన సాగుతుందన్నారు. విద్యార్థులకు డ్యూయల్ డిగ్రీ అందించే ఉద్దేశంతో వెస్ట్రన్ సిడ్నీ విశ్వవిద్యాలయంతో ఒప్పందం కుదుర్చుకున్నామన్నారు. యూజీలో 40 మందికి, పీజీలో 10 మందికి ప్రవేశాలు కల్పిస్తున్నామని వారి ఫీజుల చెల్లింపులకి ఆర్థిక సాయం... విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలలు, పరిశోధనా స్థానాలకు విద్యార్థులు, రైతులు వెళ్లేందుకు రవాణా సదుపాయం కల్పించవలసిందిగా మంత్రి పొన్నం ప్రభాకర్‌కి ఉపకులపతి వినతిపత్రాలు అందించారు. అతిథులను సన్మానించారు. అసోసియేటెడ్ డీన్ గోవర్ధన్ స్వాగతోపన్యాసం చేశారు. ప్రొఫెసర్ సుజాత, బిక్షపతి, కవిరాజ్, భావన తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దరువు

బ్లాక్ మార్కెట్‌లో విక్రయాలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో ఎరువుల ధరల మోత మోగుతోంది. ఏపీ కోటా పక్క రాష్ట్రాలకు, ఇతర అవసరాలకు మళ్లుతుండటంతో బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయాలు జరుగుతున్నాయి. మార్కెట్‌లో ఎరువుల డిమాండ్‌ను, రైతుల అవసరాన్ని వ్యాపారులు సొమ్ము చేసుకుంటూ అధిక లాభాలు గడిస్తున్నారు. బస్తాకు రూ.100 నుంచి రూ.300 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. మార్కెట్‌లో ఎరువులు దొరకడం లేదని, అధిక ధరలకు కొనాల్సి వస్తుందని రైతులు చెబుతుండగా...రాష్ట్రంలో యూరియా, డీఏపీ ఎరువులు సమృద్ధిగా ఉన్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికారులు బుకాయిస్తూ ప్రకటనలు చేస్తుండటం ఆశ్చర్యం కలిగిస్తోంది. అయితే ఈ గందరగోళానికి కారణం వ్యవసాయ యూరియా పెద్దమొత్తంలో దారిమళ్లుతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గత ఐదేళ్లతో పోలిస్తే ఈ ఏడాది ఎరువుల అమ్మకాలు గణనీయంగా పెరిగాయి. ప్రస్తుత ఖరీఫ్‌లో జులై ఆఖరు నాటికి యూరియా అమ్మకాలు గతేడాది కంటే 91 వేల టన్నులు పెరిగింది. అయినప్పటికీ ఎరువుల కోసం దుకాణాల ముందు రైతులు పడిగాపులు పడుతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. యూరియాను వ్యవసాయేతర అవసరాలకు వినియోగిస్తుండటంతో పాటు ఇతర ప్రాంతాలకు తరలింపు వంటి కారణాల వల్ల మార్కెట్‌లో ఎరువుల కొరత ఏర్పడింది. ఎరువులు పక్క రాష్ట్రాలకు తరలిపోవడం, వ్యవసాయేతర పరిశ్రమలకు, ఉత్పత్తుల తయారీకి యూరియా మళ్లిస్తున్నారన్న ఆరోపణలూ ఉన్నాయి. అయితే పంటల సాగు పెరిగి యూరియాకు డిమాండ్ వచ్చిందని, వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నారు.

అయోధ్య సేవలు మరువలేనివి

విశాలాంధ్ర జిల్లా బ్యూరో - మహబూబబాద్ : సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ అయోధ్య చారి సిపిఐ పార్టీకి చేసిన సేవలు మరువలేనివని సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయ సారధి అన్నారు. శుక్రవారం సిపిఐ మహబూబాద్ జిల్లా కార్యవర్గ సమావేశం నెల్లూరి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన కొత్తగూడెం జిల్లా మణుగూరు రామానుజవరంకు చెందిన బొల్లోజు అయోధ్య చారికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 40 సంవత్సరాలుగా భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఉమ్మడి ఖమ్మం జిల్లాకు మరియు కొత్తగూడెం జిల్లాకు ఎనలేని పోరాటాలు చేసి, ప్రజల పక్షాన పని చేశాడన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా జిల్లా పరిషత్ వైస్ చైర్మన్‌గా ఎన్నికై ప్రజాప్రతినిధిగా కూడా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాడని పేర్కొన్నారు అయోధ్యచారి ప్రమాదవశాత్తు మరణించడం సిపిఐ రాష్ట్ర పార్టీకి తీరని లోటని ముఖ్యంగా కొత్తగూడెం జిల్లాకు ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ప్రజా ఉద్యమానికి తీరని లోటని బి విజయసారధి అన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు బి అజయ్ సారధి రెడ్డి, నల్లు సుధాకర్ రెడ్డి, నెల్లూరు నాగేశ్వరరావు, పెరుగు కుమార్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి, కట్లోజు పాండురంగ చారి, వరిపెల్లి వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

మూసి నది పరీవాహక ప్రాంతం పరిశీలించిన ఎస్పీ

విశాలాంధ్ర - సూర్యాపేట : వర్షాకాలం సందర్భంగా ప్రాజెక్టులు, వంతెనల వద్ద పోలీసులు అప్రమత్తంగా ఉన్నారని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఐపిఎస్ అన్నారు. శుక్రవారం సూర్యాపేట రూరల్ పరిధిలో మూసి నది ప్రవాహం పరిశీలించారు. భీమవరం గ్రామం వద్ద వంతెనను పరిశీలించారు. పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, ప్రమాద హెచ్చరిక సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రజలు అధికారుల సూచనలు పాటించాలని ప్రవహించే నీటిలోకి ఎవ్వరూ వెళ్ళవద్దు అన్నారు. చేపల వేటకు వెళ్ళరాదు అని కోరారు. యువత సెల్ఫీలు అంటూ విషాదం చేసుకోవద్దు అని అన్నారు. సూర్యాపేట రూరల్ పరిధి, పెనపహాడ్, నేరేడుచర్ల, పాలకవీడు పరిధి మూసి పరివాహక ప్రాంతాలు ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నామన్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ గేట్లు ఎత్తడం వల్ల కృష్ణానదిలో నీటి ఉధృతి అధికంగా ఉన్నది కావున నాటుపడవలతో వెళ్ళవద్దు, నదిలోకి దిగవద్దు అన్నారు. అత్యవసర సమయాల్లో పోలీసు సేవలను సద్వినియోగం చేసుకోవాలని డయల్ 100, జిల్లా స్పెషల్ బ్రాంచ్ 8712686026 కు ఫోన్ చేయాలని అని కోరారు. మూసి సందర్శించిన ఎస్పీ వెంట సూర్యాపేట డివిజన్ డిఎస్పీ ప్రసన్న కుమార్, స్థానిక అధికారులు ఉన్నారు.

ప్రజలకు సేవ చేయడంలోనే నిజమైన ఆనందం

విశాలాంధ్ర - తొర్రూర్: జన్మదిన, పెండ్లి, వివాహ వేడుకలు పేదల మధ్య జరుపుకుని, వారికి సహాయ సహకారాలు అందించడమే నిజమైన సేవ అని లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ డాక్టర్ సూర్నం రామ నరసయ్య అన్నారు. శుక్రవారం పిఆర్సి లయన్ కె యాదగిరి రెడ్డి జన్మదినోత్సవ సందర్భంగా తొర్రూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని అన్నారం క్రాస్ రోడ్డులో ప్రజలకు అల్పాహారం అందజేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలు, అండ ఆదరణ లేని వారికి మేమున్నామని భరోసా ఇస్తూ, వారిని ఆదుకోవడంలోనే నిజమైన ఆనందం సంతోషం ఉంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ ముదుపు రవీందర్ రెడ్డి, క్లబ్ సెక్రెటరీ వజినపల్లి శ్రీనివాస్, క్లబ్ ఫాస్ట్ సెక్రటరీ పెరుమాళ్ళ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ బిల్లుల వ్యవహారంలో ఏఈ సస్పెన్షన్

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : ముధోల్ మండలంలోని ఎడ్ బిడ్ పీఆర్ పనుల్లో నకిలీ బిల్లుల వ్యవహారం వెలుగులోకి రావడంతో అక్కడి అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ) సురేందర్‌ను సస్పెండ్ చేసినట్లు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. ఈ వ్యవహారం తమ దృష్టికి వచ్చాక తదుపరి విచారణకు ఆదేశించినట్లు కలెక్టర్ గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. నకిలీ బిల్లుల వ్యవహారం నిజమేనని తేలినందున ఆయన్ను సస్పెండ్ చేయడం జరిగిందని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులు చట్టవిరుద్ధంగా వ్యవహరించకూడదని, భవిష్యత్‌లో ఇటువంటి అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ఉద్యోగులందరూ క్రమశిక్షణతో, నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని సూచించారు.

కలెక్టర్, సబ్ కలెక్టర్‌లకు రాఖీ కట్టిన మహిళ న్యాయవాదులు

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : రక్షాబంధన్ పర్వ దినం పురస్కరించుకొని శుక్రవారం కొత్తగూడెం బార్ అసోసియేషన్ మహిళా న్యాయవాదులు కలెక్టర్ జితేష్ వి పాటిల్, సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్టలకు రాఖీ కట్టారు. తరాల నుంచి సోదరీ సోదరుల అనుబంధాన్ని చాటిచెప్పే ఈ రక్షాబంధన్ పండుగను ఏంతో ఆత్మీయంగా, సర్వత్రా ఘనంగా నిర్వహిస్తుంటారు. ఈ క్రమంలో కొత్తగూడెం బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ జనపరెడ్డి గోపికృష్ణ తోడు రాగా జూనియర్ మహిళ న్యాయవాదులు ఆర్తి మక్కడ్, నకరికంటి ఉమా, యాస మౌనిక, అరుణ లత, అలేఖ్యలు కలెక్టర్ జితేష్ వి పాటిల్, భద్రాచలం శ్రేష్ఠకు రాఖీ కట్టి స్వీట్లు తినిపించి సోదర భావాన్ని చాటి చెప్పారు. కలెక్టర్, సబ్ కలెక్టర్లు న్యాయవాద సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు.

గురుకుల పాఠశాలల్లో సైన్స్ టీచర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర - కొత్తగూడెం : పాల్వంచలోని తెలంగాణ మైనార్టీ గురుకుల బాలికల పాఠశాలలో టీజీటీ జనరల్ సైన్స్ పోస్టు ఖాళీ ఉందని ప్రిన్సిపాల్ ఎం ఎ. ఫర్వీన్ బేగం అన్నారు. ఆమె శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసారు. ఈ పోస్టుకు కేవం మహిళా ఉపాధ్యాయురాలు అవసరం ఉందన్నారు. ఈ పోస్టుకు డిగ్రీ తోపాటు బీఈడీ, కనీసం మూడు ఏళ్ళు బోధన అనుభవం కలిగిన వారు అర్హులన్నారు. వర్జినల్ సర్టిఫికెట్లతో పాల్వంచ బుల్లూరిగూడలో గల మైనారిటీ బాలికల పాఠశాలలో సోమవారం ఈనెల 11న సాయంత్రం 4 లోపు దరఖాస్తులు అందించాలని ప్రిన్సిపాల్ కోరారు.

వార్డుల వారీగా ఓటర్ల జాబితా మ్యాపింగ్ : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - మెదక్ : రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా గ్రామం యూనిట్గా వార్డుల వారీగా ఓటర్ల జాబితా మ్యాపింగ్ తయారు చేస్తున్నట్లు కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. పంచాయతీల్లో ఓటరు జాబితా తయారీ మ్యాపింగ్‌లో భాగంగా మెదక్ జిల్లా హవేలీ ఘన్పూర్ ఎంపీడీవో కార్యాలయాన్ని కలెక్టర్ సందర్శించారు. వార్డులు వారీగా ఓటర్స్ మ్యాపింగ్ విధానాన్ని సంబంధిత జడ్పీ సీఈఓ ఎల్లయ్యతో కలిసి పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అన్ని ఎంపీడీవో కార్యాలయాల్లో గ్రామపంచాయతీ ఓటర్ నమోదు మ్యాపింగ్ ప్రక్రియ ఎంపీడీవోల పర్యవేక్షణలో పంచాయతీ సెక్రెటరీ, కంప్యూటర్ ఆపరేటర్స్‌తో పకడ్బందీగా కొనసాగుతుందని చెప్పారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

జిల్లాలో వరద పరివాహక ప్రాంతంలో కాజ్‌వేలు, వాగులు, బ్రిడ్జిల వద్ద ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. డైవర్షన్ ఏర్పాట్లు పక్కాగా నిర్వహించాలని, వరద ఉధృతి ఉన్నప్పుడు ఎవరినీ అనుమతించవద్దని అధికారులను ఆదేశించారు. శుక్రవారం హవేలీ ఘనపూర్ మండలం దూప్ సింగ్ తండా కాజ్ వే నిర్మాణ పనులు పంచాయతీరాజ్ ఈఈ గోపాల్‌తో కలిసి పరిశీలించారు. దూప్‌సింగ్ తండా కాజ్‌వే 3 కోట్లతో పంచాయతీరాజ్ శాఖ ద్వారా నిర్మాణ పనులు కొనసాగుతుంది. త్వరలో పనులు పూర్తి చేసి తండా వాసులకు ఉపయోగంలోకి తీసుకురావాలని సూచించారు.

క్రిటికల్ కేర్ భవనం త్వరలో ప్రారంభించాలి : కలెక్టర్

విశాలాంధ్ర ప్రతినిధి- పెద్దపల్లి, సింగరేణి: గోదావరిఖని జనరల్ ఆసుపత్రిలో క్రిటికల్ కేర్ భవనం నిర్మాణం పెండింగ్ పనులు పూర్తి చేసి త్వరలో ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన రామగుండం ప్రాంతంలో విస్తృతంగా పర్యటించారు. రామగుండం ప్రాథమిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అర్బన్ హెల్త్ సెంటర్, గోదావరిఖని జనరల్ ఆసుపత్రి, తబిత ఆశ్రమం, రామగుండం మున్సిపల్ కార్యాలయంను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో నిర్దేశించిన లక్ష్యం మేరకు క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని అన్నారు. ఎన్.సి.డి సర్వే పకడ్బందీగా నిర్వహించి బీపీ మధుమేహం ఉన్న వారికి అవసరమైన మందుల కిట్ అందించి మందులు వాడేలా రెగ్యులర్ ఫాలో అప్ చేయాలని అన్నారు. నగర కార్పొరేషన్‌లో పారిశుధ్య నిర్వహణ పట్ల కలెక్టర్ అధికారులతో చర్చించి వర్షాకాలం నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట గోదావరిఖని జనరల్ ఆసుపత్రి ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దయాల్ సింగ్, ఆర్.ఎం.ఓ డాక్టర్ రాజు, వైద్య అధికారులు డాక్టర్ అతుల్య, డాక్టర్ శ్రీధర్, సంబంధిత వైద్య అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రజా వీరుడు పండుగ సాయన్న జయంతి

విశాలాంధ్ర - నేరేడుచర్ల : ప్రజా వీరుడు పండుగ సాయన్న అని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు అన్నారు. నేరేడుచర్ల మండలం దిర్సించర్ల గ్రామంలో పండగ సాయన్న జయంతిని బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించగా కార్యక్రమానికి హాజరైన ఆయన పండగ సాయన్న చిత్రపటానికి పూలమాల వేసిన అనంతరం మాట్లాడుతూ తెలంగాణ ప్రజా ఉద్యమ చరిత్రలో చిరస్మరణీయమైన నాయకుడు పండగ సాయన్న అని, పండుగ సాయన్న ఒక వ్యక్తి కాదని ఒక ఉద్యమం అని ఆయన పోరాట ఫందా బహుజన ఆత్మగౌరవానికి నిలువెత్తు ఉదాహరణ అని 150 ఏళ్ల నాడే ఉన్నత వర్గాలు దగ్గర మూలుగుతున్న ధనాన్ని తెచ్చి నిరుపేదలైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల ఆకలి తీర్చేందుకు ఉపయోగించా రని సాయన్న ఎక్కడ ఉంటే అక్కడ పండగ వాతావరణం ఉండేదని అందుకే ఆయన పండుగ సాయన్న అయ్యాడని ఆయన అన్నారు. ఇప్పటికీ గ్రామాలలో ముఖ్యంగా దర్శించర్ల గ్రామంలో దశాబ్దాలుగా సాగు చేసుకున్న భూములను ఇటీవల కాలంలో వారి నుంచి ప్రభుత్వం లాక్కున్నదని వారికి ప్రత్యామ్నాయం చూపించకుండా వారు సాగు చేసుకుంటుంటే భూములు లాక్కోవడం వల్ల నిరుపేదలు రోడ్డున పడ్డారని అట్టి భూమిని కొంతమంది తమ ఆడపిల్లలకు పసుపు కుంకుమ కింద వరకట్నంగా ఇచ్చారని ఇవాళ వాళ్ళ జీవితాలు చల్లా చెదురయ్యే ప్రమాదం కనిపిస్తుందని అందువల్ల జిల్లాకు చెందిన మంత్రి జోక్యం చేసుకొని వారి భూములను వారికి ఇచ్చే విధంగా లేదా మరోచోట భూమి చూపించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఇంజమూరి మల్లయ్య, బిఆర్ఎస్ నాయకులు రాపోలు నవీన్ బీసీ హక్కుల సాధన సమితి జిల్లా గౌరవాధ్యక్షుడు చిలక రాజు శ్రీను జిల్లా సహాయ కార్యదర్శి కొమ్రరాజు వెంకట్, పంగ బుచ్చిబాబు ఊదర వెంకన్న పరిక భరత్ మనోజ్ పగడాల కృష్ణయ్య జొన్నలగడ్డ రామ నర్సయ్య పంగ నరసింహ, శ్రీను కీసర గోపాల్ పగంగా శ్రీను పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

విశాలాంధ్ర జిల్లా బ్యూరో - మహబూబాబాద్ : ప్లాస్టిక్ నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో అన్నారు. శుక్రవారం మహబూబాబాద్ పట్టణంలోని వార్డులను, మార్కెట్, జక్షన్ల ప్రాంతాలలొ జరుగుతున్న శానిటేషన్ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇన్చార్జి కలెక్టర్ మాట్లాడుతూ పట్టణంలో ప్లాస్టిక్ నియంత్రణకు మున్సిపల్ సిబ్బంది, ప్రతి ఒక్కరూ కృషి చేయాలనీ, షెడ్యూల్ ప్రకారం ప్రతీ రోజూ వార్డులు, మార్కెట్ జక్షన్ల ప్రాంతాలలో శానిటేషన్ చెయ్యాలని తెలిపారు. నీరు నిలువ ఉండే ప్రదేశాలలో ఆయిల్ బాల్స్ వేయాలని, వ్యర్థాలను వెంట వెంటనే తరలించి, తడి చెత్త, పోడి చెత్త ను వేరు చేసి సెగ్రిగేషన్ చేయాలన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తునందున, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు జాగ్రత్తలు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రజలు మున్సిపల్ ఆస్తి పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరారు. పెండింగ్ లో ఉన్న జంక్షన్లు, అంతర్గత రోడ్ల నిర్మాణం, కాలువలు, తదితర అభివృద్ధి పనులను పూర్తి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి. రాజేశ్వర్, శానిటరీ ఇన్స్పెక్టర్ సుధాకర్, తదితరులు ఉన్నారు.

దివ్యాంగుల పరస్పర చేయూత అందరికీ ఆదర్శం

విశాలాంధ్ర - ఇల్లందు : ఇల్లందులో ఉన్న దివ్యాంగులు పరస్పరం సహకారం అందించుకుంటూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇల్లెందు సాజన్ మండల టౌన్ దివ్యాంగుల సంఘం ఆధ్వర్యంలో రాగ పద్మ, మహమ్మద్ ముజాహిద్‌ల సహకారంతో కష్టాల్లో ఉన్న నాగరాజేశ్వరి అనే దివ్యాంగురాలికి శుక్రవారం నిత్యావసరాలు, బియ్యం, కూరగాయలను అందించారు. ఇందిరానగర్‌కు చెందిన రిజ్వాన ఇంట్లో నిరుపయోగంగా ఉన్న తన బ్యాటరీ సైకిల్‌ను 21 పిట్ ఏరియాకు చెందిన మద్దెల నరేష్‌కు, నెహ్రూ నగర్‌కి చెందిన రాగ తులసి వద్ద ఉన్న బ్యాటరీ సైకిల్‌ని బర్లపేట నివాసి అయిన విజయ భాస్కర్‌కి అందించి తోటి వారికీ తమ సేవా గుణాన్ని చాటుకున్నారు. ఎవరో వస్తారు ఏదో చేస్తారని ఎదురు చూడకుండా పరస్పరం దివ్యాంగు సహకరించుకుంటూ చాటున్న ఐక్యత అందరికి ఆదర్శంగా నిలుస్తుంది. ఈ రోజు జరిగిన కార్యక్రమంలో బిఆర్ శీను, వికలాంగ సంఘం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

11న జిల్లాకు రానున్న జాతీయ కమిషన్ సభ్యులు

విశాలాంధ్ర - కొమరం భీం : ఈ నెల 11వ తేదీన జిల్లాకు షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామ్ చందర్ రానున్నారని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 11వ తేదీన మధ్యాహ్నం 12 గంటలకు కాగజ్‌నగర్ పట్టణంలోని ఎస్.సి. బస్తీని సందర్శించి, షెడ్యూల్డ్ కులాల ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలతో సిద్ధంగా ఉండాలని తెలిపారు.

టెన్త్ పరీక్షల్లో గురుకులాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో-పెద్దపల్లి: రాబోయే 10వ తరగతి పరీక్షల్లో గురుకుల విద్యాలయాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష గురుకులాల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ జిల్లాలోని రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో చదివే 10వ తరగతి విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని, ఆ దిశగా అవసరమైన కార్యాచరణను ఇప్పటినుంచి అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతిరోజు గురుకులంలో స్టడీ అవర్స్ నిర్వహించాలని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి బాగా చదువుకునేలా చూడాలని అన్నారు. జిల్లాలో వర్షాలు ఉధృతంగా కురుస్తున్న నేపథ్యంలో గురుకులాల వద్ద అప్రమత్తంగా ఉండాలని, పిల్లల ఆరోగ్య అంశంలో ఎటువంటి నిర్లక్ష్యానికి తావు ఇవ్వవద్దని అన్నారు. పిల్లలకు చల్లబడిన ఆహారం అందించడానికి వీలు లేదని, రెగ్యులర్‌గా తాజా ఆహారం వేడి వేడిగా అందించాలని అన్నారు. రెసిడెన్షియల్ విద్యా సంస్థల్లో అందుతున్న త్రాగునీరు నాణ్యతను చెక్ చేయాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి, జిల్లా బీసి అభివృద్ధి అధికారి రంగారెడ్డి, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి వినోద్ కుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

బంజారా భాషా గోర్ బోలినీ గుర్తించాలి

విశాలాంధ్ర-బషీర్ బాగ్: బంజారా భాషా గోర్ బోలినీ గుర్తించాలని కోరుతూ ఢిల్లీలో గిరిజన శక్తి, గిరిజన సంఘాల ఆధ్వర్యంలో బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వెంకటేష్ చౌహాన్ మాట్లాడుతూ బంజారాల అస్తిత్వానికి ఆత్మగౌరానికి ప్రతిక గోర్ బోలి భాష అని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి పంపించడం జరిగిందనీ, ఇప్పటికీ కేంద్ర ప్రభుత్వం నాన్పుడు ధోరణితో వ్యవహరించడం బాధాకరమని గత మూడు రోజులుగా తాము అన్ని పార్టీల ఎంపీలను కలిసి బంజారా భాష చరిత్ర అనేక సంవత్సరాలుగా వివిధ రాష్ట్రాల్లోని కోట్ల మంది బంజారాలు మాట్లాడే ఈ భాష చరిత్రను గొప్పతనాన్ని సింధు నాగరికత కానుంచి భాష మూలాలను గురించి వివరించి వారికి వినతిపత్రాన్ని ఇచ్చామన్నారు. అటువంటి భాషను విస్మరిస్తే రాబోయే స్థానిక ఎన్నికల్లో బంజారా తండాల్లో తడాఖా చూపిస్తామని హెచ్చరించారు. ఓట్లు కావాల్సినప్పుడు గిరిజన బిడ్డలు, తండా బిడ్డలు గుర్తుకొస్తారని మా సమాజం సంస్కృతి సాంప్రదాయాలను ధర్మాన్ని రక్షించమని రాజకీయ నాయకులను కోరిన పట్టించుకోకపోవడం చాలా ఆవేదన కలిగిస్తుందన్నారు. గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లప్పతి నాయక్, గిరిజన విద్యార్థి సమితి రాష్ట్ర అధ్యక్షులు శివ నాయక్, నల్గొండ జిల్లా ఉపాధ్యక్షులు మోహన్ పవర్, శ్రీకాంత్ నాయక్ పాల్గొన్నారు.

పాలస్తీనాకు ఏఐపిఎస్ఓ మద్దతు

విశాలాంధ్ర - హైదరాబాద్ : అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాదులో హిమాయత్ నగర్‌లో గల శాంతి సంఘీభావ సంగం కార్యాలయం వద్ద పాలస్తీలకు మద్దతు తెలియజేస్తూ ఉద్యమకారులంతా ష్ల కార్ప్ పట్టుకొని సంఘీభావాన్ని ప్రకటించారు. ఈ సంఘీభావ కార్యక్రమంలో కమిటీ అధ్యక్ష వర్గ సభ్యులు డాక్టర్ డి సుధాకర్, ఐప్సో రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కె.వి.ఎల్., రాష్ట్ర ప్రధాన కార్యదర్శిలు జి.నాగేశ్వరరావు, డాక్టర్ కాచం సత్యనారాయణ గారలు మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా పాలస్తీనాలో సాగుతున్న స్వాతంత్ర పోరాటానికి మద్దతునిస్తున్నామని సంఘీభావాన్ని తెలియజేస్తు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. గాజాలో ప్రతిరోజు బాంబుల మోత, నరమేధం కొనసాగుతున్నదని, ఇప్పటికే వేలాదిమంది చిన్నారులు, ప్రాణాలను కోల్పోయారని, తీవ్రంగా గాయపడ్డ వారికి, క్షతగాత్రులకు ఎలాంటి వైద్య సదుపాయాలు గాని, మంచినీళ్ళు, ఆహార వసతులు గాని అందించకపోవడం మానవత్వానికి మచ్చని తెలియజేశారు. అలీన విధానాన్ని కొనసాగించవలసినటువంటి భారత కేంద్ర ప్రభుత్వం, ఇజ్రాయిల్‌కు మద్దతునిస్తూ చిరకాలంగా కొనసాగుతున్న భారత దేశ విదేశీ విధానాన్ని పక్కదోవ పట్టించటం పట్ల భారతదేశ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ప్రపంచ దేశాలన్నీ, పలస్తీ నాకు మద్దతునిస్తున్నాయని, కవులు, కళాకారులు, మేధావులు, తమ పాటలు రచనలు సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా గాజాను విధ్వంసం చేస్తున్న ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా, పాలస్తీ నాకు మద్దతుగా నిలబడి పోరాటంలో భాగస్వాములు అవుతున్నారు.

అత్యవసర సమయంలో అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : నిరంతర వర్షాల దృష్ట్యా భారీ వర్షాలు వస్తే, అత్యవసర సమయంలో అప్రమత్తంగా ఉంటూ సాగునీటిని నియంత్రించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె హాలియా 17వ మైలు రాయి వద్ద, అలాగే 42వ మైలురాయి దేవులపల్లి వద్ద నాగార్జున సాగర్ ఎడమకాలువ ఎస్కేప్ ఛానెల్స్‌ను పరిశీలించారు. అత్యవసర పరిస్థితులలో నీటి ప్రవాహాన్ని నియంత్రించేందుకు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, తక్షణమే నీటిని ఎస్కేప్ ఛానెల్ ద్వారా స్ట్రీమ్‌కు పంపించాలన్నారు. మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, డిప్యూటీ ఎక్జిక్యూటివ్ ఇంజనీర్ గోపీనాథ్ తదితరులు ఉన్నారు.

నేడు ఆదివాసి దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - భద్రాచలం : ఆగస్టు 9న జరిగే ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలకు శాసనసభ్యులు, జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా అధికారులు, వివిధ ఆదివాసి సంఘాల ప్రతినిధులు పాల్గొంటారని ఐటిడిఎ ఎపిఓ డేవిడ్ రాజ్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పివో బి.రాహుల్ ఆదేశానుసారం ఐటిడిఎ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే ఈ కార్యక్రమాన్ని జయప్రదం అయ్యేలా గిరిజన ఆదివాసి ఐక్య కార్యాచరణ సమితి సభ్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ఈ వేడుకలకు వచ్చే ప్రముఖులకు ఆదివాసి గిరిజనుల సాంప్రదాయ ప్రకారం ఆచార వ్యవహారాలు, సంస్కృతి సాంప్రదాయాలు, ఆదివాసి వంటకాలతో వారిని స్వాగతించే విధంగా కార్యక్రమాలు ఏర్పాట్లు చేయాలన్నారు. హాజరైయ్యే అతిధులకు మనమిచ్చే ఆతిథ్యంలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా చూడాలని కమిటీ సభ్యులకు ఆయన సూచించారు. వివిధ ఆదివాసి తెగల గిరిజనులతో ర్యాలీలు, మహనీయులకు శ్రద్ధాంజలి ఘటించడం, జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందన్నారు. అలాగే వివిధ తెగల సాంప్రదాయ సాంస్కృతిక నృత్యాలు ఏర్పాటు చేసి కనువిందు చేయాలని కోరారు. ఈ సమావేశంలొ ఆదివాసి ప్రతినిధులు పూణెం కృష్ణ, కుంజ ధర్మ, వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

పండుగ వేళ ఆర్టీసీ బస్సు సర్వీసులు పెంపు

విశాలాంధ్ర - మణుగూరు : రాఖీపౌర్ణమి పండుగ వేళా ప్రయాణికులు ఇబ్బందులు పడకూడదని ప్రభుత్వం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను పెంచింది. ఈ మేరకు మణుగూరు నుండి ఏటూరునాగారం, భద్రాచలం, కొత్తగూడెం, ఖమ్మం, హైదరాబాద్‌లకు అదనంగా బస్సు సర్వీసులు పెంచుతున్నట్లు ఆర్టీసీ మణుగూరు డిపో మేనేజర్ శ్యాంసుందర్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులకు ఈ ప్రాంతాలకు ఎక్కువగా వెళ్లే అవకాశం ఉన్నందున బస్సుల కొరత లేకుండా సౌకర్యంగా గమ్యస్థానాలకు చేరాలనే ఉద్దేశంతొ అదనపు బస్సు సర్వీసులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ప్రయాణికులకు, మణుగూరు సబ్ డివిజన్ ప్రజలకు ఆయన రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఇమామ్ మౌజన్‌ల వేతనాల పునరుద్ధరణకు 31 వరకు గడువు

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : రాష్ట్రంలోని మస్జీద్‌లలో సేవలు అందిస్తున్న ఇమామ్, మౌజన్ల గౌరవ వేతనాలను పునరుద్ధరణ చేసేందుకు గడువు పెంచినట్లు రాష్ట్ర మైనారిటీ నాయకులు, ఉర్దూగర్ చైర్మన్ నయీమ్ ఖురేషి, అంజుమన్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు అమీర్ ఖాద్రి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిటీ సమావేశంలో వారు మాట్లాడుతూ ఆగస్టు 31 వరకు రాష్ట్ర వక్ఫ్ బోర్డు దరఖాస్తులకు గడువు పొడగించడం జరిగిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మసీదులలో సేవలందిస్తున్న ఇమాం, మౌజన్‌లు సంబంధిత ధ్రువీకరణ పత్రాలు ఆయా జిల్లాలోని వక్ఫ్‌బోర్డ్ ఇన్స్పెక్టర్లకు అందజేయాలనీ కోరారు. ఇమామ్, మౌజన్‌లు తమ ఇన్కమ్ సర్టిఫికెట్ ను విధిగా అందజేయాలని కోరారు. ఇతర వివరాల కోసం అంజుమన్ ప్రెసిడెంట్ 8499882786 నంబర్ కు సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో నిసార్, సయ్యద్ ఫైజుద్దీన్, జమాల్, హమీద్, బాబు జాని ఖాన్ పాల్గొన్నారు.

ఆదివాసీ జేఏసీ సమ్మేళనాన్ని విజయవంతం చేయండి

విశాలాంధ్ర - చర్ల : ఆగస్టు 9న జరిగే ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆదివాసీ జేఏసీ నాయకులు కారం నరేష్ కోరారు. విజయ కాలనీ గ్రామంలో శుక్రవారం తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జెండాను ఆవిష్కరించి జాతీయ ఐక్యత కోసం ఆదివాసీ జాతి మనుగడ కోసం శనివారం చర్ల అంబేద్కర్ సెంటర్లో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని తమ సంఘం పూర్తిస్థాయిలో జేఏసీకి మద్దతు తెలియజేస్తున్నట్లు ప్రకటించారు. ఆదివాసి హక్కులు, చట్టాలు, విద్య వైద్యం రహదారుల సౌకర్యాలు వంటి సంక్షేమ, అభివృద్ధి ఫలాలు దూరమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేసారు. పాలకుల నిర్లక్ష్యం వల్లే స్వాతంత్రం వచ్చి దశాబ్దాలు గడిచిన తమ జీవితాల్లో మార్పు రాలేదన్నారు. అందుకే ఆదివాసిల ఐక్యత అనివార్య మన్నారు. వ్యక్తి గత స్వార్థలు వదిలినప్పుడే జాతి మనుగడ సాధ్యమని కారం నరేష్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి వెంకటేశ్వర్లు, పొడుపు గంటి సమ్మక్క, సూరమ్మ, ఆదెమ్మ, కుంజ గీత గ్రామస్తులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై ఆవుల బెడద

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : కొత్తగూడెం నుంచి విజయవాడ వెళ్లే జాతీయ రహదారి పై ఇటీవల కాలంలో ఆవుల బెడద అధికమైంది. రాత్రివేళ రోడ్డుకు అడ్డంగా పడుకుంటున్నాయి. దీంతో వాహనదారులకు చాలా ఇబ్బందికరంగా ప్రమాదకరంగా మారింది. వీటి యజమానులెవరు ఎవరికీ అంతు పట్టడం లేదు. వారం క్రితం భార్య భర్తలు రాత్రివేళ కొత్తగూడెం నుంచి చంద్రుగొండకు మోటార్ సైకిల్ పై వస్తుండగా ఆవులు తగిలి కింద పడి గాయాలైనట్టు తెలిసింది. ఎదురుగా బొగులారి లైట్లు కళ్ళల్లో పడటంతో రోడ్డుపై పడుకున్న ఆవులు కనిపించలేదు. దీంతో ప్రమాదం జరిగినట్టు తెలుస్తుంది. ముఖ్యంగా కొత్తగూడెం నుంచి రామవరం పట్టణం వరకు జాతీయ రహదారిపై ఆవులు బారులు తీరి పడుకుంటున్నాయి. గతంలో కూడా ఈ ఆవులు మోటార్ సైకిళ్లకు తగిలి కిందపడి గాయాల పాలైన ఉదంతాలు అనేకం ఉన్నాయి. దీనిపై స్థానిక రెవెన్యూ, మున్సిపాలిటీ, పోలీస్ అధికారులకు తెలిసినప్పటికీ ఏ మాత్రం పట్టించుకోవటం లేదని విమర్శలు వస్తున్నాయి. ఈ రహదారి పై రాత్రి వేళ తిరిగే వాహన దారులకు పెద్ద ప్రమాదం జరగక ముందే స్థానిక అధికారులు స్పందించి నివారణ చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

సంపాదకీయం

పాపం మోదీ!

భారతదేశంపై అమెరికా గతంలో విధించిన 25 శాతం సుంకాలు అమల్లోకి రావడంతో ఎటూ పాలుపోని పరిస్థితుల్లో దేశం ఇరకాటంలో పడిపోయింది. అదనంగా విధించిన మరో 25 శాతం సుంకాలు సైతం ఈనెల 27వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయి. అంటే 50% సుంకాలను భారత ఆర్థిక వ్యవస్థ భరించడానికి సిద్ధం కావాల్సి వచ్చింది. స్వతంత్ర భారత చరిత్రలో అమెరికా ఇంత కఠినంగా ఏనాడూ వ్యవహరించ లేదు. అగ్రరాజ్య ఆధిపత్యాన్ని ఎదిరించిన దేశాలపైనే ఈ స్థాయి సుంకాలపోటు లేకపోవడం గమనార్హం. అమెరికాకు 'నీ బాంచన్ దొరా! కాల్మొక్తా!' అంటున్న మోదీ ప్రభుత్వానికి ఇది దిగ్భ్రాంతికరమైన పరిణామమే. అమెరికా సుంకాలు విధించడమంటే ఆ దేశ పరిభాషలో ఆంక్షలు విధించడమే. చైనా, క్యూబాలపై విధించిన ఆంక్షల్లో దాదాపు అటుఇటుగా భారత్‌పైనా అమెరికా విధించినట్లు పరిగణించవచ్చు. ఈ మధ్య 'ఎక్స్' వేదికగా అమెరికా ఆంక్షలకు సంబంధించి వెటకారంతో కూడిన ఒక పోస్ట్ హల్‌చల్ చేస్తోంది. దాని సారాంశమేమిటంటే, అమెరికా తన ఆంక్షలతో భారత్‌తో సహా ఏ దేశాన్నయినా తనకు మోకరిల్లేలా చేసుకుంటోంది. కానీ చైనా, క్యూబా, రష్యాలను మాత్రం కనీసం ఒక్క అంగుళమైనా కదపలేకపోతున్నది. పైగా తీవ్రమైన ప్రతిఘటనను చవిచూడాల్సి వస్తోంది. ఎన్నో ఎదురుదెబ్బలు తినాల్సి వస్తున్నది. డోనాల్డ్ ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ తరహా పోస్టులు ఎక్కువయ్యాయి. ట్రంప్ వెకిలిచేష్టలను ఊరూరా ఎండగట్టే జనం ఎక్కువయ్యారు. అమెరికాను దీటుగా ఎదుర్కొని నిలబడే దేశాల్లో క్యూబా, చైనా, రష్యాలు ఉండగా, ఈ విషయంలో భారత్ మాత్రం బానిసగానే బతుకీడుస్తున్నదన్న అపప్రద ఉంది. గడిచిన దశాబ్దకాలంలో భారత్‌ను అమెరికా చాకిరేవు బండ మీద చావబాదుతున్నా మన ప్రభుత్వం కిమ్మని పలుకులేదు. కింకర్తవ్యం ఆలోచనేలేదు. మోదీ ప్రధానమంత్రిగా పగ్గాలు చేపట్టిన తర్వాత తొలిసారిగా 'రైతుల ప్రయోజనాల విషయంలో రాజీపడేది లేద'ంటూ అమెరికా సుంకాలపై దీటుగా స్పందించినట్లు వార్తలు వచ్చాయి. అది కూడా గోదీ మీడియాలోనే కన్పించాయి. ప్రధాని ప్రకటన లోతుల్లోకి వెళితే అసలు విషయం బోధపడింది. 'అమెరికా ఆంక్షలవల్ల భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుందని తెలుసు. రైతులు, మత్స్యకారులు, డెయిరీ ఉత్పత్తిదారుల ప్రయోజనాల విషయంలో ఎప్పటికీ రాజీపడబోం. వారిని కాపాడటంకోసం సుంకాల భారాన్ని భరించడానికైనా సిద్ధం' అని మోదీ అనడంలో ఆంతర్యం అర్థమైపోయింది. అమెరికా ఆంక్షలను భరించడానికే సిద్ధమయ్యారు తప్ప ప్రతిఘటించడానికి సముఖంగా లేరని స్పష్టమవుతున్నది. 'అమెరికాతో ఢీ అంటే ఢీ' అనే కోణమే బీజేపీ సర్కారులో ఏ కోశాన ఉండదని తేలిపోయింది.

గత పదకొండేళ్లుగా పేలవమైన విదేశాంగ విధానం భారత ప్రతిష్ఠను దిగజారుస్తూనే ఉంది. అయినా నరేంద్ర మోదీ ప్రభుత్వ విధానాల్లో ఎలాంటి మార్పూ కానరావడం లేదు. అలీన విధానానికి స్వస్తిచెప్పి, అగ్రరాజ్య పంచన చేరితే 'నేడు కాకపోతే రేపైనా తిప్పలు తప్పవు' అని పూర్వానుభవం ఎంతచెప్పినా, అమెరికాను అంటగాకిన తీరు తుదకు ఆక్షలు విధించే స్థాయికి చేర్చింది. పైగా మరిన్ని ఆంక్షలు విధించడానికి రంగం సిద్ధం చేసినట్లు స్వయంగా ట్రంప్ తన శ్వేతసౌధంలో రొమ్మువిరుచుకొని ప్రకటించిన వైనం సగటు భారతీయుడి నరాల్లో రక్తం మరిగేలా చేస్తున్నది. ఉక్రెయిన్–రష్యా యుద్ధం ముగిస్తే తప్ప భారత్‌పై ఆంక్షల సడలింపునకు ఆస్కారం లేదని తేటతెల్లమవుతున్నది. ఎందుకంటే, రష్యా నుంచి చమురును దిగుమతి చేసుకుంటున్న దేశాల్లో భారత్ రెండో స్థానంలో ఉంది. చైనా మొదటి స్థానంలో ఉంది. ఈ నేపథ్యంలో రష్యాతో బంధం వీడితే తప్ప అమెరికా కరుణించబోదని స్పష్టంగా గోచరిస్తున్నది. అమెరికా అదనపు సుంకాల విధింపు వల్ల రెండు దేశాల మధ్య తలెత్తిన వివాదం తాత్కాలికమేనని, త్వరలో సమసిపోతుందని ప్రవాస భారతీయ సంఘాలు మధ్యవర్తిత్వ పాత్ర పోషించాలని చూస్తున్నప్పటికీ, దీంట్లో సానుకూల వచనాలు గానీ, పవనాలు గానీ ఏవీ కన్పించడం లేదు. 50 లక్షల మంది ప్రవాస భారతీయులు అమెరికా అభ్యున్నతిలో భాగస్వాములుగా ఉన్నా, ఆ పేజీలేవీ ట్రంప్ పుస్తకంలో లేవు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న దేశాల్లో చైనా, టర్కీ దేశాలు ఉన్నా, వాటిపై లేని ఆంక్షలు భారత్‌పై ఎందుకు విధించారని మీడియా మిత్రులు అడిగిన ప్రశ్నకు ట్రంప్ సమాధానం అడ్డగోలుగా ఉంది. త్వరలో విధించబోయే మరిన్ని ఆంక్షల్లో చైనా, టర్కీలు ఉండొచ్చు, ఉండకపోవచ్చునని, భారత్ మాత్రం ఉంటుందని ట్రంప్ చెప్పడం అతని అజెండా, అతని లక్ష్యం ఇండియా మాత్రమేనని స్పష్టమయింది.

అమెరికా విధించిన ఆంక్షల వల్ల ఏతావాతా 9 రకాల ఉత్పత్తుల ఎగుమతులు 70% వరకూ తగ్గిపోతాయి. అంటే రొయ్యలు, ఆర్గానిక్ రసాయనాలు, కార్పెట్లు, నిట్టెడ్–ఓవెన్ దుస్తులు, అపారెల్ మేడప్ ఉత్పత్తులు, రత్నాలు, పసిడి–ఆభరణాలు, మెషినరీ–మెకానికల్ వస్తువులు, ఫర్నిచరు–బెడ్డింగ్ ఉత్పత్తులపై తీవ్ర ప్రభావం పడుతుంది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ.17,400 కోట్ల విలువైన రొయ్యలు అమెరికాకు ఎగుమతి కాగా, ఇప్పుడు వాటి విలువ సుమారు రూ.5,000 కోట్లకు పడిపోవచ్చు. ఇవిగాక, ఎక్కువ ప్రభావం పడే రంగాల్లో ఉక్కు అల్యూమినియం, రాగి, వాహన విడిభాగాలు కూడా ఉన్నాయి. వీటి ఎగుమతులు సైతం 50%కి పడిపోతాయనడంలో ఎలాంటి సందేహమూ లేదు. ఔషధాలు, స్మార్ట్‌ఫోన్లు, పెట్రోలియం ఉత్పత్తులపై ప్రభావం తక్కువగా ఉన్నా, కనీసం 10% నుంచి 30% వరకూ ఎగుమతుల పతనం కన్పించవచ్చు. నిజానికి అమెరికా టారిఫ్ గోడలు కట్టడం ఇది కొత్తకాదు. ఇప్పటికే భారత్ ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించి ఉండాల్సింది. ముఖ్యంగా మధ్యప్రాచ్యం, లాటిన్ అమెరికా, ఆఫ్రికా, దక్షిణాసియాలపై దృష్టి సారించడం, చైనాతో సత్సంబంధాలు కలిగిఉండటం, రష్యాతో ఎలాంటి అరమరికల్లేని స్నేహాన్ని కొనసాగించడం, ముఖ్యంగా బ్రిక్స్ దేశాలతో పరిపూర్ణ స్థాయిలో పయనిస్తూ ఉంటే భారత్‌కు ఈ సమస్యలు వచ్చి ఉండేవి కావు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు భారత్‌కు ఇప్పటికిప్పుడు వడ్డించిన విస్తరి దొరుకుతుందని ఆశించడం సరికాదు. అందుకే 'అకస్మాత్తుగా' రష్యాతో మాట్లాడి, ట్రంప్ కోరిక మేరకు ఉక్రెయిన్‌తో యుద్ధం ఆపించడం ఒక్కటే ఆంక్షల సడలింపునకు 'అత్యవసర' మార్గమని మోదీ సర్కారు భావిస్తున్నది. అందుకే రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో మోదీ ఫోన్‌లోనే సుదీర్ఘ చర్చలు జరుపుతున్నారు. ఈ ఫోన్ సంభాషణలు కొలిక్కి వస్తాయన్న సంకేతాలైతే కన్పించడం లేదు. ఆఖరికి చెప్పాల్సిన, అచ్చొచ్చిన మాట ఏంటంటే, మోదీ నోబెల్ శాంతి బహుమతిపై ఆసక్తిని తగ్గించుకొని, తన విదేశాంగ విధానాన్ని మార్చుకోవాలి.

కౌలురైతులకు పంటరుణాలేవి?

పి.జమలయ్య

ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు పూర్తవుతున్నా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేయడంలో జాప్యం, వారికి పంట రుణాలు అందించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం, అన్నదాత సుఖీభవ పథకం వర్తింప చేయకుండా అక్టోబర్‌కు వాయిదావేయటాన్ని పరిశీలిస్తే కౌలు రైతుల పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని స్పష్టమవుతోంది. పంట రుణం తీసుకున్న వారికే పంటల బీమా పథకం అని, లేకపోతే ప్రైవేట్ గా పంటల బీమా పథకంలో చేరాలని చెప్పడం చాలా దారుణం. కౌలు రైతులు పంట రుణాలు పొందాలంటే భూ యజమాని బ్యాంకులో ఎటువంటి బకాయిలు ఉండరాదని లేదా ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో పంట రుణాలు తీసుకోకూడదని, కౌలురైతు కూడా బ్యాంకులో ఎటువంటి బకాయిలు ఉండకూడదని, కౌలుగుర్తింపు కార్డుతో పాటు ఇ-పంటలో నమోదు కావాలని అనేక అలవి గాని నిబంధనలు పెట్టి పంట రుణాలు ఇవ్వడంలేదు. కౌలు రైతుకు బ్యాంకు బకాయి ఉండకూడదు అనేది సమంజసమే కానీ భూ యజమాని బ్యాంకుకు రుణపడితే యజమాని యొక్క భూమిని సాగు చేస్తున్న కౌలు రైతుకు రుణం ఇవ్వలేమని చెప్పడం విడ్డూరంగా ఉంది. పంటల పెట్టుబడి కోసం అనివార్యంగా వడ్డీ వ్యాపారస్తులపై ఆధారపడేటట్టు చేస్తున్నారు. సాగు చేయని వారికి ప్రతి ఏడాది లక్షల కోట్ల రూపాయల పంట రుణాలు ఇస్తున్నారు. వాస్తవంగా పంటలు పండించే కౌలురైతులకు మొండి చెయ్యి చూపిస్తున్నారు. రుణాల విషయంలో శ్వేతపత్రం ప్రకటిస్తే కానీ అసలు విషయం బయటకు వస్తుంది. బ్యాంకులు ఇచ్చేది పంట రుణాలు. భూమికి ఇచ్చే రుణాలు కాదు. సాగు చేయకుండానే పంట రుణాలు తీసుకోవటం పెద్ద కుంభకోణం లాంటిది.

మారిన వ్యవసాయ పరిస్థితులలో మన రాష్ట్రంలో సాగు భూమిలో 70 నుంచి 80 శాతం కౌలురైతులే పంటలు పండిస్తున్నారు. అన్ని పంటల్లోనూ, అన్ని ప్రాంతాల్లోనూ కౌలురైతులే గణనీయమైన సంఖ్యలో సేద్యం చేస్తున్నారు. వ్యవసాయ, ఉద్యాన, పట్టు, బ్యాంకుశాఖల సహాయ, సహకారాలు భూ యజమానులే ఇంకా వ్యవసాయం చేస్తున్నట్టుగా భావించి వారికే పథకాలు అందే విధంగా రూపకల్పన చేయటం బాధాకరం. ప్రస్తుతం వ్యవసాయరంగంలో చోటు చేసుకున్న పరిస్థితులను పరిగణలోకి తీసుకోకుండా ప్రణాళికలు రూపొందించడం శోచనీయం. రాష్ట్రంలో పంటలు పండిస్తున్న కౌలు రైతులకు పంట రుణాలు, పంటల బీమా, ఇన్పుట్ సబ్సిడీలు, పంటలు అమ్ముకునే వెసులుబాటు, సాగుసాయం లాంటి పథకాలు అందటంలేదు. ప్రైవేటు వడ్డీ వ్యాపారస్తులపై ఆధారపడే పంటలు పండిస్తున్నారు. ప్రతి ఏడాది కౌలురేట్లుతో పాటు

సాగు ఖర్చులు పెరిగి ప్రభుత్వ మద్దతు దక్కకపోగా ఆదాయాలు పడి పోయి అప్పులు పాల్కె ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితికి నెడుతున్నారు. సాగుకి అత్యంత కీలకమైన పెట్టుబడి అంటే పంట రుణాలు అందించే విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యత తీసుకోవాలి కానీ మాటల్లో మాత్రం కౌలురైతులను ఉదారంగా ఆదుకోవాలని చెబుతూ ఆచరణలో మాత్రం ఎటువంటి సహాయ, సహకారాలు అందించకుండా విస్మరిస్తున్నారు.

ప్రతి సంవత్సరం రాష్ట్రంలో లక్ష నుంచి రూ.1.60 లక్షల కోట్ల పంట రుణాలు ఇస్తున్నారు. ఇందులో ఒక శాతం కూడా కౌలురైతులకు ఇవ్వడం లేదు. కౌలురైతుల సంఘాలు చేసిన ఉద్యమాలను దృష్టిలో పెట్టుకొని దేశవ్యాప్తంగా పెరుగుతున్న కౌలు రైతుల సంఖ్య దృష్ట్యా "రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా" కొన్ని నిర్ణయాలు చేసింది. 2018 -2019 సంవత్సరంలో "రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా" నిబంధనల ప్రకారం అన్ని బ్యాంకులు లక్ష నుంచి రూ.1.60 లక్షల వరకు ఎటువంటి హామీ లేకుండానే కౌలురైతులకు పంటరుణాలు మంజూరు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. అంతకన్నా ముందు హామీలేని పంట రుణాలు పరిమితి రూ.60వేలు మాత్రమే ఉండేది. క్రమంగా పెంచుతున్నారు. మన రాష్ట్రంలో ఈ ఆదేశాలు అమలుకు గత సంవత్సరం ఆగస్టులో వ్యవసాయ, బ్యాంకు ఉన్నతాధికారుల సమావేశం అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరిగింది. కౌలురైతులకు వ్యవసాయ స్వల్పకాలిక రుణాలు మంజూరు చేయాలంటే భూమిని కౌలుకు ఇచ్చిన ఆ భూ యజమాని బ్యాంకుకు ఎటువంటి బకాయిలు ఉండరాదని, ప్రస్తుతం పంట రుణం తీసుకోకుండా ఉండాలని, అటువంటి భూ యాజమానుల భూమిని సాగుచేసే వారికే పంటరుణాలు జారీ చేయడానికి పరిశీలించాలని నిర్ణయించారు. ఎటువంటి బకాయిలులేని పంట రుణాలు పొందని, భూ యజమానుల లిస్టులు తయారు చేయాలని ఆ భూములను సాగుచేసే కౌలురైతులకి పంట రుణాలు అందించాలని నిర్ణయించారు. ఈ నిర్ణయంతో "పెనం నుండి పొయ్యి"లో పడ్డట్టుయింది కౌలు రైతుల పరిస్థితి. ఈ నిర్ణయంతో గతంలో ఇచ్చే అరకొరగా అందే పంట రుణాలు అందకుండా పొయ్యాయి.

ఆంధ్రప్రదేశ్ పంట సాగు దారుల హక్కుల చట్టంలోని సెక్షన్ 5 ప్రకారం, గుర్తింపు కార్డు అంటే సిసిఆర్సి (క్రాప్ కల్టివేషన్ రైట్స్‌కార్డ్స్)లు పొందిన కౌలురైతులు రాష్ట్ర లేదా కేంద్ర ప్రభుత్వం లేదా వ్యవసాయ సహకార సంఘం లేదా షెడ్యూల్డ్ బ్యాంకు లేదా రాష్ట్రం లేదా కేంద్ర ప్రభుత్వం నియంత్రించే లేదా నిర్వహించే ఏదైనా ఇతర ఆర్థిక సంస్థ నుండి కౌలు ఒప్పందం ప్రకారం భూమిపై పంట రుణం పొందేందుకు, పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, పంట నష్టాలు లేదా ప్రభుత్వం రైతులకు అందించే ఏవైనా ఇతర ప్రయోజనాలు లేదా సౌకర్యాలను పొందేందుకు అర్హులని నిబంధనలలో పొందు పర్చారు. బ్యాంకర్లు/ఆర్థిక సంస్థలు సాగుదారుని బకాయిల రికవరీ కోసం షెడ్యూల్డ్ భూమిని జప్తు చేయకూడదు. పంట ఆదాయం నుండి మాత్రమే రికవరీ చేయాలని భూ యజమానికి ఎటువంటి నష్టం జరగకూడదని భరోసా ఇస్తూ చట్టంలో పేర్కొన్నారు. అయినా బ్యాంకులు కౌలు రైతులకు ఉదారంగా పంట రుణాలు ఇచ్చే విషయంలో కఠినంగా నిబంధనలు ఏర్పర్చుకున్నాయి. "రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా" నిబంధనలను తుంగలో తొక్కాయి.

ఈ సంవత్సరం జులై నెలలో జరిగిన వ్యవసాయ బ్యాంక్ అధికారుల సమావేశంలో 2024 సంవత్సరంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జారీ చేసిన ఆదేశాల ప్రకారం రూ.1.60 లక్షల నుంచి రూ.2.00 లక్షల వరకు ఎటువంటి హామీ లేకుండానే పంటల ఆధారంగా కౌలురైతులకు రుణాలు మంజూరు చేయాలని నిర్ణయించారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎన్ని ఆదేశాలు ఇచ్చినప్పటికీ రాష్ట్రంలోని బ్యాంకులు స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ ఏర్పాటు చేసుకొని కౌలు రైతులను బ్యాంకు మెట్లు ఎక్క నియ్యకుండా తిరస్కరిస్తున్నారు. స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్‌లోని నిబంధనలు పరిశీలిస్తే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధనలు అమలు చేయకుండా అనేక ఆంక్షలు పొందుపరిచారు. కౌలురైతు సాగు చేస్తున్న భూమి సర్వే నెంబర్ వెబ్ ల్యాండ్ పోర్టల్ నమోదై ఉండాలని, విస్తీర్ణం, భూమి పట్టదారు పాస్ పుస్తకం, ఖాతా నెంబరు, తదిత వివరాలు అడుగుతున్నారు. కౌలురైతు ఏ బ్యాంకులో ఎటువంటి బకాయిలు ఉండకూడదు. కౌలురైతే కాకుండా భూ యజమాని కూడా బ్యాంకుకు ఎటువంటి బకాయిలు ఉండకూడదని, భూ యజమాని ప్రస్తుతం పంట రుణం తీసుకోకుండా ఉండాలని, అప్పుడు మాత్రమే కౌలురైతులకు పంట రుణాలు ఇస్తామని ఆంక్షలు పెడుతున్నారు.

కౌలు గుర్తింపు కార్డు పొందడంతో పాటు ఇ-పంటలో నమోదు కావాలని చెబుతున్నారు. సాగుచేయని వారికి మాత్రం ఇ-పంటతో సంబంధం లేకుండా లక్షలాది రూపాయలు వడ్డీలేని రుణాలు ఇస్తున్నారు. వాస్తవంగా పంటలు పండించే వారికి ఇ-పంటతో సంబంధం పెట్టడం చాలా విడ్డూరంగా ఉంది. వాస్తవం చెప్పాలంటే భూ యజమాని తీసుకున్న రుణానికి కౌలురైతుకు ఎటువంటి సంబంధం లేదు. అయినా ఎందుకు అడుగుతున్నారంటే చెప్పకుండా పొగబెట్టి వెళ్ళగొట్టిన చందంగా కౌలురైతులకు పంట రుణాలు ఇవ్వకుండా చేయడానికే అనేక ఆంక్షలు పెట్టి బయటకు నెట్టేస్తున్నారు. ఒకవైపు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వ్యవసాయశాఖ మంత్రి అచ్చెం నాయుడులు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వ కాలంలో ఏ ఒక్క రైతు ఆత్మహత్య చేసుకోవడానికి వీలులేదని ఘంటాపథంగా చెబుతారు కానీ రుణాలు జారీ చేసే విషయంలో మీనమేషాలు లెక్కేస్తూ పరోక్షంగా సాగు చేయని భూ యాజ మానులకు తోడుపడుతున్నారు. ఇప్పటికైనా కూటమి సర్కారుకు కౌలురైతులను ఆదుకోవాలనే చిత్తశుద్ధి ఉంటే వాస్తవ సాగుదారులైన కౌలురైతులందరికీ సులభంగా గుర్తింపు కార్డులు జారీ చేయాలి. గుర్తింపు కార్డులు పొందిన వారికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధన ప్రకారం స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను దృష్టిలో పెట్టుకొని పంటల హామీపై రెండు లక్షల వరకు పంట రుణాలు అందజేయాలి. మిగిలిన దానికి సంబంధించి సాగు చేస్తున్న భూమి దామాషాను బట్టి పంటరుణాలు జారీ చేయాలి. ఈ రుణాలకురాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న వడ్డీ రాయితీ కూడా వర్తింప చేయాలి.

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం
సెల్: 94900 98050

మన... లో నీడే...కాశీభట్ల...!?

వెళ్లిపోయారు కదా..! మరచిపోయామా..! మరచిపోతాం కదా..! వెళ్లిపోయారనుకుందామా..! అతని అక్షరం మన చుట్టూ పరిభ్రమిస్తూ అలాగే తిరుగాడుతూంటే ఎలా జ్ఞప్తి లేదనుకుంటాం. అతను అలా కదులుతున్న ఆర్టీసీ బస్సులో బుల్లి బుల్లి గళ్లను ఎస్ఆర్‌లా నింపుతూ బతికిన సాహిత్య కండక్టర్. మన జీవిత గదులను నింపుకుంటూ పోయాడు కదా..! ఆ కాశీభట్ల నింపింది గళ్లు కాదర్రా బాబూ..! మన సాహిత్యానికి కట్టిన గుళ్లర్రా నాయనలారా..! అని అరవాలనిపించింది. ఏడు పదులు రాగానే కాలాతీతం అయ్యిందనుకున్నారేమో కాశీభట్ల..! తీతువు పిట్టల్నీ మనకి వదిలేసి అలా నడుచుకుంటూ వెళ్లిపోయారాయన. ఆ మనిషి ఉన్నప్పుడు డెబ్బై ఏళ్ల బతికాం కదా ఆయన వెంట పడి. తీరా వెళ్లిపోయాక ఈ సంవత్సరం ఇలా మిగిలిపోయామేమిటి విగత జీవుల్లా.

గుప్పెడు మెతుకులు బతికిస్తాయా..!? పుంజీడు అక్షరాల బతికిస్తాయా అని తర్కించుకునే వాడ్ని నిరంతరం. ఇంతాచేసి ఇదంతా ఆ బారెడు గడ్డాన్ని కలవక ముందు. కానీ కాశీభట్లని కలిసాక, చదివాక, భోరుమన్నాక, బెంబేలెత్తాక, భీతిల్లాక తెలిసింది. మెతుకులు బతికిస్తాయి. అక్షరాలు జీవించేలా చేస్తాయి. నాకెందుకో భోజనం తయార్ బోర్డుల ముందు క్యూ కట్టడం

చక్రవాకం

– ముక్కాముల చక్రధర్

చిరాకు. అక్షరాల అల్మారా ముందు ఒద్దికగా కూర్చోవడం అమితానందం. అలా కూర్చున్నా ఆయన ముందు. ఆయన చెప్పే వరకూ తెలియలేదు మనవి తెరవని తలపులని. పోనీ అని ఆయన తెరిచాకైనా తెలుసుకున్నామా..! తెరచుకోని హృదయాలని తెలిసి.. తెలిసి.. తెలివిగా తాళాలు వెతుక్కునే పనిలో నటిస్తున్నాం. కాశీభట్ల మాత్రం తాళాలను గుత్తులు గుత్తులుగా విరగకాయించి ద్రాక్ష విత్తనంలా మార్మికంగా మాయమయ్యారు. మాటలన్నీ మూటలుగా మార్చేసుకుని మౌనమేలనోయి అని పక్కకు తప్పుకున్నాం. తప్పుకుంటున్నాం. తప్పుకుంటాం. ఏ మార్గమూ సుగమం కాదని అన్ని లక్షల వాక్యాలలో వేణుగానమైన కాశీభట్ల కోసం ఏడాదొకసారైనా ఏడుస్తున్నాం..! ఇదొక్కటే మనకి మిగిలిన ఓదార్పు యాత్ర...!

ఇదిగో ఈ ఓదార్పులోంచే పుట్టిన పుట్టెడు పలకరింతల, సలపరింతల, కలవరింతల, స్నేహింతల, ప్రేమింతలతో అల్లుకున్న గూడు ఈ నిహితం సంకలనం. కాశీభట్లను లోలోపల దాచుకున్నామా...! మన గుండెల్లో ప్రతిష్టించుకున్నామా..! ఈ నిహితం ఒంటరి ప్రేమ కాదు. సామూహిక స్వప్నం. అలాగే ఉండాలనుకున్నాం. ఉంటామనుకున్నాం. ఉండాలని కలగన్నాం. అతగాడ్ని చదువుతున్నంత వరకూ ఆ పాత్రల్లాగే మనమూ అలాగే ఉన్నామనుకునుకుని కలత చెందాం. కంగారు పడ్డాం. కాబోసు అని మదనపడ్డాం. ఇదే కదా రచయిత సాధించాల్సిన, సాధించిన విజయం. ఆ కథల్లో, నవలల్లో, కవిత్వంలో మనల్ని మనం సాక్షాత్కరించుకున్నామంటే, మన "లోనీడ" మన ఎదురుగా కూర్చున్నదంటే ఆ రచయితో, కవో మనల్ని వెంటాడినట్లే కదా..! మనమంతా మామూలు, సాధారణ, భయకంపిత, అనుమానాస్పద, ఆవేదనాభరిత, ఆలోచనాపరులుగా ఆయన్ని చదివినంతసేపైనా ఉండగలుగుతున్నామంటే ఆయన మనల్ని విడిచి పోలేదనేగా..! జీవధర్మాన్ని అనుసరించి వెళ్లిపోయిన ఆ కాశీభట్ల దేహం కర్నూలే కాదు తెలుగు మాట్లాడే, వినిపించే అన్ని చోట్లా తిరుగాడుతుందని ఆయనకు తెలుసు. కర్నూలు లిటరరీ ట్రస్ట్ చైర్మన్ ఉమానాథరావుగారు ఈ నిహితం సంకలనం తొలి పేజీలోనే అన్నట్లుగా కాశీభట్ల వేణుగోపాల్ పేరే ఆశ్చర్యం. కాకపోతే చిన్న సవరణ. ఇది ఆ ఉమానాథరావు గారికే కాదు ఆశ్చర్యాన్ని మిగిల్చింది. సమస్త తెలుగు సాహిత్యానికి ఆ పేరొక అచ్చెరువు. పదిహేడు మంది కవులు, రచయితలు కాశీభట్లను అంచనా వేసేందుకు ప్రయత్నించారు. ఇందులో నేనూ ఉన్నాను. సఫలమయ్యామా... విఫలమయ్యామా.. అసలు కాశీభట్ల అర్థం అయ్యారా.. అర్థం చేసుకునే శక్తి మనకి ఉందా అని ప్రశ్నించుకుంటే... బహుశా నాకైతే ఆ శక్తి లేదనే అనిపిస్తుంది. వెంకటకృష్ణ అన్నట్లు.. కాశీభట్లను చదవకుండానే తెలిసినట్లు మాట్లాడడానికీ ఈ వేణుగోపాల్ ఉపకరించారు. వద్దెర చండీదాస్‌ని పక్కలో పెట్టుకుని నిద్రపోయిన మా తరానికి "కాశీభట్లను చదివావా" అని పెద్దలు ఎవరైనా అడిగితే నోరెళ్లబెట్టడం నేనెరుగుదును. ఆ పెద్దల కోసమైనా కాశీభట్లను చదువుకోవాలని తీర్మానించుకున్న అనేకానేక మందిలో నేనూ ఒకడ్ని. అవును.. మళ్లీ వెంకటకృష్ణే అన్నట్లు కాశీభట్ల పతితుల, భ్రష్టుల మానసిక ప్రతినిధి. అందుకేనేమో... అతి తక్కువ మందికి మాత్రమే ఆయన ఇష్టుడయ్యారు.

తెలుగు సాహిత్య భ్రష్టత్వం దశల వారీగా జరిగింది. తూరుపు దిశగా నడిచే సాహిత్యమే అసలు సిసలు సాహిత్యంగా చెలామణి అయిన రోజుల్లో కాశీభట్ల వేణుగోపాల్ మనో విశ్లేషణ మార్గంలో పయనించడం కూడా ఆయన తెలుగువారికి చేరువ కాకపోవడానికి కారణమైందని నాకనిస్తుంది. నువ్వు సృష్టించే సాహిత్యం కచ్చితంగా సమాజహితం కావాలని, దోపిడీ, దారుణాల నుంచి విముక్తం చేసేదే కావాలనే ఓ పిలుపు రచయితల చుట్టూ తిరుగాడుతున్న కాలంలో కాశీభట్ల వేణుగోపాల్ మనిషిలోని అంతర్యుద్ధాన్ని చూపించారు. మానసిక వైకల్యం కారణంగా ఇంత దారుణం జరుగుతుందా అని ప్రశ్నించేలా చేసింది. కానీ, ఆ అంతర్యుద్ధం, ఆ మానసిక వైకల్యం, సంఘర్షణ తెర మీదకు రాకుండా మరింకేదో సాహిత్యం ఉవ్వెత్తున ఎగిసి కాశీభట్ల వంటి వారిని నిర్లక్ష్యం చేసేలా చేసింది. ఆ దశ దాటిన తర్వాత చేతబడులు, దయ్యాలు, అభూత కల్పనల జీవితాలు గ్లామరైజ్ కావడంతో ఈ దశలో కూడా కాశీభట్ల వంటి సీరియస్ రచయితలు వెనుక బెంచీకే పరిమితం కావాల్సి వచ్చింది. ఈ పరిణామక్రమంలో కాశీభట్ల, వేగుంట, బైరాగి, వద్దెర చండీదాస్, త్రిపుర వంటి వారు ఇంటలెక్చువల్ రీడర్‌కి మాత్రమే దగ్గరయ్యారు. అయితే, ఒక్క విషయం... సీరియస్ రచయితలను మరింత సీరియస్‌గా తీసుకునే ఓ తరం మాత్రం వారిని అనుసరించింది. బహుశా అలా అనుసరించిన వారే నేడు మిగిలారేమో.. దాని ప్రభావమే కాశీభట్ల వెళ్లిపోయిన తర్వాత రెండు నిమిషాలు మౌనం పాటించిన తరమేమో..! తెరవని తలపులు ఓ తరం తెరిచిందేమో...!

(రేపు కర్నూలులో కాశీభట్ల సంస్మరణ సభ. నిహితం సంకలనం ఆవిష్కరణ)

అమెరికా అయుధాల కొనుగోలు నిలుపుదల

అమెరికా నుంచి శక్తిమంతమైన ఆయుధాల కొనుగోలు చేసేందుకు భారత్ తీసుకున్న నిర్ణయాలను తాత్కాలికంగా నిలిపివేసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారతదేశం మీద కత్తికట్టినట్లుగా సుంకాలను ముందుగా 25శాతం విధించి ఆ తరువాత దీనిని 50శాతానికి పెంచింది. అదనంగా విధించిన సుంకాలు ఈ నెల 27వ తేదీనుంచి అమల్లోకిరానున్నాయి. పిచ్చివాడి చేతిలో రాయిలాగా ట్రంప్ వ్యవహరిస్తున్నారు. మన రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వాషింగ్టన్‌కు వెళ్లి ఆయుధాల కొనుగోలు ఒప్పందం కుదుర్చుకునేందుకు సిద్ధపడి ట్రంప్ పిచ్చిచేష్టల మూలంగా తన పర్యటనను మంత్రి వాయిదా వేసుకున్నారు. భారీ యుద్ధ ట్యాంకర్లను (స్ట్రైయికర్స్ కంబాట్ వెహికల్స్), జావిలిన్ మిస్సైల్స్, కొన్ని బోయింగ్ విమానాలను కొనుగోలుచేయాలని ఇండియా నిర్ణయించింది. రష్యానుంచి ముడిచమురు తక్కువరేటుకు దిగుమతి చేసుకుని దానిని శుద్ధిచేసి ఇతర దేశాలకు అమ్ముకుంటున్నాం. దీనిపై ట్రంప్ ఆగ్రహం ప్రకటిస్తున్నాడు. రష్యా నుంచి చమురు దిగుమతిని నిలిపివేయాలని ట్రంప్ కోరుకుంటున్నాడు. రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ తన పర్యటన వాయిదా వేసుకున్నాడని రాయ్‌టర్స్ కథనం. ట్రంప్ 50శాతం సుంకాలను విధించడం వలన ఇండియాలో జౌళిరంగానికి తీవ్రమైన నష్టం జరుగుతుంది. ట్రంప్ ఆగ్రహం ప్రకటించక ముందునుంచి కూడా రష్యా నుంచి దిగుమతి చేసుకునే చమురును భారతదేశం తగ్గించింది. స్ట్రైయికర్స్ కంబాట్ వెహికల్స్‌ను ఇప్పటికే అమెరికా ఉక్రెయిన్‌కు పంపుతోంది. రెండుదేశాల మధ్య

యుద్ధాన్ని నిలిపివేయడానికి బదులుగా ట్రంప్ ఉక్రెయిన్‌కు అన్నివిధాలుగా సహకరిస్తున్నాడు. ధనం, ఆయుధాలతో ఆదుకుంటున్నాడు. మనమీద రెండుసార్లు సుంకాలను విధించిన తర్వాత అప్పుడే అయిపోలేదని ట్రంప్ వ్యాఖ్యానించాడు. ఆయుధాల కొనుగోలుకు సంబంధించిన సమాచారంతో ఈ అంశాలపై బాగా తెలిసిన ముగ్గురు అధికారులుసైతం ఆయుధాల కొనుగోళ్ల నిలుపుదలను ధృవీకరించారు. అయితే ఈ అంశాలన్నింటినీ అటు అమెరికాను, ఇటు ఇండియాను ప్రశ్నించగా రాయ్‌టర్స్‌కు వివరించేందుకు తిరస్కరించాయి. సుంకాల మీద మొదటినుంచి హడావుడి చేసిన ట్రంప్ ఏ ఒక్కమాట మీద నిలవలేదు. చైనా మీద కూడా 500 శాతం సుంకాలు విధిస్తానని బెదిరించి అంతలోనే మాటమార్చాడు. అమెరికా నుంచి ఆయుధాల కొనుగోలుకు ఒప్పందం కుదర్చుకునేందుకు ఇండియా రక్షణమంత్రిత్వశాఖను, పెంటగాన్‌లను రాయ్‌టర్స్ సంప్రదించగా, చెప్పకుండా మౌనం వహించారు. ఇటీవల సంవత్సరాలలో దిల్లీ అమెరికాతో సన్నిహితమైన భాగస్వామ్యాన్ని ఏర్పరచుకునేందుకు ఇండియా గట్టిగా ప్రయత్నిస్తూనే ఉంది. వాషింగ్టన్‌తోపాటు ఐరోపా దేశాలు మాస్కోతో వాణిజ్యాన్ని కొనసాగిస్తూనే ఉన్నాయి. ఈ దేశాలు తమ ప్రయోజనాలకోసమే రష్యాతో గట్టి సంబంధాలను పెట్టుకున్నాయి. స్ట్రైయికర్ కంబాట్ వెహికల్స్, జావెలిన్ యాంటి ట్యాంకు మిస్సైల్స్‌ను కొనుగోలు చేసేందుకు ఇండియా చర్చలు జరుపుతుండగానే ట్రంప్ దుందుడుకువలన అనేక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ ఆయుధాలను రేథియాన్, లాఖీడ్‌మార్టిన్ సంస్థలు ఉత్పత్తిచేశాయి. ఇష్టం వచ్చినట్లుగా మనపై సుంకాలు విధించడం వలన ఆయుధాల కొనుగోలును ప్రస్తుతానికి నిలిపివేశారు. రక్షణమంత్రి కూడా వాషింగ్టన్‌కు వెళ్లడంలేదు. ట్రంప్, నరేంద్ర మోదీలు కలుసుకున్నప్పుడు ఆయుధాల సమీకరణ, వీటిని సంయుక్తంగా ఉత్పత్తిచేయడంపై ఒప్పందం కుదుర్చుకోవాలని నిర్ణయించారు. రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఆరు బోయింగ్ (పీ 81) విమానాలను కొనుగోలు చేయనున్నట్లు ప్రకటించవలసింది. ఇండియా నేవీకి ఉపయోగపడే సిస్టమ్‌లను కూడా కొనుగోలుచేయాలని నిర్ణయించారు. ఇండియా అమెరికాతో భద్రతపైన సంబంధాలను ప్రగాఢం చేసుకోవాలని భావిస్తోంది. చైనాతో వ్యూహాత్మకంగా వైరుధ్యాన్ని రెండు దేశాలు కలిగిఉండాలని భావించాయి. ట్రంప్ మొదటిసారి ఎన్నికైనప్పుడు కీలకమైన రంగాలలో విదేశాంగ విధానాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లాలని చైనా, అమెరికాలు భావించాయని విశ్లేషకులు తెలిపారు. అయితే ఇవన్నీ వాస్తవంకాదని ఇండియా వ్యాఖ్యానించింది.

పశ్చిమదేశాలు-ఫ్రాన్స్, ఇజ్రాయిల్ అమెరికా నుంచి దిగుమతులు పెంచుకోవాలని కూడా ఇండియా ఇటీవల సంవత్సరాల్లో భావించింది. ఈ అంశాలను స్టాక్‌హోమ్ అంతర్జాతీయ శాంతి పరిశోధనా సంస్థ వెల్లడించింది. అమెరికా నుంచి ఎయిర్‌క్రాఫ్ట్ కొనుగోలుకు 3.6 బిలియన్ డాలర్లను చెల్లించే ఒప్పందాన్ని కుదుర్చుకునేందుకు చర్చలు పురోగతిలో ఉన్నాయని అధికారులు వివరించారు. ఇండియా ఆయుధాలను దిగుమతి చేసుకునే దేశాల్లో ప్రపంచంలోనే రెండవస్థానంలో ఉంది. ఇండియాకు ఆయుధాలు సరఫరాచేసే దేశాలలో రష్యా ప్రథమస్థానంలో ఉంది. ఇటీవల సంవత్సరాలలో ఇండియా పశ్చిమదేశాలైన ఫ్రాన్స్, ఇజ్రాయిల్, అమెరికాల నుంచి ఆయుధాలను ఎక్కువగా కొనుగోలు చేస్తోంది. అమెరికా, ఇండియాలు రక్షణ రంగంలో భాగస్వామ్యాన్ని ఏర్పాటు చేసుకోవాలని కూడా నిర్ణయించినట్లు ఇండియా అధికారులు తెలిపారు. ఇండియా, అమెరికా సంబంధాలు అకస్మికంగా దెబ్బతిన్నాయా? అని ప్రశ్నించగా వెంటనే స్పందించలేదని రాయ్‌టర్స్ తెలిపింది. పాకిస్థాన్, ఇండియాల మధ్య నాలుగురోజుల యుద్ధం జరిగినతర్వాత చర్చలు జరిపి తానే నిలుపుదల చేసినట్లు ట్రంప్ పదేపదే చెబుతున్నప్పటికీ, మోదీ ఇంతవరకు ట్రంప్‌ను తీవ్రంగా ఖండించడం చేయనేలేదు. ఇండియా మాస్కో నుంచి ఆయుధాలను ప్రస్తుతం కొనుగోలుచేసే అవసరం లేదనీ, ఇద్దరు ఇండియన్ అధికారులు తెలిపారు. అయితే రానున్నకాలంలో రష్యా నుంచి ఎక్కువ ఆయుధాలను కొనుగోలుచేసే అవకాశం లేకపోలేదని అధికారులు వెల్లడించారు. అయితే ఈ అంశంపై దిల్లీలోని రష్యన్ రాయబార కార్యాలయం స్పందించలేదు.

(రాయ్‌టర్స్ నుంచి)

ఓట్ల చోరీపై కాంగ్రెస్ నిరసనలు

న్యూఢిల్లీ: ఎన్నికల కమిషన్ సాయంతో అధికార పార్టీ 'ఓట్లను దొంగిలించింది' అని ఆరోపిస్తూ, బీజేపీ, ఎన్నికల కమిషన్ (ఈసీ)పై కాంగ్రెస్ పార్టీ శుక్రవారం తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తింది. మహారాష్ట్ర రాజధాని ముంబైలో పార్టీ రాష్ట్ర విభాగం అధ్యక్షుడు హర్షవర్ధన్ నేతృత్వంలో సకల్ కాంగ్రెస్ నాయకులు, శ్రేణులు రాస్తారోకో నిర్వహించి నిరసన తెలిపాయి. ఈసీ, బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. అంతకుముందు తిలక్ భవన్ వద్ద విలేకరుల సమావేశంలో సకల్ మాట్లాడుతూ ఈసీ 'పూర్తిగా విశ్వసనీయత కోల్పోయిందని, అది బీజేపీకి 'బ్రోకర్ లేదా న్యాయవాది' మాదిరిగా నటిస్తోందని అన్నారు. పార్లమెంటులో రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలు గురించి అధికార పార్టీ, ఈసీ ఎందుకు స్పందించడం లేదని ఆయన ప్రశ్నించారు. కాగా లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ఒక 'వ్యవస్థాగతమైన దొంగతనం' గా అభివర్ణించారు. సకల్ మాట్లాడుతూ ఈసీ సహాయంతో బీజేపీ ఎన్నికల్లో ఏ విధంగా అక్రమాలకు పాల్పడిందో డాక్యుమెంటరీ సాక్ష్యంతో సహా రాహుల్ గాంధీ బయటపెట్టారని తెలిపారు. అయితే దీనిపై ఒక ఉన్నత స్థాయి విచారణ కమిటీని ఏర్పాటు చేయడం లేదా సుప్రీం కోర్టు పర్యవేక్షణలో ఒక సిట్ బృందాన్ని నియమించడానికి బదులుగా రాహుల్ గాంధీపై వ్యక్తిగతంగా దాడి చేస్తోందని అన్నారు. అధికారిక అఫిడవిట్ దాఖలు చేయాలని డిమాండ్ చేశారు. అధికారిక ప్రతినిధి దాఖలు ఎన్నికల కమిషన్ నిబంధనలు-1960కు చెందిన 17, 18, 19 నిబంధనలను ఈ సందర్భంగా ఆయన ఎత్తి చూపారు. ఈసీ వాటిని ఎందుకు అమలు చేయడం లేదు? మౌనం ఎందుకు? అని సకల్ ప్రశ్నించారు.

ఎస్ఐఆర్‌పై ఆగని నిరసనలు

పార్లమెంటులోనూ ఆందోళనలు

న్యూఢిల్లీ: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)కు వ్యతిరేకంగా ఇండియా ఐక్యసంఘటన ఎంపీలు పార్లమెంటు వెలుపల శుక్రవారం నిరసన చేశారు. 'ఎస్ఐఆర్ : సైలెంట్ ఇన్‌విజిబుల్ రిగ్గింగ్' అని రాసిన బ్యానర్ పట్టుకుని... ఓట్లు దొంగిలిస్తున్నారంటూ పెద్దఎత్తున నినాదాలతో నిరసన తెలిపారు. ఈ నిరసనల్లో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ పాల్గొన్నారు. పార్లమెంటు ఉభయసభల్లోనూ ఎస్ఐఆర్‌పై విపక్షాలు ఆందోళనకు దిగాయి. చర్చకు అనుమతించాలని డిమాండ్ చేశాయి. రాజ్యసభలో కొంతమంది ఎంపీలు బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేయగా... మరికొంతమంది ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ వాయిదా వేశారు.

బీహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై చర్చకు డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష పార్టీల తీవ్ర నిరసనల మధ్య శుక్రవారం పార్లమెంటు ఉభయ సభలు వాయిదా పడ్డాయి. లోక్‌సభ వాయిదా పడటానికి ముందు ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మునుపటి 'ఆదాయ-పన్ను బిల్లు, 2025' ను ఉపసంహరించుకున్నారు. ప్రైవేట్ సభ్యుల బిల్లులు చేపట్టాల్సి వచ్చినప్పుడు ప్రతిపక్ష పార్టీల సమయాన్ని వృధా చేయడం దురదృష్టకరమని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు అన్నారు. నిబంధనల ప్రకారం అన్ని అంశాలను చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మోదీ ప్రభుత్వం చెబుతున్నా ప్రతిపక్షాలు సహకరించడం లేదని ఆరోపించారు. బీహార్‌లో ఎస్ఐఆర్ గురించి ప్రస్తావిస్తూ ప్రతిపక్ష సభ్యులు సభలో 'ఎస్ఐఆర్ వాపస్ కరో', (రోల్ బ్యాక్ ఎస్ఐఆర్), 'ఎస్ఐఆర్ పే చర్చా కరో' (ఎస్ఐఆర్‌పై చర్చ చేపట్టండి)' వంటి నినాదాలు చేశారు. ముందు రోజు కొంత మంది సభ్యులు లోక్‌సభ స్పీకర్ టేబుల్‌ను కొట్టడంపై ప్రిసైడింగ్ అధికారి తెన్నేటి కృష్ణ ప్రసాద్ తప్పుబట్టారు. 'యే ఠీక్ నహీ హై (ఇది ధ్రమ్ కాదు). మీరు ఇలా టేబుల్ కొట్టకూడదు. లోక్‌సభ స్పీకర్ టేబుల్‌ను కొట్టడాన్ని నేను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాను' అని అన్నారు. అయినప్పటికీ సభ్యులు తమ నిరసనలు కొనసాగించడంతో తెన్నేటి మధ్యాహ్నం 3 గంటల వరకు కార్యకలాపాలను వాయిదా వేశారు. ఉదయం 11 గంటలకు సభ ప్రారంభమైనప్పుడు స్పీకర్ ఓం బిర్లా ఆగస్టు 5న మరణించిన లోక్‌సభ మాజీ సభ్యుడు, జమ్మూకశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్‌కు నివాళు లర్పించారు. క్విట్ ఇండియా ఉద్యమ వార్షికోత్సవం సందర్భంగా ఆయన ఒక సూచనను చదివారు. స్పీకర్ సూచనలు చదివిన వెంటనే ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేశారు. ప్లకార్డులు ప్రదర్శించారు. వారిలో కొందరు ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా నిరసన తెలుపుతూ వెల్‌లోకి దూసుకెళ్లారు. రాజ్యసభలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. సభ్యుల నిరసనల నడుమ సభ వాయిదా పడింది. సంవత్సరం చివర్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీహార్‌లో ఎన్నికల కమిషన్ ప్రారంభించిన ఎస్ఐఆర్ కసరత్తుపై చర్చ జరగాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి.

ఓట్ల దొంగలకు శిక్ష తప్పదు: రాహుల్

న్యూఢిల్లీ: బీజేపీ, ఎన్నికల సంఘం కలిసి ఎన్నికల్లో 'భారీ నేరపూరిత మోసానికి' పాల్పడ్డాయన్న తన ఆరోపణల నుంచి వెనక్కి తగ్గేది లేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పష్టంచేశారు. ఓట్ల దొంగలకు శిక్ష తప్పదని ఘాటుగా హెచ్చరించారు. శుక్రవారం ఎక్స్‌లో ఆయన పోస్టు పెట్టారు. 'ఓట్ల దొంగతనం కేవలం ఎన్నికల కుంభకోణం కాదు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యానికి జరిగిన పెద్ద ద్రోహం. సమయం వచ్చినప్పుడు ఓట్ల చోరీకి పాల్పడిన వారికి కచ్చితంగా శిక్ష పడుతుంది' అని రాసుకొచ్చారు. దీనికి ఆయన ఓ వీడియోను కూడా పంచుకున్నారు. అంతకుముందు ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, హర్యానా, కర్నాటకలోని పలు ప్రాంతాల్లో జరిగిన ఓట్ల చోరీ గురించి ప్రస్తావించారు.

ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాదం: బీజేపీ

రాహుల్ ఆరోపణలను బీజేపీ తీవ్రంగా ఖండించింది. ఆయన చేస్తున్న ఆరోపణలు నిజమైతే అందుకు సంబంధించిన వివరాలతో కూడిన డిక్లరేషన్ సమర్పించాలని బీజేపీ ఐటీ విభాగం అధ్యక్షుడు అమిత్ మాలవీయ పేర్కొన్నారు. రాహుల్ వాటిని సమర్పించడంలో విఫలమైతే... ఆయన పేర్కొంటున్నవి అవాస్తవాలని స్పష్టమవుతుందన్నారు. ప్రజల్లో అపోహలను రేకెత్తించడంకు చేస్తున్న రాజకీయ కుట్ర అని వ్యాఖ్యానించారు. స్వేచ్ఛాయుతమైన, న్యాయమైన ఎన్నికల ప్రతిష్ఠను దెబ్బతీసే కుట్ర అని ఆరోపించారు. రాహుల్ నిర్లక్ష్యపు ప్రకటన మన ప్రజాస్వామ్యానికి హానికరమన్నారు.

రిజిస్టర్డు పోస్ట్ ఆగదు: కేంద్రం

న్యూఢిల్లీ: బ్రిటిష్ కాలం నుంచి అమల్లో ఉన్న రిజిస్టర్డు పోస్టును తపాలా శాఖ నిలిపివేస్తుందంటూ సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారంపై కేంద్రం స్పందించింది. 2025 సెప్టెంబర్ 1 నుంచి రిజిస్టర్డ్ పోస్ట్ నిలిపివేస్తున్నట్లు వస్తున్న వార్తలు అవాస్తవమని స్పష్టం చేసింది. ఇలాంటి క్లెయిమ్‌లతో కొందరు ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసింది. రిజిస్టర్డు పోస్టు నిలిపివేయట్లేదని, ఇది స్పీడ్ పోస్ట్‌లో విలీనం అవుతోందని స్పష్టం చేస్తూ పీఐబీ 'ఫ్యాక్ట్‌చెక్' విభాగం 'ఎక్స్' వేదికగా తెలియజేసింది. గతంలో మాదిరిగానే రిజిస్టర్డు పోస్టులను సంబంధిత వ్యక్తులు నేరుగా వచ్చి డెలివరీ చేస్తారని, డెలివరీ రసీదు, రియల్ టైమ్ ట్రాకింగ్ ఉంటుందని పేర్కొంది. రిజిస్టర్డ్ పోస్టు విధానాన్ని స్పీడ్ పోస్టులో విలీనం చేస్తూ ఇటీవల తపాలా శాఖ నిర్ణయం తీసుకుంది. ఈ విధానం సెప్టెంబరు ఒకటి నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి రానుంది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వినియోగదారులకు అత్యంత వేగవంతమైన, మెరుగైన సేవలు అందించడం, ట్రాకింగ్ విధానాన్ని సులభతరం చేయడం, అన్ని సేవలను ఒకే గొడుగు కిందకు తేవాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే అన్ని సర్కిల్ పరిధిలోని మెయిల్ ఆపరేషన్ డివిజన్లకు ఇటీవల ఆదేశాలు జారీ చేశారు.

లాలు కన్నా బీజేపీ నేతలే అవినీతిపరులు

ప్రశాంత్ కిశోర్ ధ్వజం

పాట్నా: బీహార్ ఆరోగ్య శాఖలో 'తీవ్రమైన అక్రమాలు' జరిగాయని జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ శుక్రవారం ఆరోపించారు. ఎన్డీఏ పాలన అంతటా బీజేపీ కనుసన్నల్లోనే కొనసాగుతోందని, లాలు ప్రసాద్ కన్నా కాషాయ పార్టీ నాయకులు అత్యంత 'అవినీతిపరులు' అని ధ్వజమెత్తారు. ఇక్కడ విలేకరుల సమావేశంలో కిశోర్ మాట్లాడుతూ బీజేపీ బీహార్ మాజీ అధ్యక్షుడు కూడా అయిన రాష్ట్ర ఆరోగ్య మంత్రి మంగళ్ పాండేపై ప్రత్యక్ష విమర్శల దాడి చేశారు. బీజేపీ ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షుడు దిలీప్ జైస్వాల్‌తో ఆయన 'క్విడ్ ప్రో కో' చేశారని మండి పడ్డారు. జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు కొంతకాలంగా ఆయనను లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పిస్తున్నారు. 'రాష్ట్ర ఆరోగ్య శాఖ '1,200 అంబులెన్స్‌ల' కోసం ఆర్డర్ ఇచ్చిందని, ఇది ఒక్కొక్కటి రూ.28 లక్షల ధరకు లభిస్తుందని, ఇది ఒడిశా, ఉత్తర ప్రదేశ్ వంటి రాష్ట్రాలు చెల్లిస్తున్న దానికంటే దాదాపు రెండింతలు ఎక్కువని ఆరోపించారు. కోవిడ్-19 మహమ్మారి తీవ్రంగా ఉన్న సమయంలో పాండే తన భార్య పేరు మీద ఢిల్లీలో ఒక ఫ్లాట్ కొనుగోలు చేశారని, ఈ లావాదేవీలో జైస్వాల్ అతనికి సహాయం చేశారని ఆరోపించారు. 'జైస్వాల్ భారీ వాటాలు ఉన్న కిషన్ గంజ్‌లోని ఒక వైద్య కళాశాలకు డీమ్డ్ యూనివర్సిటీ హోదాను మంజూరు చేయడం ద్వారా పాండే తన కృతజ్ఞతను చూపించారు' అని కిశోర్ ఆరోపించారు. 'జైస్వాల్ ఆగస్టు 6, 2019న పాండే తండ్రి ఖాతాకు రూ.25 లక్షలు బదిలీ చేశారు. ఆ డబ్బును అప్పటి ఆరోగ్య మంత్రి భార్య పేరు మీద ఒక ఫ్లాట్ కొనుగోలుకు ఉపయోగించారు. ఢిల్లీలోని ద్వారకలో కొనుగోలు చేసిన ఫ్లాట్ డాక్యుమెంట్‌లో జైస్వాల్ సాక్షిగా సంతకం చేశారు' అని అన్నారు. పాండే ఈ మొత్తాన్ని జైస్వాల్ నుంచి అప్పుగా తీసుకున్నప్పటికీ, 2020 అసెంబ్లీ ఎన్నికల్లో తన ఎన్నికల అఫిడవిట్‌లో అన్ సెక్యూర్డ్ లోన్ కేటగిరీలో దానిని ఎందుకు ప్రస్తావించలేదని కిశోర్ ప్రశ్నించారు. 'బీహార్‌లోని బీజేపీ నాయకులు తాము మచ్చలేని వారమని చెప్పుకుంటున్నారు. కానీ వాస్తవానికి వారు ఆర్జేడీ అధ్యక్షుడు లాలు ప్రసాద్ కంటే కూడా అవినీతిపరులు. దాణా కుంభకోణం కేసుల్లో దోషిగా తేలినందుకు, హోటళ్లకు భూమి, ఉద్యోగాలకు భూమి వంటి రైల్వే కుంభకోణాలలో ప్రమేయం ఉందని ఆరోపిస్తూ ఆయనపై దాడి చేయడానికి ఇష్టపడతారు' అని కిశోర్ అన్నారు. పాండే, జైస్వాల్ ఈ లావాదేవీని వివరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఇటీవల రాజస్థాన్ కోర్టు ఉత్తర్వులు కూడా ప్రస్తావిస్తూ, మరో బీజేపీ నాయకుడు, బీహార్ మంత్రి జిబేష్ మిశ్రా నకిలీ మందుల తయారీలో పాల్గొన్నందుకు దోషిగా నిర్ధారించబడ్డారని అన్నారు. 'కోర్టు ఆదేశం వేచున్నా ఆయనను తొలగించాలని లేదా రాజీనామా చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేసినప్పటికీ ఆ బీజేపీ నాయకుడు... నితీశ్ కుమార్ మంత్రివర్గంలో కొనసాగుతున్నారని విమర్శించారు. ఒక రోజు క్రితం పాట్నాలో విద్యార్థులపై పోలీసులు చేసిన లాఠీ చార్జిని ప్రశాంత్ కిశోర్ ఖండించారు.

ఇథనాల్‌తో ఇబ్బంది లేదు: గడ్కరీ



న్యూఢిల్లీ: ఇరవై శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్ సురక్షితం కాదంటూ కొంతకాలంగా సామాజిక మాధ్యమాల్లో పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. అవన్నీ అవాస్తవమేనని ఇటీవల కేంద్రం స్పష్టత ఇచ్చింది. తాజాగా కేంద్ర రోడ్డు, రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ దీనిపై స్పందిస్తూ బహిరంగ సవాల్ విసిరారు. ఇథనాల్ మిశ్రమం కారణంగా మైలేజీ సమస్య వచ్చిన ఒక్క వాహనాన్ని చూపించాలని ఆయన అన్నారు. 'బిజినెస్ టుడే' నిర్వహించిన సదస్సులో నితిన్ గడ్కరీ పాల్గొన్నారు. ఇథనాల్ అంశాన్ని ప్రశ్నించగా 'పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ కలపడం వల్ల వాహనాల మైలేజీ తగ్గుతోందనే వాదనకు ఎలాంటి అర్థం లేదు. కనీసం ఇది చర్చించే అంశం కూడా కాదు. ఈ విషయం నేను చెప్పొచ్చో, లేదో తెలియదు గానీ... ఇది పెట్రోలియం కంపెనీలు ఉద్దేశపూర్వకంగా చేస్తున్న ప్రయత్నాలు కావొచ్చని అనుకుంటున్నా. దీనిపై నేను బహిరంగ సవాల్ విసురుతున్నా... ప్రపంచంలో ఎక్కడైనా ఈ పెట్రోల్ వల్ల సమస్య వచ్చిందని చెప్పే ఒక్క వాహనాన్నైనా చూపించండి. ఇథనాల్ కలపడం వల్ల ఎలాంటి సమస్యా లేదు' అని గడ్కరీ చెప్పారు.

ట్రంప్, రూబియో వ్యాఖ్యలను

మోదీ ఖండించరెందుకు?

న్యూఢిల్లీ: భారత్-పాక్ మధ్య నాలుగు రోజుల సైనిక వివాదంపై అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో ఇటీవల చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ శుక్రవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీపై విమర్శలు గుప్పించింది. ప్రధాన మంత్రి ఆ వ్యాఖ్యలను ఖండించడం లేదని ప్రశ్నించింది. భారత్-పాక్ యుద్ధానికి దిగినప్పుడు అమెరికా 'ప్రత్యక్షంగా జోక్యం చేసుకుంది' అని రూబియో చెప్పిన తర్వాత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండు అణ్వాయుధ పొరుగువారి మధ్య శాంతిని నెలకొల్పారు. మే 10 నుంచి ట్రంప్ భారత్-పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతను 'పరిష్కరించడానికి' తాను సహాయం చేశానని చాలాసార్లు తన వాదనను పునరావృతం చేశారు. అణ్వాయుధ పొరుగు దేశాలు ఈ వివాదాన్ని ఆపి అమెరికా వారితో 'చాలా వ్యాపారం' చేస్తుందని ఆయన వారికి చెప్పారు. 'ఎక్స్' లో ఒక పోస్ట్‌లో, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, కమ్యూనికేషన్ వ్యవహారాల ఇంఛార్జ్ జైరాం రమేశ్ మాట్లాడుతూ జనవరి 22, 2025న భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌తో అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో మొదటి ద్వైపాక్షిక సమావేశం జరగడం చాలా దురదృష్టకరమైనదని అన్నారు. 'మే 10, 2025న సాయంత్రం 4:35 గంటలకు అమెరికా జోక్యం కారణంగా భారతదేశం మరియు పాకిస్తాన్ కాల్పుల విరమణకు వచ్చాయని మొట్టమొదట ప్రకటించినది రూబియో. అప్పటి నుంచి అతని బాస్ అమెరికా అధ్యక్షుడు ఆ వాదనను 34 సార్లు పునరావృతం చేశారు. ఇప్పుడు రూబియో స్వయంగా మరోసారి భారత్-పాక్ యుద్ధానికి వెళ్లినప్పుడు అధ్యక్షుడు ట్రంప్ 'ప్రత్యక్షంగా పాల్గొని శాంతిని అందించారని చెప్పారు' అని వివరించారు. 'మోదీ ఎందుకు మౌనంగా ఉన్నారు? అధ్యక్షుడు ట్రంప్, రూబియో చెబుతున్న దానికి విదేశాంగ మంత్రి కూడా సగం తెలివిగా స్పందించారు. జూన్ 19, 2020న 'నా కోయి హమారీ సీమా మే ఘుస్ ఆయా హై, న హి కోయి ఘుసా హువా హై' అనే తన ప్రస్తుత అప్రసిద్ధ వాక్యంతో చైనాకు బహిరంగంగా క్లీన్ చిట్ ఇవ్వడానికి మోదీ తొందరపడ్డారు' అని విమర్శించారు. 'అధ్యక్షుడు ట్రంప్, రూబియో తరచూ చెబుతున్న వాటిని ఆయన బహిరంగంగా, స్పష్టంగా ఎందుకు ఖండించడం లేదు? ఆయన దేనికి భయపడుతున్నారు?' అని జైరాం రమేశ్ ప్రశ్నించారు.

ట్రంప్ సుంకాలతో తయారీ రంగం కుదేలు: మూడీస్



న్యూఢిల్లీ: భారత దిగుమతులపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన అధిక సుంకాలు తయారీ రంగాన్ని తీవ్రంగా దెబ్బతీయవచ్చని, ఆర్థిక వృద్ధి నెమ్మదిస్తుందని మూడీస్ రేటింగ్స్ శుక్రవారం హెచ్చరించింది. రష్యా నుండి చమురు కొనుగోలు చేస్తోందంటూ భారత దిగుమతులపై ట్రంప్ అదనంగా 25 శాతం సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. మార్చి 2026తో ముగిసే ఆర్థిక సంవత్సరానికి భారతదేశ వాస్తవ జీడీపీ వృద్ధి ప్రస్తుతం అంచనా వేసిన 6.3 శాతంలో నుండి సుమారు 0.3 శాతం మందగించవచ్చని మూడీస్ సంస్థ తెలిపింది. 2025 తర్వాత, ఇతర ఆసియా పసిఫిక్ దేశాలతో పోలిస్తే చాలా విస్తృతమైన టారిఫ్ అంతరం భారతదేశ తయారీ రంగాన్ని ముఖ్యంగా ఎలక్ట్రానిక్స్ వంటి అధిక విలువ కలిగిన రంగాలను అభివృద్ధి చేయాలనే ఆకాంక్షకు తీవ్రంగా నష్టం కలిగిస్తుందని పేర్కొంది. ఆయా రంగాల్లో పెట్టుబడులు ఆకర్షించడంలో కొన్నేళ్లుగా సాధించిన కొన్ని లాభాలను కూడా తగ్గించే అవకాశం ఉందని నివేదిక పేర్కొంది. సుంకాల భారాన్ని తప్పించుకునేందుకు రష్యా చమురు దిగుమతులు తగ్గిస్తే... అదే స్థాయిలో చమురు దిగుమతులు పొందడం భారత్‌కు కష్టతరం అవుతుందని సూచించింది. పెట్టుబడుల ప్రవాహాలకు ఆటంకం ఏర్పడటంతో దిగుమతుల విలువ పెరిగి లోటు అధికమయ్యే అవకాశం ఉందని హెచ్చరించింది. ఈ రెండు అంశాల దృష్ట్యా చర్చలతో పరిష్కారం లభించే అవకాశం ఉందని భావిస్తున్నామని మూడీస్ తెలిపింది.

హైకోర్టు జడ్జిపై ఆంక్షలు... సుప్రీం వెనక్కి

న్యూఢిల్లీ: అలహాబాద్ హైకోర్టు జడ్జిపై ఆంక్షల విషయంలో గతంలో వెలువరించిన ఉత్తర్వులను సుప్రీంకోర్టు ఉపసంహరించుకుంది. రిటైరయ్యేంతవరకూ హైకోర్టు జడ్జికి క్రిమినల్ కేసులు అప్పగించకూడదని ఆంక్షలు విధిస్తూ ఈనెల 4న వెలువరించిన ఉత్తర్వులను ఉప సంహరించుకుంటున్నట్లు పేర్కొంది. సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ అభ్యర్థన మేరకు న్యాయమూర్తులు జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ ఆర్.మహాదేవన్‌తో కూడిన ధర్మాసనం దీనిని వెనక్కి తీసుకున్నది. ఈ కేసు విషయంలో తీర్పును పునఃపరిశీలించాలని కోరుతూ భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ నుంచి తమకు లేఖ అందిందని ధర్మాసనం పేర్కొంది. సంబంధిత న్యాయమూర్తికి ఇబ్బందులు కలిగించడం తమ ఉద్దేశం కాదని, అయితే కొన్ని విషయాల్లో పరిమితులు దాటినప్పుడు న్యాయవ్యవస్థ గౌరవాన్ని కాపాడటం కోసమే కోర్టు పనిచేస్తుందని జస్టిస్ పార్దివాలా పేర్కొన్నారు. అంతకుముందు ఇచ్చిన ఉత్తర్వులను వెనక్కి తీసుకున్నప్పటికీ అలహాబాద్ హైకోర్టు తీర్పు చట్టవిరుద్ధమని ఆందోళన వ్యక్తంచేశారు. న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసే ఇటువంటి ఆదేశాలను విస్మరించలేమని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు ఆదేశంలోని కొన్ని అంశాలు అమలుకాకుండా నిరోధించేందుకు ఫుల్ కోర్టును సమావేశపరచాలని అలహాబాద్ హైకోర్టుకు చెందిన 13 మంది న్యాయమూర్తులు గురువారం అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశారు. 'హైకోర్టులపై పాలనాపరమైన పర్యవేక్షణ అధికారం సుప్రీంకోర్టుకు లేదని, అందుకే ఆగస్టు 4నాటి సుప్రీం ఆదేశంలోని 24వ, 26వ పేరాల్లోని నిర్దేశాలను అమలుచేయరాదని ఫుల్‌కోర్టు తీర్మానించాలని జడ్జీలు కోరారు. ఈ నేపథ్యంలో 'సుప్రీం' తన ఉత్తర్వులను వెనక్కి తీసుకుంది.

ధరాలీలో సహాయక బృందాలకు ఇస్రో సహకారం

డెహ్రాడూన్: ఉత్తరకాశీ జిల్లాలో ధరాలీ గ్రామాన్ని జలప్రళయం ముంచెత్తింది. ఖీర్ గఢ్, భాగీరథీ నదులు ఉప్పొంగడంతో వరద నీరు ఒక్కసారిగా గ్రామాన్ని నామరూపాలు లేకుండా చేసింది. పూర్తిగా పర్వత ప్రాంతాల్లో ఉన్న ధరాలీ గ్రామం బురదలో కూరుకుపోయింది. వరదలో ఇళ్లు కొట్టుకుపోయాయి. మరికొన్ని ఇళ్లను బురద కప్పేసింది. పదుగురు మరణించారు. వంద మందికిపైగా గల్లంతయ్యారు. దాంతో గల్లంతైన వారిని గుర్తించేందుకు సహాయక చర్యలు చేపట్టారు. సహాయక చర్యల్లో భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ కూడా తనవంతు సహకారం అందిస్తోంది. ధరాలీ గ్రామానికి సంబంధించిన ఉపగ్రహ చిత్రాలను సహాయక బృందాలకు ఇస్రో ఇచ్చింది. వీటి ఆధారంగా గ్రామంలో భవనాలు ఉన్న ప్రాంతాలను గుర్తించి బురద తొలగిస్తున్నారు. బురదలో చిక్కుకున్న వారిని గుర్తించేందుకు ఉపగ్రహ చిత్రాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని అధికారులు తెలిపారు. సహాయక చర్యలకు అవసరమైన అత్యాధునిక పరికరాలను విమానాల్లో ధరాలీ గ్రామానికి తరలిస్తున్నట్లు వివరించారు. కాగా, గంగోత్రికి వెళ్లే యాత్రికులు మార్గమధ్యంలో ధరాలీ గ్రామంలో ఆగుతుంటారు. ఈ క్రమంలో ధరాలీకి కొండచరియలు విరిగిపడ్డాయి. వివిధ రోడ్లు మూసుకుపోవడంతో యాత్రికులు ఎక్కడికక్కడ చిక్కుకుపోయారు. వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు అధికారులు తెలిపారు.

కొత్త ఐటీ బిల్లు ఉపసంహరణ

న్యూఢిల్లీ: పార్లమెంటులో ప్రవేశపెట్టిన ఆదాయపు పన్ను (ఐటీ) నూతన బిల్లు 2025ను తాజాగా కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకున్నట్లు తెలుస్తోంది. దీనికి మరింత మెరుగులు దిద్ది... మళ్లీ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని నిర్ణయించినట్లు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ నూతన ఆదాయపు పన్ను బిల్లును ఈ ఏడాది ఫిబ్రవరి 13న కేంద్రం లోక్‌సభలో ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. దీనిపై విపక్షాలు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో ఈ బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపించారు. కమిటీ దీన్ని అధ్యయనం చేసి జులై 21న తమ నివేదికను పార్లమెంట్‌కు సమర్పించింది. మొత్తం 4500 పేజీలతో కూడిన ఈ నివేదికలో మునుపటి బిల్లుకు 285 ప్రతిపాదనలు చేసింది. ఈ ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకున్న కేంద్రం... దానికి అనుగుణంగా కొత్త బిల్లు రూపొందించేందుకు సిద్ధమైంది. ఈ అప్‌డేటెడ్ బిల్లును ఆగస్టు 11న లోక్‌సభ ముందు తీసుకురావాలని కేంద్రం నిర్ణయించినట్లు సమాచారం. నూతన ఆదాయపు పన్ను బిల్లుకు సెలెక్ట్ కమిటీ కొన్ని ప్రధాన సూచనలు చేసింది. ముఖ్యంగా ఇంటిపై ఆదాయం పొందుతున్న వారికి ఉపశమనం కలిగేలా కొన్ని ప్రతిపాదనలు సూచించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం గృహ రుణ వడ్డీతో పన్ను మినహాయింపు ప్రయోజనాలు కేవలం సొంతింట్లో ఉంటున్న వారికి మాత్రమే వర్తిస్తున్నాయి. అలా కాకుండా సొంతింటిని అద్దెకు ఇచ్చిన సందర్భాల్లోనూ వడ్డీతో పన్ను మినహాయింపు కల్పించాలని కమిటీ సూచించినట్లు సమాచారం. ఇక, టీడీఎస్, టీసీఎస్ రీఫండ్లను కూడా సరళతరం చేయాలని కమిటీ ప్రతిపాదనలు చేసింది.

రాహుల్ గాంధీకి శశి థరూర్ మద్దతు

న్యూఢిల్లీ: బీజేపీ, కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) కుమ్మక్కై 2024 లోక్‌సభ ఎన్నికల్లో 'భారీ క్రిమినల్ మోసం' చేశాయంటూ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలకు ఆ పార్టీ ఎంపీ శశిథరూర్ మద్దతు పలికారు. ఇటీవల పార్టీ అధిష్టానంతో విభేదిస్తున్న థరూర్ మద్దతు ఇవ్వడం చర్చనీయాంశమైంది. ఎన్నికల ప్రక్రియ 'తొలుత నిర్వీర్యం చేసినట్లుగానే' జరిగిందని, ఈసీ... బీజేపీతో కలిసి పనిచేసిందని రాహుల్ ఆరోపించారు. దీనికి రుజువుగా ఆయన కర్ణాటకలోని మహదేవపుర అసెంబ్లీ నియోజకవర్గాన్ని చూపారు. అక్కడ బీజేపీకి 1,14,046 ఓట్ల భారీ ఆధిక్యం రావడంతో, బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ సీటును 32,707 ఓట్ల మెజారిటీతో గెలుచుకుందని తెలిపారు. కాంగ్రెస్ ఇతర నియోజకవర్గాల్లో ఆధిక్యంలో ఉన్నా, కేవలం ఒక నియోజకవర్గంలో వచ్చిన ఆధిక్యం వల్ల ఫలితం మారిపోయిందని ఆయన చెప్పారు. ఈ ఆరోపణల నేపథ్యంలో 10-15 సంవత్సరాలు ఓటరు డేటాను, పోలింగ్ కేంద్రాల సీసీటీవీ ఫుటేజీని అందించాలని రాహుల్ గాంధీ ఈసీని డిమాండ్ చేశారు. 'ఈసీ మాకు ఈ డేటా, సీసీటీవీ ఫుటేజ్ ఇవ్వకపోతే, వారు ఈ నేరంలో భాగస్వాములైనట్లే' అని ఆయన స్పష్టం చేశారు. శశి థరూర్ తన ఎక్స్ పోస్ట్‌లో 'ఈ ప్రశ్నలు చాలా తీవ్రమైనవి, అన్ని పార్టీలు, ఓటర్ల ప్రయోజనాల దృష్ట్యా వీటిని పరిష్కరించాలి. మన ప్రజాస్వామ్యం చాలా విలువైనది, దాని విశ్వసనీయతను అసమర్థత, నిర్లక్ష్యం లేదా కావాలని చేసిన మోసం ద్వారా నాశనం కానివ్వకూడదు' అని పేర్కొన్నారు. ఈ విషయాలపై వివరణ ఇవ్వాల్సిందిగా ఆయన ఈసీని కోరారు. గత ఆరు నెలలుగా ప్రధాని మోదీని పొగడటం, ఎమర్జెన్సీపై విమర్శలు చేయడంతో పార్టీ ఆగ్రహానికి గురైన థరూర్ ఇప్పుడు రాహుల్‌కు మద్దతు ఇవ్వడం ఆసక్తికరంగా మారింది. మరోవైపు, రాహుల్ గాంధీ 'నిరాధార ఆరోపణలు' చేస్తున్నారని బీజేపీ విమర్శించింది. కాంగ్రెస్ పదేపదే ఓడిపోవడంతో కలిగిన 'నిరాశ, కోపం'తోనే రాహుల్ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని, ఇలాంటి 'నిర్లక్ష్య, సిగ్గుమాలిన' ప్రకటనల వల్ల ఓటర్లు కాంగ్రెస్‌ను తిరస్కరిస్తూనే ఉంటారని పేర్కొంది.

నటి హుమా ఖురేషి సోదరుడి హత్య

న్యూఢిల్లీ: ఢిల్లీలోని నిజాముద్దీన్ ప్రాంతంలో పార్కింగ్ వివాదం ప్రాణాలు తీసింది. నటి హుమా ఖురేషి సోదరుడు ఆసిఫ్ ఖురేషిని హత్య చేశారు. ఈ ఘటనలో ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. హత్యకు ఉపయోగించిన ఆయుధాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు చెప్పారు. గురువారం రాత్రి 10 గంటల సమయంలో హత్య జరిగింది. వివరాలివి. ఇంటి ప్రధాన ద్వారానికి దూరంగా స్కూటర్ పార్కింగ్ చేయాలని ఆసిఫ్ ఖురేషి ఇద్దరు వ్యక్తులను కోరాడు. ఆ సమయంలో వారి మధ్య వాగ్వాదం జరిగింది. అయితే బెదిరింపులకు పాల్పడిన వ్యక్తులు... మళ్లీ వస్తామని హెచ్చరించారు. కేవలం పార్కింగ్ విషయం పెద్ద గొడవగా మారినట్లు ఆసిఫ్ భార్య వెల్లడించారు. గొడవకు దిగిన వ్యక్తి, తన సోదరుడితో వచ్చి ఓ పదునైన ఆయుధంతో ఆసిఫ్‌ను పొడిచినట్లు పోలీస్ చెప్పింది. ఈస్ట్ కైలాశ్ ప్రాంతంలో ఉన్న నేషనల్ హార్ట్ ఇన్‌స్టిట్యూట్‌కు ఆసిఫ్‌ను తరలించారు. అప్పటికే ఆయన మృతిచెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు.

తమిళనాడులో జాతీయ విద్యా విధానానికి స్వస్తి

చెన్నై: కేంద్ర ప్రభుత్వం, తమిళనాడు మధ్య హిందీ వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ జాతీయ విద్యా విధానానికి స్వస్తి పలికారు. తమిళనాడు రాష్ట్ర ప్రజల కోసం సొంతంగా 'స్టేట్ ఎడ్యుకేషన్ పాలసీ'ని ఆవిష్కరించారు. కేంద్రం తీసుకొచ్చిన జాతీయ విద్యావిధానానికి కౌంటర్‌గా స్టాలిన్ స్టేట్ ఎడ్యుకేషన్ పాలసీని ప్రవేశపెట్టబోతున్నారు. చెన్నైలోని అన్నా సెంటినరీ లైబ్రరీ ఆడిటోరియంలో నూతన స్టేట్ ఎడ్యుకేషన్ పాలసీని స్టాలిన్ శుక్రవారం ఆవిష్కరించారు. కేంద్రం చెబుతున్న త్రిభాషా సూత్రాన్ని తోసిపుచ్చుతూ ద్విభాషా అజెండాతో ఈ ఎడ్యుకేషన్ పాలసీని రూపొందించారు. 2022లో రిటైర్డ్ జడ్జి జస్టిస్ మురుగేశన్ నేతృత్వంలో 14 మంది సభ్యుల కమిటీని ఏర్పాటు చేసి, నూతన విద్యావిధానాన్ని రూపొందించాలని ఆదేశించగా, ఈ కమిటీ గతేడాది తమ ప్రతిపాదనలను సీఎం స్టాలిన్‌కు అందజేసింది. మురుగేశన్ కమిటీ అందించిన రిపోర్టును క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం తాజాగా 'స్టేట్ ఎడ్యుకేషన్ పాలసీ'ని ఆవిష్కరించారు. స్టేట్ ఎడ్యుకేషన్ పాలసీలో మాతృ భాషతో పాటు ఇంగ్లిష్, ఏఐ, సైన్స్‌కు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. నీట్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న తమిళనాడు ప్రభుత్వం... కొత్త విద్యావిధానంలో ప్రవేశ పరీక్షలకు బదులుగా మార్కుల ఆధారంగా ప్రవేశాలు కల్పించాలని నిర్ణయించారు. 11, 12వ తరగతుల మార్కుల ఆధారంగా యూజీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. 3, 5, 8 తరగతులకు పబ్లిక్ పరీక్షలు నిర్వహించాలన్న ప్రతిపాదనను కమిటీ తోసిపుచ్చింది. దీని కారణంగా అధిక డ్రాపౌట్ రేటు పెరిగే అవకాశం ఉందని అభిప్రాయపడింది.

విశాలాంధ్ర హైదరాబాద్

తెలంగాణ వైద్య విధాన పరిషత్‌ను

డైరెక్టర్ సెకండరీ హెల్త్‌గా అప్‌గ్రేడ్ చేస్తాం

మంత్రి దామోదర్ రాజనర్సింహ

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ వైద్య విధాన పరిషత్‌లో 1690 డాక్టర్ పోస్టుల భర్తీకీ సానుకూలంగా మంత్రి దామోదర్ రాజనర్సింహా స్పందించారు. డాక్టర్ల పోస్టుల భర్తీకీ తెలంగాణ మెడికల్ బోర్డు త్వరగా విధివిధానాలు రూపొందించాలని మంత్రి దామోదర్ ఆదేశించారు. డాక్టర్ల ఉద్యోగాల భర్తీలో వయోపరిమితి పెంపుపై నిబంధనలు రూపొందించటానికి కమిటీని నియమిస్తామని తెలిపారు. టివివిపిలో క్యాడర్ స్ట్రెంత్ పెంపుపై కమిషనర్ డా.అజయ్ కుమార్‌తో మంత్రి చర్చించారు. టిజిజిడిఏ డాక్టర్ల సంఘం ప్రతినిధులతో సంగారెడ్డిలోని తన నివాసంలో మంత్రి దామోదర్ రాజనర్సింహా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ల సమస్యలపై అసోసియేషన్ ప్రతినిధులు చేసిన విజ్ఞప్తిపై మంత్రి దామోదర్ రాజనర్సింహా సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశంలో తెలంగాణ గవర్నమెంట్ డాక్టర్ల అసోసియేషన్ అధ్యక్షులు డా.నరహరి, సెక్రెటరి జనరల్ డా.లాలు ప్రసాద్, డా. రాహుఫ్, డా.వినయ్ కుమార్, డా.గోపాల్, డా.క్రాంతి, డా. అశోక్, డా. రామ్‌సింగ్‌లు పాల్గొన్నారు.

భూభారతి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : భూభారతి, రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం భూభారతి, రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తుల పరిష్కార దిశలో భాగంగా మూడు చింతలపల్లి తహసీల్దారు కార్యాలయాన్ని అదనపు కలెక్టరు తనిఖీ చేసారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టరు మాట్లాడుతూ భూభారతి ఆన్ లైన్ ద్వారా, రెవెన్యూ సదస్సులలో దరఖాస్తు దారులు ఇచ్చిన దరఖాస్తు లు ఎంత వరకు పరిష్కారమయ్యాయని మూడు చింతలపల్లి తహసిల్దారును అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తుల పరిష్కారా నికి అవుతున్న జాప్యానికి గల కారణాలను పరిశీలించారు. సాంకేతిక పరమైన ఏమైన ఇబ్బందులు ఉన్నట్లయితే వెంటనే క్లియర్ చేసుకోవాలని, దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఆన్‌లైన్‌లో మ్యానువల్‌గా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను అదనపు కలెక్టరు పరిశీలించారు.

ముంపు ప్రాంతాల్లో జిహెచ్‌ఎంసి హైడ్రా సిబ్బంది చర్యలు

విశాలాంధ్ర - మల్కాజిగిరి : వర్షాకాలంలో ముంపు నివారణకు చర్యలు చేపడుతున్నామని హైడ్రా అధికారులు, బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని మీర్జాల గూడ, చిన్మయి మార్గ్ తదితర ప్రాంతాలలో వరద నీరు పొంగిపొర్లి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మల్కాజిగిరి శాసన సభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు విషయం తెలుసుకున్న స్థానిక బీఆర్ఎస్ నాయకులు మేకల రాము యాదవ్ నేతృత్వంలో జిహెచ్ఎంసి హైడ్రా సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని సమస్య నివారణకు సహాయక చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి హైడ్రా సిబ్బందితోపాటు స్థానిక నాయకులు, చిన్మయి మార్గ్ కాలనీవాసులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయంలో మైనంపల్లి పూజలు

విశాలాంధ్ర - మల్కాజిగిరి : ఆనంద్ బాగ్ శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్ ప్రత్యేక పూజలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఈ.ఓ రవీందర్ రెడ్డి నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, వెంకటేష్ యాదవ్, శ్రీనివాస్, గుండా నిరంజన్, డివిజన్ అధ్యక్షులు సంపత్ గౌడ్, వైనాల ప్రవీణ్, వినోద్ యాదవ్, సత్యమూర్తి, మాజీ చైర్మన్లు ఉమేష్ సింగ్, సంతోష్ రాందాస్ ముదిరాజ్, బాబు, సత్యనారాయణ, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు సానాది శంకర్, కుమార్, గణేష్, సురేష్ సింగ్, చారి, ఇస్త్రారీ, దేవేందర్, బ్రహ్మయ్య, బాలరాజు యాదవ్, యాదగిరి, రాము తదితరులు పాల్గొన్నారు.

షిర్డీనగర్‌లో పర్యటించిన మాజీ ఎమ్మెల్యే

విశాలాంధ్ర - మల్కాజిగిరి : ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని షిరిడి నగర్‌లో మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు డివిజన్ కార్పొరేటర్ ప్రేమ్ కుమార్ తో కలిసి కురిసిన వర్షానికి జలమయమైన ప్రాంతాల్లో పర్యటించి సమస్య పరిష్కరించారు. ముంపు లేకుండా చర్యలు తీసుకుంటామని తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో లక్ష్మీకాంతరెడ్డి, వెంకటేష్ యాదవ్, శ్రీనివాస్, ఉమేష్ సింగ్, బాబు, సత్యనారాయణ, గుండా నిరంజన్, సత్యమూర్తి, బ్రహ్మయ్య, రాము, రామకృష్ణ, అరుణ్, సయ్యద్ మబ్బు, యాదగిరి, బాల్ రాజ్ యాదవ్, సహీం బాయ్, వినోద్ యాదవ్, వైనాల ప్రవీణ్, పరమేష్, తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరిట

పేదలను దోచుకున్న బిఆర్ఎస్ ప్రభుత్వం

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్ : పేదలకు ఆరేళ్లకు పైగా డబుల్ బెడ్ ఇండ్ల ఆశలు చూపి గత బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి ఒక్కరి వద్ద అక్రమ వసూళ్లు చేసి పేదలను దోచుకుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. రెండు ఎన్నికల్లో ఇవే ఇండ్లను చూపిస్తూ ఎవరికీ ఇవ్వలేదని, మూడోసారి కూడా మోసం చేయడానికి గత ప్రభుత్వం ప్రయత్నిస్తే ప్రజలు తగు రీతిలో బుద్ది చెప్పారని ఆయన అన్నారు. వరంగల్ జిల్లా హనుమకొండ బాల సముద్రం ప్రాంతంలో శుక్రవారం 592 మంది లబ్దిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అందజేసి మంత్రి పొంగులేటి దగ్గరుండి మరీ గృహప్రవేశాలు చేయించారు. ఎమ్మెల్యేలు నాయిని రాజేంద్రర్ రెడ్డి, నాగారాజు, మేయర్ గుండు సుధారాణి సమక్షంలో అత్యంత ఆనందోత్సాహాల నడుమ జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా మంత్రి మాట్లాడారు. పార్టీలకు అతీతంగా ఎంతో పారదర్శకంగా లబ్దిదారుల ఎంపిక జరిగిందని తెలిపారు. గత ప్రభుత్వంలో కేవలం ఆ పార్టీ కార్యకర్తలకు, కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే ఇండ్లు మంజూరయ్యాయని ఆరోపించారు. గతంలో కట్టిన ఈ ఇండ్లను ఎందరో పేదలకు చూపించి అడ్డగోలుగా బిఆర్ఎస్ నేతలు వసూళ్లు చేసి ఎవరికీ ఒక్క ఇంటిని ఇవ్వలేదని ఆరోపిం చారు. అంతేగాక ఈ ఇండ్ల ఆశను చూపి ప్రతిసారి ఎన్నికల్లో లబ్దిపొందారని అయితే మూడో సారి వారి మోసాన్ని గమనించి పేదలు తగు బుద్ది చెప్పారని అన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకే గాక పట్టణ పేదలకు గృహ వసతి కల్పించేందుకు ఇందిరమ్మ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ శ్రావణ మాస శుక్రవారం 592 మంది గృహ ప్రవేశాలు చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ ఇండ్లు మహిళల పేరిటే మంజూరు చేశామన్నారు. ఆరు లక్షలకు పైగా రేషన్ కార్డులు మంజూరు చేయడం, ఇప్పటికే దశల వారీగా ఆరు హామీలను అమలు చేస్తున్న విషయం గమనించాలని కోరారు.

కమిషన్ల కోసం కాళేశ్వరం ప్రాజెక్ట్...

తెలంగాణ ప్రజలకు వెన్నుపోటు పొడిచేలా కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో బి ఆర్ ఎస్ ప్రభుత్వం కమీషన్ల కక్కుర్తికి పాల్పడిందని మంత్రి పొంగులేటి ఆరోపించారు. వారి అవినీతి వల్లే కాళేశ్వరం కూలిందన్నారు. దోచుకున్నది దాచుకోవడానికే బి ఆర్ ఎస్ నాయకులు తిరిగి అధికార ప్రభుత్వంపై దాడికి దిగుతున్నారని విమర్శించారు. కాగా దేశంలో బీసీ కులగణన చేసిన తొలి రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని, 42 శాతం బీసీ కోటా అమలు చేస్తామని తెలిపారు.

పిహెచ్‌సిని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టరు

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : శుక్రవారం కాప్రా మండలం లోని జవహర్ నగర్ పిహెచ్‌సి సెంటర్‌ను జిల్లా కలెక్టరు మను చౌదరి ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ఎఎన్‌సి ఎన్ని కేసులు మిస్ అవుతున్నాయని, పరీక్షలకు రానివారిని ఏవిధంగా గుర్తిస్తున్నారని గైనకాలజిస్టు డాక్టరును అడిగి తెలుసుకున్నారు. ఎఎన్‌సి పరీక్షలకు రాని వారిని గుర్తించి ఆశావర్కర్లు, ఎఎంసిల ద్వారా వారికి కౌన్సిలింగ్ ఇప్పించాలని కలెక్టరు తెలిపారు. సి సెక్షన్ వరకు వెళ్లకుండా ముందు జాగ్రత్తలు తీసుకునేలా పేషంట్లకు జాగ్రత్తలు, సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు ల్యాబరేటరీని పరిశీలించి రోజుకు ఎన్ని పరీక్షలు చేస్తున్నారని, ఇక్కడ ఎన్ని పరీక్షలు అందుబాటులో ఉన్నాయని, ఇక్కడ లేని పరీక్షలు ఎక్కడ చేయిస్తున్నారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఓపి పేషంట్ల నమోదు రిజిస్ట్రేషన్ హిస్టరీ అప్ డేట్ అవుతుందా అని కలెక్టర్ ఆరా తీసారు. కలెక్టర్ ఆసుపత్రి మొత్తం కలియ తిరిగి పరిశీలించి, అవసరమైన మరమ్మత్తులకు ఎస్టిమేషన్స్ వేసి తనకు పంపాలని కలెక్టర్ మెడికల్ ఆఫీసర్‌కు సూచించారు. రోగులకు అందిస్తున్న సేవలు, సిబ్బంది హాజరు పట్టిక ఓపి రిజిస్టర్, డెలివరీ రిజిస్టర్, పరిశీలించి వైద్య సిబ్బందికి తగు సూచనలు చేశారు. పేద ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం వైద్య శాఖను బలోపేతం చేస్తూ పటిష్ట కార్యచరణ ద్వారా ముందుకు పోతుందని దానికి అనుగుణంగా వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. సీజనల్ వ్యాధులను దృష్టిలో పెట్టుకొని వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తంగా ఉందని, జిల్లాలోని ఆరోగ్య కేంద్రాలను పటిష్టంగా పర్యవేక్షిస్తున్నామన్నారు. వైద్య సిబ్బంది సమయపాలన, మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఆదర్శంగా నిలుస్తారన్నారు. డిఎంహెచ్ఓ ఉమా గౌరీ, మెడికల్ ఆఫీసర్ సుష్మ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమిద్దాం

విశాలాంధ్ర - హైదరాబాద్ : కేంద్రంలో ఉన్నటువంటి నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వం దేశంలో ఉన్న పబ్లిక్ సెక్టార్ కంపెనీలను మరియు ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ నాలుగు లేబర్ కోడ్లను తీసుకొచ్చి కార్మిక హక్కులను కాలరాస్తూ, రైతు వ్యతిరేక నల్ల చట్టాలను తెచ్చి రైతులకు ప్రజలకు ప్రజా పంపిణీ పథకాలను పాతరవేసే దిశలో అడుగులు వేస్తున్నందుకు నిరసనగా ఈనెల 13వ తేదీన దేశవ్యాప్త పిలుపులో భాగంగా రాష్ట్ర రాజధాని కేంద్రం హైదరాబాదులోని నారాయణగూడ ఫ్లైఓవర్ కింద కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దిష్టిబొమ్మలను దగ్ధం చేయాలని తెలంగాణ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశపద్మ, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ బాలరాజు పిలుపునిచ్చారు. శుక్రవారం హిమాయత్ నగర్ లోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో కేంద్ర కార్మిక రైతు సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజలను దోచి పెట్టుబడిదారులకు లాభాలు చేకూర్చేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసినందువలన కేంద్ర ప్రభుత్వం దిగివచ్చే వరకు పోరాటాలు నిర్వహించనున్నట్లు వారు తెలియజేశారు. 13న రాష్ట్ర రాజధానితో పాటు అన్ని జిల్లా కేంద్రాలలో నరేంద్ర మోడీ దిష్టిబొమ్మలను దగ్ధం చేసి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వారు. సెప్టెంబర్ 22వ తేదీన నల్ల బ్యాడ్జీలు ధరించి ప్రజాప్రతినిధులకు కార్మికులు రైతుల సమస్యల పైన వినతి పత్రాలు అందజేయాలని నవంబర్ 26వ తేదీన మరొక మారు సార్వత్రిక సమ్మెను సైతం నిర్వహించి కేంద్ర ప్రభుత్వానికి కలిగించాలని వారు పిలుపునిచ్చారు. ఢిల్లీ కేంద్రంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించేందుకు కార్మిక వర్గం రైతులు వ్యవసాయ కార్మికులు సన్నద్ధం కావాలని వారు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం నరసింహ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మారగొని ప్రవీణ్ కుమార్, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్వీ రమ, వంగూరు రాములు, టి యు సి ఐ నాయకులు వి ప్రవీణ్ కేఎస్ ప్రదీప్, ఐ ఎఫ్ టి యు నాయకులు జి అనురాధ అరుణ, హెచ్ఎంఎస్ నాయకులు ఎండి అంజాద్, ఏఐకేఎంఎస్ నాయకులు ఎం వెంకన్న, తెలంగాణ రైతాంగ సమితి నాయకులు జక్కుల వెంకటయ్య, ఏఐఏడబ్ల్యూయు నాయకులు ఆర్వి రాములు ప్రసంగించారు.

గ్రేటర్‌లో ముమ్మరంగా రోడ్ సేఫ్టీ స్పెషల్ డ్రైవ్ : కమిషనర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నగరంలో ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించే రోడ్డుపై ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా సాఫీగా ప్రయాణం చేసుకునే విధంగా రోడ్డుపై ఏర్పడిన గుంతలు (పాట్ హోల్స్), క్యాచ్ పిట్స్ మరమ్మత్తులు, సెంట్రల్ మీడియన్ చిన్న పనులపై జీహెచ్‌ఎంసీ ప్రత్యేక డ్రైవ్ చేపట్టింది. ఇప్పటి వరకు గురించిన 11,642కు గాను, 8583 మరమ్మత్తులు పూర్తి చేసారు. నేపథ్యంలో శుక్రవారం 423 క్యాచ్ పిట్స్ మరమ్మతులు చేయగా క్యాచ్ పిట్స్ కవర్ రీప్లేస్మెంట్ 225 చేశారు. 3 లోకేషలలో సెంట్రల్ మీడియంను మరమ్మతులు చేసినట్లు సిఈ సహదేవ్ రత్నాకర్ తెలిపారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా ప్రజల ప్రయాణానికి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వి.కర్ణన్ తెలిపారు. రోడ్లను సురక్షితంగా మార్చడమే లక్ష్యంగా రోడ్డు సేఫ్టీ ఈ చర్యలు కొనసాగుతాయని పేర్కొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చూడాలి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - షాద్ నగర్, రూరల్: రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలో ప్రత్యేక ప్రణాళికతో పట్టణ వాసులకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కోరారు. శుక్రవారం కమ్మదానం గ్రామ శివారులో ఉన్న వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ వద్ద మిషన్ భగీరథ ఇంట్రా, గ్రిడ్, మున్సిపాలిటీ సిబ్బందితో మండలాలు, మున్సిపాలిటీల వారీగా తాగునీటి సరఫరాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ మున్సిపల్ పరిదిలో నీటి సరఫరాను మెరుగుపరిచేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎక్కడైన నీటి కొరత ఏర్పడినట్లయితే తక్షణమే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి నిరంతరం నీరు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. తాగునీటి సరఫరా సమతుల్యం ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. షాద్‌నగర్ పట్టణంలో కేబుల్ లైన్ కోసం తవ్వే పైప్ లైన్ అనుమతులను ఇచ్చే క్రమంలో సంబంధిత శాఖ అధికారులు జాగ్రతలు వహించాలని కోరారు. పైప్ లైన్ లీకేజీలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి నీటి వృధాను నివారించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ గ్రిడ్ ఇఇ, డిఈ, ఎఇ, మిషన్ భగీరథ ఇంట్రా డిఈ, ఏఈ, ఎలెక్ట్రిసిటీ డిఈ, మార్కెట్ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, కృష్ణా రెడ్డి, జంగా నర్సింహులు, హరినాథ్ రెడ్డి, సుదర్శన్ గౌడ్, రఘు నాయక్, బాల్‌రాజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ తల్లి దేవాలయ పునఃప్రతిష్టా మహోత్సవాలు

విశాలాంధ్ర - మేడిపల్లి: పీర్జాదిగూడ నగర పాలక సంస్థ పరిధిలోని పర్వతాపూర్ ప్రాంతంలో వెలసిన శ్రీశ్రీశ్రీ పోచమ్మ తల్లి దేవాలయ పునఃప్రతిష్టా మహోత్సవాలు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తున్న ఈ పునఃప్రతిష్టా మహోత్సవాలు, ప్రముఖ వేదపండితులు నరేష్ శర్మ నేతృత్వంలోని వేదపండితుల బృందం ఆధ్వర్యంలో వేదమంత్రాల ఘోష మధ్య, శాస్త్రోక్తంగా కొనసాగుతున్నాయి. మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జీ తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ మేయర్ అమర్ సింగ్, బి బ్లాక్ అధ్యక్షులు వేముల మహేష్ గౌడ్, మాజీ గ్రంధాలయ చైర్మన్ దర్గా దయాకర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ యూత్ నాయకులు, మేడిపల్లి శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీ వాసులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

మహిళలందరికీ రాఖీ పండుగ శుభాకాంక్షలు : సీఎం రేవంత్ రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని మహిళలందరికీ రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక అయిన రాఖీ పండుగను అందరూ ఆనందంగా జరుపుకోవాలని అన్నారు. మహిళల సాధికారతతో పాటు మహిళలను కోటీశ్వరులను చేసే సంకల్పంతో ప్రజా ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలు, పథకాలు అమలు చేస్తోందని అన్నారు. గృహజ్యోతి, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరా క్యాంటీన్లు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరులోనూ మహిళలకే పెద్దపీట వేయడం జరిగిందన్నారు. రాష్ట్రాభివృద్ధిలో మహిళలందరూ భాగస్వాములయ్యే వరకు ప్రజా ప్రభుత్వం వారికి అండగా ఉంటుందన్నారు. మహిళల రక్షణ, భద్రత విషయంలో ప్రభుత్వం తగిన చర్యలు చేపడుతుందని, ఎక్కడ మహిళల అభివృద్ధి, సంక్షేమం విషయంలో ఎక్కడా రాజీ పడేది లేదని అన్నారు. అక్కా చెల్లెళ్లందరికీ తమ ప్రభుత్వం ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని, అందరి దీవెనలతో విజయవంతంగా ప్రజాపాలన సాగిస్తుందని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు.

లోతట్టు ప్రాంతాల్లో నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలి : కలెక్టర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : వర్షాలు అధికంగా కురుస్తున్న నేపథ్యంలో హైదరాబాద్ మూసి పరివాహక ప్రాంత ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం చాదర్ ఘాట్ ప్రాంతంలోని మూసీ నదిని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో వర్షాలు అధికంగా కురుస్తున్న నేపథ్యంలో హైదరాబాద్ మూసి పరివాహక ప్రాంత ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి అధికారులను ఆదేశించారు. ఎగువన కూడా అధిక వర్షాలు కురుస్తున్నందున హిమాయత్ సాగర్ రిజర్వాయర్ నందు ఇన్ఫ్లో 1300 క్యూసెక్కుల వర్షపు నీరు చేరడంతో 1391 క్యూసెక్కుల నీటిని మూసి నది ద్వారా దిగువకు వదలడం వలన మూసీ పరివాహక ప్రాంతాన్ని పరిశీలించడం జరిగిందని అన్నారు. ఇప్పటికే మూసి లోతట్టు ప్రాంత ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ అన్ని బృందాలు కూడా నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నాయని అన్నారు. మూసీ నదీ పరివాహక ప్రాంత ప్రజలు అలాగే నగరంలో లోతట్టు ప్రాంత ప్రజలు వర్షపు నీరు నిలిచే ప్రాంతాలు, విద్యుత్ సమస్యలు, డ్రైనేజ్ సమస్యలు అలాగే ట్రాఫిక్ అంతరాయం ఏమైనా ఉంటే వెంటనే హెల్ప్ లైన్ నెం.040 23202813, 7416687878 కాల్ చేయాలని తెలుపుతూ అధికారులు సత్వరమే సహాయక చర్యలు అందించటం జరుగుతుందని అన్నారు. అలాగే రెవిన్యూ, జిహెచ్ఎంసి, పోలీస్, హైడ్రా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రామకృష్ణ, తాసిల్దార్లు సంధ్యారాణి, అన్వర్ హుస్సేన్, నయీముద్దీన్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

మున్నూరు కాపు సంఘం రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా కొట్ల శంకర్



విశాలాంధ్ర - మేడిపల్లి : తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు సంఘం వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా పీర్జాదిగూడకు చెందిన కోట్ల శంకర్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర అధ్యక్షుడు పుట్టం పురుషోత్తరావు ప్రకటించారు. ఈ సందర్భంగా కొట్ల శంకర్ మాట్లాడుతూ మున్నూరు కాపు సంఘం, కులస్తులకు గత మూడు దశాబ్దాల కాలంగా తన వంతు బాధ్యతగా సేవలందిస్తునని వెల్లడించారు. పీర్జాదిగూడ మున్నూరు కాపు సంఘం గౌరవ అధ్యక్షుడిగా, యాదగిరి గుట్ట లక్ష్మీ నర్సింహ స్వామి మున్నూరు కాపు సంఘం సత్రం ట్రస్టు బోర్డు శాశ్వత సభ్యుడుగా పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. తనపై నమ్మకంతో రాష్ట్ర కమిటీలో వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించి అధ్యక్షుడు పుట్టం పురుషోత్తం రావు, రాజ్యసభ సభ్యుడు వృద్దిరాజు రవిచంద్రలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మున్నూరు కాపుల వాణిజ్య, వర్తకం, వ్యాపార అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని కోట్ల శంకర్ స్పష్టం చేశారు.

IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AND CJM AT RAMANAGARA

EX NO, 83 of 2024

DECREE HOLDER; LAGADAPATI MALAYADRI S/o Sri. Narasaiah, Aged about 48 years, R/at No. 4, Indira Street, Subbayanapalya, Bengaluru North, (A.DL) Bengaluru-560033. -V/s-

JUDGMENT DEBTORS :1.M/s DREAMLAND VENTURES (P) LTD, Office at #4, New ew No. No. 100, Plot No. 48, 2nd Floor, K.H. Road, Sudhama Nagara, Bengaluru-560 027. Represented by its Authorized Signatory. SRI.G. DHARMAPRAKASH S/o H.Govindappa.

2. M/s AGRI GOLD PROJECTS LTD. (Real Estate Division), Having Registered Office at No. 6-3-680/A/B, Thakur Mansion Lane, Near Somajuguda Circle, Panjagutta, Hyderabad-500 082.

NOTICE

Whereas, the above named decree holder filedthis execution petition before this Hon'ble court based on the judgment and decree passed in the original suit, for obtaining the deed in respect of the execution petition schedule property.

The Notice sent through court as well as RLAD. But you have been deliberately evaded the same. Hence, you are hereby informed through this notice to take notice and to appear before this Hon'ble Court **30/08/25 at about 11.00 A.M.,** either personally or through counsel and to file objection if any. If you fail to appear, on that day, the above execution petition will be heard and determined in your absence as exparte.

SCHEDULE

All that piece and parcel of the immovable vacant residential property bearing site No. 6. Katha No. 34 measuring East to West: 60 Feet. North to South: 40 Feet, in Total Measuring 2400 sq Feet, carved out of Sy. No.14, of situated at Lakshmisagara Village, Bidadi Hobli, Ramanagara Taluk: and District, duly converted from agricultural to non-agricultural residential by the order of the Deputy Commissioner, Rananagara District, vide Official Memorandum bearing No ALN (R) CR-50/2008-2009 dated 12-02-2009, in the lay-out known as FORTUNE GARDEN CITY, approved by the Bengaluru Mysuru Infrastructure Corridor Area Planning Authority (BMICAPA) Vide approval No. BMICAPA/09/052/2011-2012 DATED 30-09-2011 bounded on: **East by :** Road, **West by :** Plot No. 51, **North by :** Plot No. 5 and, **South by :** Plot No. 7,

Given as per the orders and seal of this Hon'ble court, on this 5th day of August 2025 at Ramanagara

By Order of The Court
Sd/-Sheristedar
Civil Judge (Sr.DVN) & CJM Court,
Ramanagara.

IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AND CJM AT RAMANAGARA

EX NO, 84 of 2024

DECREE HOLDER ; V. PURUSHOTHAM S/o Late Varadaraju. Aged about 45 years, R/at No. No.85. Y.V. Annaiah Road, Kanakapura Road, J.P. Nagar, Anekal, Bengaluru-560 078 -V/s-

JUDGMENT DEBTORS : 1. M/s DREAMLAND VENTURES (P) LTD, Office at # 4, New No. 100, Plot No. 48, 2nd Floor, K.H. Road, Sudhama Nagara, Bengaluru-560 027. Represented by its Authorized Signatory. SRI.G. DHARMA PRAKASH S/o H.Govindappa.

2. M/s AGRI GOLD PROJECTS LTD. (Real Estate Division), Having Registered Office at No. 6-3-680/A/B, Thakur Mansion Lane, Near Somajuguda Circle, Panjagutta, Hyderabad-500 082.

NOTICE

Whereas, the above named decree holder filed this execution petition before this Hon'ble court based on the judgment and decree passed in the original suit, for obtaining the deed in respect of the execution petition schedule property.

The Notice sent through court as well as RLAD. But you have been deliberately evaded the same. Hence, you are hereby informed through this notice to take notice and to appear before this Hon'ble Court **30/08/25 at about 11.00 A.M.,** either personally or through counsel and to file objection if any. If you fail to appear, on that day, the above execution petition will be heard and determined in your absence as exparte.

SCHEDULE

All that piece and parcel of the immovable vacant residential property bearing site No. 24. Katha No. 34 totally measuring 3096.64 sq. Ft. carved out of Sy. No. 36/1 of situated at Billakempanahalli Village, Bidadi Hobli, Ramanagara Taluk: and District, duly converted from agricultural to non-agricultural residential by the order of the Deputy Commissioner, Ramanagara District, vide Official Memorandum bearing No. ALN (R) CR-49/2008-2009 dated 12-02-2009, in the lay-out known as FORTUNE GARDEN CITY, approved by the Bengaluru Mysuru Infrastructure Corridor Area Planning Authority (BMICAPA) Vide approval No. BMICAPA/09/052/2011-2012 DATED 30-09-2011 bounded on:

East by : Road, **West by :** Plot No. 33, **North by :** Plot No. 23 and, **South by :** Plot No. 25,

Given as per the orders and seal of this Hon'ble court, on this 5th day of August 2025 at Ramanagara

By Order of the Court
Sd/- Sheristedar
Civil Judge (Sr.DVN) & CJM Court,
Ramanagara.

IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AND CJM AT RAMANAGARA

EX NO, 86 of 2024

DECREE HOLDER; C. RAJESHWARI W/o Ravindra N Aged about 49 years, R/at No, No.70, Near Vidhatha School, Subash Nagara Anekal, Bengaluru-562106 -V/s-

JUDGMENT DEBTORS :1.M/s DREAMLAND VENTURES (P) LTD, Office at #4, New ew No. No. 100, Plot No. 48, 2nd Floor, K.H. Road, Sudhama Nagara, Bengaluru-560 027. Represented by its Authorized Signatory. SRI.G. DHARMAPRAKASH S/o H.Govindappa.

2. M/s AGRI GOLD PROJECTS LTD. (Real Estate Division), Having Registered Office at No. 6-3-680/A/B, Thakur Mansion Lane, Near Somajuguda Circle, Panjagutta, Hyderabad-500 082.

NOTICE

Whereas, the above named decree holder filedthis execution petition before this Hon'ble court based on the judgment and decree passed in the original suit, for obtaining the deed in respect of the execution petition schedule property.

The Notice sent through court as well as RLAD. But you have been deliberately evaded the same. Hence, you are hereby informed through this notice to take notice and to appear before this Hon'ble Court **30/08/25 at about 11.00 A.M.,** either personally or through counsel and to file objection if any. If you fail to appear, on that day, the above execution petition will be heard and determined in your absence as exparte.

SCHEDULE

All that piece and parcel of the immovable vacant residential property bearing site No. 26. Katha No. 34 totally measuring 7890 sq. Ft. carved out of Sy. No. 36/1; of situated at Billakempanahalli Village, Bidadi Hobli, Ramanagara Taluk: and District, duly converted from agricultural to non-agricultural residential by the order of the Deputy Commissioner, Ramanagara District, vide Official Memorandum bearing No. ALN (R) CR-49/2008-2009 dated 12-02-2009, in the lay-out known as FORTUNE GARDEN CITY, approved by the Bengaluru Mysuru Infrastructure Corridor Area Planning Authority (BMICAPA) Vide approval No. BMICAPA/09/052/2011-2012 DATED 30-09-2011 bounded on: **East by :** STP

West by : Plot No. 29, **North by :** Plot No. 26 A and, **South by :** Proposed 12 M Wide Road

Given as per the orders and seal of this Hon'ble court, on this 5th day of August 2025 at Ramanagara

By Order of The Court
Sd/-Sheristedar
Civil Judge (Sr.DVN) & CJM Court,
Ramanagara.

విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - షాద్ నగర్, రూరల్: రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ప్రణాళికతో వ్యవహరించాలని విద్యుత్‌శాఖ అధికారులకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విద్యుత్ అధికారులతో ఎమ్మెల్యే సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ షాద్‌నగర్ నియోజకవర్గంలో ట్రాన్స్‌ఫార్మర్ల, పోల్స్, వైర్స్ కోసం కొంత మంది రైతులు ఇబ్బంది పడుతున్నారని తన దృష్టికి వచ్చిందని, అందుకే ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను కలిసి పెద్ద ఎత్తున ట్రాన్స్ఫర్మర్లు, విద్యుత్ సామాగ్రిని మంజూరు చేయించానని తెలిపారు. ఇప్పుడు మంజూరు అయిన ట్రాన్స్ఫర్మర్, విద్యుత్ సామాగ్రితో వెంటనే సమస్యలు పరిషారమయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎక్కడైనా ట్రాన్స్‌ఫార్మర్ రిపేర్ అయితే రిపేర్ అయిన ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో బిగించడానికి ప్రత్యామ్నాయంగా కొన్ని ట్రాన్స్‌ఫార్మర్‌లను అందుబాటులో ఉంచుకోవాలి తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, విద్యుత్ డీఈ, ఏడిఈ, ఏఈలు పాల్గొన్నారు.

ఘనంగా పండుగ సాయన్న జయంతి

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : తెలంగాణ సుపుత్రుడు, నిరంకుశ పాలనను ఎదిరించిన బహుజన యోధుడు పండుగ సాయన్న ముదిరాజ్ జయంతిని శుక్రవారం రాయదుర్గంలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో నిర్వహించారు. ఈ వేడుకలను గ్రేటర్ హైదరాబాద్ బీసీ యువగళం అధ్యక్షుడు నీరుడి కిరణ్ ముదిరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సాయన్న చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కిరణ్ మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుల చరిత్రలో పండుగ సాయన్నకు ప్రత్యేక స్థానం ఉంది. తనదైన శైలిలో స్వయం పాలనను ఏర్పాటు చేసి, బహుజన రాజ్యాన్ని స్వప్నంగా మలిచిన సాయన్న మార్గం యువతకు ఆదర్శంగా నిలవాలి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘానికి చెందిన నేతలు సదల నరేందర్, నీలం నరేందర్, నీలం సురేందర్, నరిగెల ప్రభాకర్, గనుగు దయాకర్, నిరుడు దేవేందర్, నిరుడు సురేష్, నీరుడి శంకర్, గోరెంక శ్రీశైలం, పెండ్యాల నర్సింగ్ రావు, లింగంపల్లి మల్లేష్, ఇంద్ల జగదీశ్, నీరుడి నవీన్, ఇంద్ల నవీన్, లింగంపల్లి కాశీవిశ్వనాథ్, మేకల వెంకటేష్, మేకల నర్సింగ్, మహేష్ ముదిరాజ్ పాల్గొన్నారు.

కీర్తిలాల్స్‌కి రిటైల్ జ్యువెలర్ ఇండియా ప్రత్యేక అవార్డ్

విశాలాంధ్ర - హైదరాబాద్: ప్రముఖ వజ్రాభరణాల సంస్థ కీర్తిలాల్స్‌కి రిటైల్ జ్యువెలర్ ఇండియా అవార్డ్స్ 2025లో ప్రత్యేక అవార్డ్ లభించింది. ఈ మేరకు జరిగిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో సంవత్సరపు సహజ వజ్ర చెవిపోగులు (నేచురల్ డైమండ్ ఇయర్ రింగ్స్ ఆఫ్ ది ఇయర్) అవార్డును అతిథులైన ప్రమోద్ మెహతా, పులికిట్ మెహతా చేతుల మీదుగా కీర్తిలాల్స్ బిజినెస్ స్ట్రాటజీ డైరెక్టర్ సూరజ్ శాంతకుమార్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్యువలరీ రంగంలో ప్రతిష్ఠాత్మకంగా పేరుగాంచిన రిటైల్ జ్యువెలర్ ఇండియా అవార్డులలో 2025 లో సహజ డైమండ్ చెవిరింగుల విభాగంలో అవార్డు లభించడం ప్రత్యేక గుర్తింపుగా చెప్పారు. భారతదేశం ప్రధాన ఆభరణాల బ్రాండ్స్‌గా కీర్తిలాల్స్‌కి జరిగిన సత్కారం అన్నారు. ఈ గుర్తింపు ఆభరణాల హస్తకళ, ఆవిష్కరణలలో రాణించడానికి బ్రాండ్ నిబద్ధతను హైలైట్ చేస్తుందన్నారు. కీర్తిలాల్స్ అభిరుచి, హస్తకళకు గుర్తింపు పొందడం ఈ అవార్డుతో తమ బృందం కృషి దూర దృష్టికి నిదర్శనం అని, తమ కస్టమర్లు ఇష్టపడే, విశ్వసించే సున్నితమైన ఆభరణాలను సృష్టించడం కొనసాగించడానికి తాము పునరంకితమవుతామని చెప్పారు. ఈ రిటైల్ జ్యువెలర్ ఇండియా అవార్డుల కార్యక్రమంలో దేశంలోని పలు ప్రాంతాలకు చెందిన ఆభరణాల పరిశ్రమ నాయకులు, డిజైనర్లు చేతివృత్తుల వారు పాల్గొన్నారు.

అజియో లక్సే ప్రివి క్యూరేటెడ్ కలెక్షన్ ప్రారంభం

విశాలాంధ్ర - హైదరాబాద్: డిఎస్ఆర్ గ్రూప్ మద్దతుగల లగ్జరీ రియల్ ఎస్టేట్ గమ్యం జూబ్లీ హిల్స్‌లోని ద వరల్డ్ ఎక్స్పీరియన్స్ కేంద్రంలో గురువారం అజియో లక్సే ప్రివి క్యూరేటెడ్ కలెక్షన్ అందుబాటులోకి తీసుకువచ్చారు. ఫ్యాషన్ అభిమానుల కోసం ఇక్కడ సంస్కృతి, వాణిజ్యం క్యూరేటెడ్ జీవనశైలిను ప్రతిబింబించేలా ప్రత్యేకమైన అజియో లక్సే ప్రివి షోకేస్‌ను ఉదయం 10 నుండి 8 గంటల వరకు నిర్వహించింది. వీటిలో బొట్టెగా వెనెటా, వెర్సాస్, బ్యూటీ స్టూడియోలు, సెల్ఫ్ పోర్ట్రెయిట్, జిమ్మీ చూ, డిస్క్వారెడ్ 2, బెనెడెట్టా బ్రజ్జిచెస్, కల్ట్ గియా పామ్ ఏంజెల్స్ ఒకే రూఫ్ కింద ఇక్కడ ఏర్పాటు చేశారు. జూబ్లీహిల్స్ నడిబొడ్డున ఉన్న ద వరల్డ్‌లో ఇది అర్థవంతమైన సహకారాలు, ఒక రకమైన అనుభవాల ద్వారా పట్టణ లగ్జరీని పునర్నిర్వచించటానికి ప్రసిద్ధి చెందింది. 14 ఎకరాలలో, 13,000 చదరపు అడుగుల ఉబెర్ లగ్జరీ హెూమ్స్, తొమ్మిది స్వయం నిరంతర టవర్లు, 500,000 చదరపు అడుగులకు పైగా క్యూరేటెడ్ జీవనశైలి సౌకర్యాలు ఉన్నాయి. ఐకానిక్ ఆర్కిటెక్చర్, ఒక శక్తివంత మైన సెంట్రల్ ప్లాజా కళ, ఫ్యాషన్, ఆహారం, రూపకల్పన కోసం అంకితమైన మండలాలతో, ఈ స్థలం హస్తకళ, ఆవిష్కరణ, సంస్కృతిని జరుపుకునే డైనమిక్ కాన్వాస్‌గా పనిచేస్తుంది. అనుభవజ్ఞులైన ఫ్యాషన్-క్యూరీ దుకాణదారుల కోసం, ఈ ఒక్క రోజు ఈవెంట్ గ్లోబల్ స్టైల్‌లో అత్యుత్తమమైన కార్యక్రమంగా దీన్ని తీర్చిదిద్దారు.

విశాఖలో పెట్టుబడులపై అవగాహన సెమినార్

విశాలాంధ్ర - హైదరాబాద్: సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) మార్కెట్ మౌలిక సదుపాయాల సంస్థల సహకారంతో కలిసి, టైర్-2, టైర్-3 నగరాల్లో పెట్టుబడిదారుల విద్య, అవగాహనను విస్తరించేందుకు 'మెగా ప్రాంతీయ పెట్టుబడిదారుల సెమినార్ల'ను ఆవిష్కరించింది. ఈ సెమినార్లు, పెట్టుబడిదారులకు సురక్షితమైన, బాధ్యతాయుత పెట్టుబడుల పట్ల అవగాహన పెంపొందించడంతో పాటు, సెక్యూరిటీల మార్కెట్లో కొత్తగా ప్రవేశించే వారికి సరికొత్త దిశను చూపిస్తాయి. ఇప్పటికే మార్కెట్లో ఉన్న పెట్టుబడిదారులకూ సమగ్ర సమాచారాన్ని అందించి, అవగాహనతో కూడిన పెట్టుబడుల వైపు ప్రోత్సహించడమే ఈ ప్రయత్నం ముఖ్య ఉద్దేశ్యం. సెబీ పెట్టుబడిదారుల ప్రయోజనాలను కాపాడడంలో భాగంగా అనేక అవగాహన కార్యక్రమాలను చేపట్టింది. వాటిలో 'మెగా ఆర్ ఐ ఎస్ ఏ' (ప్రాంతీయ పెట్టుబడిదారుల అవగాహన సెమినార్) కూడా ఒకటి. సెక్యూరిటీస్ మార్కెట్ ట్రైనర్-ఇన్వెస్టర్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్, చెక్, వ్యాలిడేటెడ్ యూ పీ ఐ హ్యాండిల్స్, 'సార్తి' మొబైల్ యాప్, సెంట్రలైజ్డ్ ఫీ కలెక్షన్ మెకానిజం, స్టాండర్డైజ్డ్ కాంట్రాక్ట్ నోట్స్, వినియోగదారుల గిరాకీ పరిష్కార మెకానిజమ్స్ నేషనల్ ఫైనాన్షియల్ లిటరసీ క్విజ్ వంటి ప్రారంభాలన్నీ పెట్టుబడిదారుల హక్కులను బలపరిచే దిశగా రూపొందించబడ్డాయి.

అంగరంగ వైభవంగా వరలక్ష్మీ వ్రతం

విశాలాంధ్ర - అమనగల్లు : ఆమనగల్లు పట్టణంలోని శ్రీ సత్య సాయి సేవ సమితి ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు సత్యసాయి మందిరంలో మహిళలు ఘనంగా నిర్వహించారు. మహిళలు వరలక్ష్మి అమ్మవారిని సుందరంగా అలంకరించి చేసి వ్రతాలు నిర్వహించారు. సుమారుగా 50 మంది వ్రతాలు నిర్వహించారు. సత్యసాయి సేవ సమితి కన్వీనర్ దొంతు శ్రీను, దొంతుపుల్లయ్య, దొంతు విశ్వనాథం, సంజీవ్ కుమార్, నాగిల్ల లింగం (చంటి), కృష్ణారెడ్డి, రాము గోల్డ్, ఎన్ ఆర్ ప్రభాకర్, గుర్రం సురేష్, మూర్తి, అప్పం తిరుపతయ్య, బ్రహ్మం, పోలిశెట్టి శ్రీను, నాగిళ్ల శంకర్, పల్లె అల్లాజిగౌడ్, నారాయణ సాగర్ పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలలు పతకాలు సాధించే కర్మాగారాలుగా మారాలి

మంత్రి వాకిటి శ్రీహరి

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వ క్రీడా పాఠశాలలు, అకాడమీలు పతకాలు సాధించే కర్మగారాలుగా మారాలని రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఎల్బీ స్టేడియంలో చైర్మన్ శివసేనారెడ్డితో కలిసి ఆయన రాష్ట్రంలోని స్పోర్ట్స్ స్కూళ్లు, అకాడమీల పనితీరు, సవాళ్లు, భవిష్యత్ ప్రణాళికపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీహరి మాట్లాడుతూ 2025-26 విద్యా సంవత్సరానికి పారదర్శకంగా, ప్రతిభ ఆధారంగా విద్యార్థుల ఎంపిక జరగాలని హకీంపేట్ స్పోర్ట్స్ స్కూల్‌తో పాటు కరీంనగర్, ఆదిలాబాద్ స్కూళ్లలో ఆధునిక క్రీడా శిక్షణ, విద్యలో మెరుగుదల సాధించాలని అధికారులకు సూచించారు. హకీంపేట్‌లో తక్షణ మరమ్మతులు, అన్ని స్కూళ్లలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. స్పోర్ట్స్ అథారిటీ అకాడమీల పనితీరు మెరుగుపరిచి విద్యార్థి క్రీడాకారుల్లో స్ఫూర్తిని కలిగించే కార్యక్రమం నిర్వహించాలని కోరారు. స్పోర్ట్స్ స్కూల్లో అకాడమీలలో త్రైమాసికంగా బ్యాటరీ టెస్టులు నిర్వహించి, కంప్యూటరైజ్డ్ రిపోర్టులు తయారుచేసి విద్యార్థుల తల్లిదండ్రులకు పంపించే విధంగా ఏర్పాటు చేయాలని ఆయన అధికారులను కోరారు. ప్రతిభ ఆధారంగా విద్యార్థుల వర్గీకరణ చేసి క్రీడా ప్రతిభ లేని వారిని ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూళ్లకు బదిలీ చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. స్పోర్ట్స్ స్కూల్లో పనిచేసే అధికారులు సిబ్బంది కోర్సులు అందరూ విద్యార్థుల సంక్షేమం కోసం తమ పిల్లలుగా చూసుకోవాలని వారికి ఇబ్బందులు రాకుండా వారి యోగక్షేమాలు చూడాల్సిన బాధ్యత తీసుకోవాలని కోరారు. ప్రేరణాత్మక తరగతులు, వ్యక్తిత్వ వికాస అంశాల్లో శిక్షణ యోగ శిక్షణ తప్పనిసరి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. తెలంగాణ విద్యార్థిని విద్యార్థులు సాధించిన విజయాలను ప్రదర్శించేందుకు ప్రతి స్పోర్ట్స్ స్కూల్ అకాడమీల్లో విద్యార్థుల తల్లిదండ్రుల కొరకు విజిటర్స్ హాల్స్ ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు. ఎల్.బి. స్టేడియంలో వీడియో కాన్ఫరెన్స్ హాల్ నిర్మాణం చేసి అన్ని అకాడమీలను స్పోర్ట్స్ స్కూల్ లలో ఏర్పాటు చేసే సీసీ కెమెరాలను ఈ కాన్ఫరెన్స్ వాళ్లకు అనుసంధించాలని తెలిపారు. క్రమం తప్పకుండా క్రీడా శాఖలోని అన్ని విభాగాలపై నిరంతరం సమీక్షలు చేస్తామని తెలిపారు. స్పోర్ట్స్ స్కూల్లో అకాడమీల పనితీరు మెరుగుపరచడమే కాకుండా అన్ని అంశాలపై దృష్టి సారించి ఎప్పటికప్పుడు అందరి అభిప్రాయాలు తీసుకుంటూ సమగ్ర క్రీడాభివృద్ధి కోసం కృషి చేస్తామని ఆయన తెలిపారు. విధుల్లో అలసత్వం వహించే ఎవరిని కూడా ఉపేక్షించమని మంత్రి శ్రీహరి తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కె.శివసేనరెడ్డితో పాటు హకింపేట స్పోర్ట్స్ స్కూల్ ప్రత్యేక అధికారి టి. మమత, డిప్యూటీ డైరెక్టర్లు జి చంద్రరెడ్డి జి. రవీందర్, డా.రవిశంకర్ పల్లెల, ఎస్.ఎం. బాషా, జి. అశోక్ కుమార్, పి.సందీప్ కుమార్, సురేష్ కాలేరు తదితరులు ఈ సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు.

నగరంలో వర్షానంతర చర్యలు వేగవంతం చేయండి

విశాలాంధ్ర - హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో వర్షానంతర చర్యలు వేగవంతం చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వి కర్ణన్ క్షేత్ర అధికారులను ఆదేశించారు. శుక్ర వారం ఉదయ నగరంలో వర్ష ప్రభావిత ప్రాంతాలను జీహెచ్ఎంసి కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొయినుద్దీన్‌తో కలిసి పరిశీలించారు. టోలిచౌకీ ఎక్స్ రోడ్, హకీంపేట్ కేజిఎస్ నల్లా, మోతి దర్వాజా, అహ్మద్ కాలనీ, లంగర్‌హౌస్ హుడా చెరువు తదితర ప్రాంతాల్లో వర్షం ప్రభావాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అనంతరం ట్రాఫిక్ జాయింట్ సీపీ గజరావ్ భూపాల్‌తో కలిసి మల్కం చెరువును పరిశీలించి చెరువు నీటి మట్టాలు, ట్రాఫిక్ పరిస్థితులను సమీక్షించారు. జీహెచ్ఎంసీ క్షేత్ర అధికారులు, సిబ్బంది, నీటి పారుదల, ట్రాఫిక్ పోలీసు, హైడ్రా, జల మండలి, డీఆర్ఎఫ్ బృందాలతో సమన్వయంగా చేసుకుంటూ వర్షానంతర చర్యల్లో భాగంగా నీరు తొలగింపు, సిల్ట్, చెత్త తొలగింపు, రోడ్ల భద్రత పరమైన చర్యలను చేపట్టారు. నగర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. వర్షపు నీరు నిలిచిన ప్రాంతాల్లోకి వెళ్లకూడదని, ప్రత్యామ్నాయ మార్గాలు వినియోగించుకోవాలని ప్రజలకు కమిషనర్ సూచించారు. క్షేత్ర స్థాయిలో ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే జీహెచ్ఎంసి హెల్ప్‌లైన్ 040-21111111 కి తెలియజేయాలని ప్రజలను కోరారు. ఈఈ లాల్ సింగ్, డీసీ సైఫుల్లా, ఏఎంఒహెచ్ ఇర్షాద్ ఇక్బాల్ పాల్గొన్నారు.

జీహెచ్ఎంసి కంట్రోల్ రూమ్ ఆకస్మిక తనిఖీ...

జీహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలోని కంట్రోల్ రూమ్‌ను కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ శుక్రవారం సందర్శించారు. వర్షాల నేపథ్యంలో ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులపై ఓఎస్‌డీ అనురాధను ప్రశ్నించారు. వర్ష సంబంధిత ఫిర్యాదులను వెంటనే పరిష్కరించడంతో పాటు, ఫీల్డ్ టీంలకు త్వరగా తెలియజేయాలనీ కమిషనర్ ఆదేశించారు. రియల్-టైమ్ మానిటరింగ్ ద్వారా పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ ప్రజలకు ఇబ్బందులు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

బిపి మండల్ జయంతి ఉత్సవాల్లో జగదీశ్వర్‌గౌడ్

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : బీహార్ మాజీ ముఖ్యమంత్రి బిందేశ్వర్ ప్రసాద్ మండల్ జయంతిని పురస్కరించుకొని వారోత్సవాలు 7 ఆగస్టు నుండి 25 వరకు జరుపుటకు నిశ్చయం అయింది. విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ ప్రధానమంత్రిగా ఉన్న కాలంలో బిసి కమిషన్ బిపి మండల్ చైర్మన్ ఆధ్వర్యంలో భారతదేశ వ్యాప్తంగా తిరిగి బీసీలకున్న సమస్యలు, కష్టాలను పేదరికాన్ని దృష్టిలో ఉంచుకొని 42 సిఫార్సులను ప్రభుత్వానికి అందజేయడం జరిగింది. అందులో కేవలం కొన్ని సిఫార్సులను మాత్రమే అమలుచేయడం జరిగింది. మండల్ వారోత్సవాలలో భాగంగా శుక్రవారం శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ బీసీ ప్రముఖ నాయకుడు కార్పొరేటర్ జగదీశ్వర్ గౌడ్ ద్వారా బేరి రామచంద్ర యాదవ్ ఆధ్వర్యంలో బీపీ మండల్ చిత్రపటానికి పూలమాలతో సత్కరించి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. ముఖ్యంగా ఈ సందర్భంలో బేరీ రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ బీసీలకు రాజ్యాధికారమే ముఖ్యమని పేదరికం దూరమవ్వటానికి అధికారమే అవసరమని బీపీ మండల్ 42 సిఫార్సులను అమలు పరచాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు కోరడం జరిగింది. బీపీ మండల్ జయంతి వారోత్సవాలు పురస్కరించుకొని శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇంచార్జ్ కార్పొరేటర్ జగదీశ్వర్ గౌడ్ తన సందేశంలో నిన్ననే ఢిల్లీలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని పేదరిక నిర్మూలనలో భాగంగా బీసీలకు న్యాయం చేద్దామని జంతర్ మంతర్ వద్ద ధర్నా చేయడం జరిగింది. కాంగ్రెస్ ఇంచార్జ్ కార్పొరేటర్ జగదీశ్వర్ గౌడ్‌తో పాటు బీసీ ఐక్యవేదిక అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్ బీసీ ఫెడరేషన్ అధ్యక్షులు ఆర్కే సాయన్న ముదిరాజ్ శేరిలింగంపల్లి బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు అడ్వకేట్ రమేష్ యాదవ్ మియాపూర్ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు, బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులైన నర్సింగ్ ముదిరాజ్ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి బి కృష్ణ సెక్రెటరీ, సీనియర్ పాత్రికేయులు రామకృష్ణ గౌడ్, జర్నలిస్ట్ శ్రీనివాస్ గౌడ్, రామలింగ గౌడ్ గోపి నగర్ సైదులు, ఆర్టీసీ సురేష్ యాదవ్, పద్మశాలి సాగర్, మణికంఠ, శ్రీరాములు, లలితా రాణి పాల్గొన్నారు.

రెసోనెన్స్, టాగ్‌హైవ్ 'రెసో-స్మార్ట్' ప్రారంభం

విశాలాంధ్ర - హైదరాబాద్ : జేఈఈ, నీట్ కోచింగ్‌లో అగ్రగామి రెసోనెన్స్, శామ్‌సంగ్ మద్దతు ఉన్న ఎడ్‌టెక్ కంపెనీ టాగ్‌హైవ్‌తో కలిసి స్మార్టర్, ఫాస్టర్ లెర్నింగ్ కోసం 'రెసో - స్మార్ట్'ను ప్రారంభించింది. ఇది కృత్రిమ మేధ ఆధారిత లెర్నింగ్ ప్రోగ్రాం. ఈ మేరకు సోమాజీగూడలోని హెూటల్ మెర్క్యురీలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రెసోనెన్స్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ పూర్ణచంద్రరావు నర్రా మాట్లాడుతూ సాంకేతిక రంగంలో ఇది ఒక ముందడుగు అన్నారు. కృత్రిమ మేధ తరగతి గదుల్లో నేర్పే విధానంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లో ఇరవై వేల మందికి పైగా విద్యార్థులకు లబ్ది చేకూరనుందన్నారు. విద్యా రంగంలో సాంకేతిక విప్లవం అనవచ్చన్నారు. 'రెసో-స్మార్ట్' కేవలం సాంకేతికత మాత్రమే కాదని, ఇది విద్యార్థుల అధ్యయన విధానంలో ఒక సంపూర్ణ మార్పునకు నాంది అన్నారు. ప్రతి తరగతి గదిలో అడాప్టివ్ లెర్నింగ్‌ను తీసుకు రావడానికి రూపొందించామన్నారు. ఇది రెసోనెన్స్ విద్యా నైపుణ్యం, టాగ్‌హైవ్ కృత్రిమ మేధ సాంకేతికతతో విద్యార్థులకు అనుకూలంగా డేటా ఆధారిత విద్యా వాతావరణాన్ని అందిస్తుందని చెప్పారు. సమయాన్ని సమర్థవంతంగా వినియోగించేందుకు దోహదం చేస్తుందన్నారు. మొదటగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని మా క్యాంపస్‌ల అన్నింటిలో అమలు చేయనున్నామని చెప్పారు. జేఈఈ, నీట్ అభ్యర్థుల లక్ష్యంగా కార్యక్రమం ఉండనుందన్నారు. టాగ్‌హైవ్ కలిసి రెసో-స్మార్ట్‌ను అందుబాటులోకి తేవడం ద్వారా వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా, ప్రభావవంతమైన విద్యను అందించాలన్న మా లక్ష్యాన్ని మరింత ముందుకు తీసుకు వెళ్తుందన్నారు. ఈ సందర్భంగా టాగ్‌హైవ్ వ్యవస్థాపకులు, సీఈఓ పంకజ్ అగర్వాల్ మాట్లాడుతూ యువ విద్యార్థుల చేతుల్లో ఆధునిక కృత్రిమ మేధ సాధనాలు పెట్టేందుకు రెసోనెన్స్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్లతో చేతులు కలపడం గర్వంగా ఉందన్నారు. టాగ్‌హైవ్ రూపొందించిన కృత్రిమ మేధ పరిష్కారాలు విద్యను మరింత సమగ్రంగా, అనుకూలంగా, ఫలితాల దిశగా నడిపేలా ఉంటాయన్నారు.

రెసో-స్మార్ట్ ముఖ్య లక్షణాలు...

కృత్రిమ మేధ ఆధారిత కన్సాలిడేషన్: విద్యార్థులు సుదీర్ఘ కాలం గుర్తుంచుకునేలా అల్గోరిథంలతో రూపొందిన స్మార్ట్ టూల్స్, ఎఐ ఆధారిత ప్రశ్నాపత్రాలు, ప్రతి విద్యార్థి అభ్యాస స్థాయి, నేర్చుకునే వేగానికి అనుగుణంగా వ్యక్తిగత మూల్యాంకనాలు, రియల్-టైమ్ ప్రదర్శన విశ్లేషణ, ప్రతి విద్యార్థి బలాలు, బలహీనతలపై ఎప్పటికప్పుడు లోతైన విశ్లేషణ, లక్ష్య సాధన కోసం ప్రత్యేక దృష్టి, అడాప్టివ్ క్విజ్ సిస్టమ్, ప్రతి విద్యార్థి విద్యా ప్రయాణానికి అనుగుణంగా మూల్యాంకన విధానం, ఎవరూ వెనుక పడకుండా ఉండడమే లక్ష్యంగా రూపొందించారు. రెసో-స్మార్ట్ ఒక కొత్త టూల్ మాత్రమే కాదు. ఇది విద్యార్థి కేంద్రీత, తెలివైన క్లాస్‌రూమ్ విద్యకు కొత్త ఆరంభానికి సంకేతం. రెసోనెన్స్ తరగతులన్నిటిలో దశలవారీగా దీన్ని ప్రవేశపెట్టడం ద్వారా ఆధునిక కృత్రిమ మేధ శక్తిని వినియోగిస్తూ క్రిందిలక్ష్యాలను సాధించేందుకు దోహదపడుతుంది. మరింత సమాచారానికి 9959154371/ 99639 80259 నెంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

42 శాతం రిజర్వేషన్ పూర్తిగా బీసీలకే చెందాలి

విశాలాంధ్ర - మొయినాబాద్: 42 శాతం రిజర్వేషన్ పూర్తిగా బీసీలకే చెందాలని భాజపా ఓబీసీ చేవెళ్ల అసెంబ్లీ కన్వీనర్ ఎలిగని వెంకటేష్ గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం హిమాయత్ నగర్ లోని భాజపా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మతపరమైన 10 శాతం ముస్లింలకు కేటాయిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం వైఖరిని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామన్నారు. భారతీయ జనతా పార్టీ బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని సమాజానికి తెలిసేటట్లు ఉద్యమిస్తుందని తెలిపారు. 42 శాతం రిజర్వేషన్ ఏదైతే ఉందో దానికి పూర్తిగా బీసీలకు చెందేలా చేస్తే భాజపా సంపూర్ణ మద్దతు ఇస్తుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు చేస్తున్న అన్యాయాన్ని ప్రతి ఒక్క బీసీ బిడ్డ గమనిస్తున్నారని అన్నారు. బీసీలను మోసం చేసి దొంగ హామీలు ఇచ్చి పబ్బం గడుపుతున్నారని కాంగ్రెస్ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రుల హెూదాలో కొనసాగుతున్న వారిలో బీసీల మంత్రులు ఎంతమంది ఉన్నారు అని అందరూ గమనించాలన్నారు. మరోసారి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రశ్నించుకోవాలన్నారు. బీసీలను మోసం చేయాలనే ఆలోచనతో ముస్లింలకు మతపరమైన రిజర్వేషన్ 10 శాతం కల్పించడం ఏమిటని ప్రశ్నించారు. 42 శాతం బీసీలకు మద్దతు చెందేలా రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తే ఎప్పటికైనా భాజపా స్వాగతిస్తుందని వెల్లడించారు.

కేటీఆర్‌కు రాఖీ కట్టిన లగచర్ల ఆడబిడ్డ జ్యోతి

విశాలాంధ్ర - హైదరాబాద్ : భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు కొడంగల్ నుండి వచ్చిన గిరిజన సోదరీమణులు రాఖీ కట్టి తమ కృతజ్ఞతను చాటుకున్నారు. ప్రభుత్వం తమ జీవితాలను, జీవనాధారమైన వ్యవసాయ భూములను లాక్కున్నప్పుడు, తమకు ఒక అన్నలా అండగా నిలిచిన కేటీఆర్‌కు ఈ రాఖీ కట్టామని వారు తెలిపారు. కొడంగల్ మండలం, లగచర్ల గ్రామం, రోటిబండ తండాకు చెందిన జ్యోతి, మరికొంతమంది మహిళలు కేటీఆర్ నివాసానికి వెళ్లి రాఖీ కట్టారు. లగచర్ల భూ పోరాటం సమయంలో నిండు గర్భిణిగా ఉన్న జ్యోతిపై రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, పోలీసులు దౌర్జన్యం చేశారని, ఆమె భర్తను జైలుకు పంపిన, సమయంలో కేటీఆర్ ఢిల్లీ వెళ్లి పలు కమిషన్లకు ఫిర్యాదులు చేసి, జ్యోతితో పాటు లగచర్ల గిరిజనులకు, పేద రైతన్నలకు జరుగుతున్న అన్యాయాన్ని ఢిల్లీ వేదికగా ఎండగట్టారు. దీని ఫలితంగా, ప్రభుత్వం భూసేకరణను వెనక్కి తీసుకుందని వారు తెలిపారు. రాఖీ కట్టిన సందర్భంగా జ్యోతి తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. "ప్రభుత్వం మా భూములు లాక్కొని అన్ని వైపుల నుంచి దాడులు చేసి, మా కుటుంబ సభ్యులను జైల్లో పెడితే, నిండు గర్భిణిగా ఉన్న నాకు కేటీఆర్ అన్న అండగా నిలబడ్డారు. దగ్గరుండి నా బాగోగులు చూసుకున్నారు. నా ఆరోగ్యంతో పాటు నా ప్రసవం వరకు, నా బిడ్డ 'భూమి నాయక్' యోగక్షేమాల కోసం ఒక సొంత సోదరుడిలా అన్ని బాధ్యతలు తీసుకున్నారు" అని జ్యోతి కన్నీళ్లు పెట్టుకున్నారు.

ఆడబిడ్డలకు ఆర్థిక సాధికారతే అసలైన రక్షాబంధన్

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

విశాలాంధ్ర - హైదరాబాద్ : అక్కాతమ్ముళ్లు, అన్నాచెల్లెళ్ల ప్రేమ అనురాగం, అప్యాయతకు ప్రతీకగా జరుపుకునే పండుగ రాఖీ పౌర్ణమి. అలాంటి పర్వదినాన్ని తెలుగు రాష్ట్రాల్లోని సోదరసోదరీమణులు ఘనంగా జరుపుకోవాలని ఆశిస్తున్నాను. రాఖీ పౌర్ణమి సందర్భంగా సోదరసోదరీమణులకు నా ప్రత్యేక శుభాకాంక్షలు. తోడపుట్టిన సోదరికి కష్ట సుఖాల్లో ఆ జన్మాంతం తోడుంటానని సోదరుడు ఇచ్చే అభయమే రక్షాబంధన్. యుగాలు మారినా, తరాలు మారినా రాఖీ పౌర్ణమి ప్రత్యేకత అలాగే నిలిచిపోయింది. తెలుగురాష్ట్రాల్లోని ఆడపడుచులకు, అనునిత్యం ఆశీస్సులు కురిపించే అక్కాచెల్లెళ్లకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ.. ఇందిరమ్మ ప్రజాప్రభుత్వం మొదటినుంచి మహిళల పక్షపాతి అని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. తెలంగాణలోని కోటిమంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ఇందిరమ్మ ప్రజప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. ప్రభుత్వ పథకాల్లో ఆడబిడ్డలకు ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని చెప్పారు. మహిళా సాధికారత కోసం డ్వాక్రా ఆడబిడ్డలకు వడ్డీల్లేని రుణాలు ఇస్తున్నామని అన్నారు. ఆడబిడ్డల ఆత్మగౌరవం, భద్రత, అభివృద్ధికి ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది. మహిళలకు అన్నివేళలా, అన్నివిధాలా అండగా ఉంటానని రక్షాబంధన్ సందర్భంగా హామీ ఇస్తున్నానని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు.

సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : తెలంగాణ రాష్ట్ర నాలుగో మహాసభలు ఈనెల 19 నుండి 22 వరకు మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ గాజుల రామారంలో జరుగు మహాసభల వాల్ పోస్టర్‌ను శుక్రవారం శేర్లింగంపల్లి సిపిఐ పార్టీ కార్యాలయంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రామకృష్ణ విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతదేశా స్వాతంత్రం ఉద్యమంలో నేటి తెలంగాణ ఉద్యమంలో ఎంతోమంది కమ్యూనిస్టులు ప్రాణాలు పణంగా పెట్టి పోరాడారన్నారు. ప్రజా సమస్యలు ఉన్నంతవరకు కమ్యూనిస్టు పార్టీ ఉంటుందన్నారు. దేశంలోనే 100 సంవత్సరాల నిండిన పార్టీ ఏదైనా ఉంది అంటే, అది భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఒకటే అన్నారు. తెలంగాణలో నిజాం సర్కారుకు వ్యతిరేకంగా పోరాడిన పార్టీ సిపిఐ వందల ఎకరాలు భూములు పంచి తెలంగాణ ప్రాంతాన్ని భారతదేశంలో విలీనం చేయుట కొరకు కమ్యూనిస్టులు ఎంతో క్రియాశీలమైన పోరాటాలు నిర్వహించారు. దాని ఫలితమే ఈరోజు తెలంగాణ ప్రాంతం భారత దేశంలో విలీనమైందన్నారు. తెలంగాణ రాష్ట్ర నాలుగో మహాసభలు రాష్ట్ర భవిష్యత్తు నిర్ణయాలు చేయబోతోంది రాష్ట్ర ప్రజలకు కావలసిన హక్కుల కోసం వాటి పరిష్కార కోసం ఉద్యమ ప్రణాళిక చేయబోతుంది ఈ మహాసభలను విజయవంతం చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యులు కె చందు యాదవ్ శేరిలింగంపల్లి నియోజకవర్గం సహాయ కార్యదర్శి. కే సుధాకర్ మండల నాయకులు తుపాకుల రాములు ఎస్ నారాయణ సురేష్ ముదిరాజ్ రఘు, భాస్కర్, ఎం వెంకటేష్, కే కాసిం, సురేఖ ఏఐఎస్ఎఫ్ నాయకులు నితీష్ తేజ, దేవేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలతోనే ఆత్మ సంతృప్తి

విశాలాంధ్ర - బషీర్ బాగ్ : సేవా కార్యక్రమాలతో ఎంతో ఆత్మ సంతృప్తి కలుగుతుందని అగర్వాల్ సమాజ్ తెలంగాణ అధ్యక్షుడు అనిరుధ్ గుప్తా అన్నారు. డబ్బుకు ప్రాముఖ్యత లేదని, మనతో ఉండేవి మన సంకల్పం, సంస్కారాలు మాత్రమే అని అన్నారు. శుక్రవారం బషీర్‌బాగ్‌లో రాధే రాధే గ్రూప్ హైదరాబాద్ ప్రథమ వార్షికోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అనిరుధ్ గుప్తా మాట్లాడుతూ రాధే రాధే గ్రూప్ స్థాపించి ఒక సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొనే అవకాశం లభించిన నా అదృష్టాన్ని మాటల్లో వర్ణించలేనన్నారు. రాధే రాధే గ్రూప్‌కు చెందిన సతీష్ గుప్తా, జగత్‌నారాయణ్ అగర్వాల్, రామ్ ప్రకాష్ జీ అగర్వాల్, మహేష్ అగర్వాల్ ఈ కుటుంబంతో అనుబంధం ఏర్పరచుకునే ఈ గొప్ప అవకాశాన్ని తనకు కల్పించడం అదృష్టమన్నారు. ఒక రోజు అన్నదానం చేయడం సాధ్యమే కానీ రోజూ చేయడం దాదాపు అసాధ్యం అని, కానీ రాధే రాధే గ్రూప్ ఈ అపోహను తొలగించిందన్నారు. రాధే రాధే గ్రూప్‌ను ఎంత ప్రశంసించినా తక్కువే అని అనిరుధ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు సతీష్ గుప్తా, రామ్ ప్రకాష్ అగర్వాల్, సునీతా అగర్వాల్, జగత్ నారాయణ్ అగర్వాల్, రాజ్‌కుమారి అగర్వాల్, ఇ-జగన్ చంపాపేట్, శ్యామ్ సుందర్ అగర్వాల్, భగత్‌రామ్ గోయల్, నందకిషోర్ అగర్వాల్, రోహిత్ అగర్వాల్, సుమన్ అగర్వాల్, మాయారామ్‌జీ అగర్వాల్, మనీష్ చండాలియా, అశోక్ గుప్తా ఎస్.జె. గోపాల్ గోయల్, మహేష్ అగర్వాల్, కైలాష్ చంద్ కేడియా, నిర్మలా కేడియా, మనోజ్ శర్మ జీ సురేష్ సింఘల్, సోహన్‌లాల్ దహిమా, సంజయ్ గోయల్, కిరణ్ గోయల్, దీపక్ అగర్వాల్, ప్రీతికా అగర్వాల్, రాజేష్‌జీ యోగా సర్జీ, సురేష్ డాల్మియా పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

విశాలాంధ్ర- అమనగల్లు : పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత అని అమనగల్లు మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్ అన్నారు. శుక్రవారం పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని వందరోజుల ప్రణాళిక అమలులో భాగంగా పట్టణంలో వనమహెూత్సవ కార్యక్రమంలో మొక్కలను పంపిణీ చేసి అనంతరం శంకర్ నాయక్ మాట్లాడారు. నాటి భావితరాలకు స్వచ్ఛమైన గాలిని అందించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్, పట్టణంలోని పలు వార్డులలో పర్యటించి, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా, పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాలు వంటి అంశాలపై దృష్టి సారించారు. పర్యటనలో భాగంగా, కొన్ని వార్డులలో అభివృద్ధి పనులు జరుగుతున్న తీరును పరిశీలించారు. మరికొన్ని వార్డులలో గుర్తించిన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాలు కురుస్తున్నందున మురికి నీరు అధికంగా వచ్చి దోమలు విపరీతంగా పెరిగే అవకాశం ఉందన్నారు. నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ఆయన వెంట సిబ్బంది షర్ఫుద్దీన్ ఉన్నారు.

పోచమ్మ తల్లి విగ్రహ పునఃప్రతిష్ఠలో ఎమ్మెల్యే చామకూర

విశాలాంధ్ర - మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పర్వతాపూర్ నందు భక్తి శ్రద్ధల నడుమ శ్రీ శ్రీ శ్రీ పోచమ్మ తల్లి విగ్రహ పునః ప్రతిష్ఠ మహెూత్సవం శుక్రవారం ఉదయం వైభవంగా జరిగింది. ఈ పవిత్ర వేడుకలో మాజీ మంత్రి, మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి, మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు కొల్తూరి మహేష్, బోడిగే స్వాతి కృష్ణ గౌడ్, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏదవల్లి రఘువర్ధన్ రెడ్డి, బోడుప్పల్ బీఆర్ఎస్ అధ్యక్షులు మంద సంజీవరెడ్డి, సీనియర్ నాయకులు కొత్త రవి గౌడ్, జావేద్ ఖాన్, యూత్ అధ్యక్షులు ప్రభు, యాసారం శ్రీనివాస్, కిరణ్ గౌడ్, మీసాల కృష్ణ, శ్రీనివాస్, నరేందర్ రెడ్డి, కిరణ్ నాయక్, అమర్ పటేల్, అంజి తదితరులు పాల్గొన్నారు. పోచమ్మ దేవాలయ ప్రాంగణం భక్తుల హర్షధ్వనులతో మార్మోగింది. పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు భగవంతుని ఆశీస్సులు అందుకోవాలని కోరుకున్నారు.

ప్రజలే పట్టని పాలకులు

సుపరిపాలన అంటూ మోదీ, చంద్రబాబు దగా: ఈశ్వరయ్య

విశాలాంధ్ర-పాలకొండ: సుపరిపాలన అందిస్తామని గద్దెనెక్కి ప్రజలను ప్రధాని మోదీ, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు దగా చేస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య విమర్శించారు. ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేశారన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండలో సీపీఐ 2వ జిల్లా మహాసభలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. తొలుత శ్రీకోదుర్గమ్మ ఆలయ ప్రాంగణం నుంచి ప్రధాన రహదారి మీదుగా మహాసభ జరిగే గాయత్రీ కల్యాణ మండపం వరకు వలంటీర్ల భారీ ర్యాలీ నిర్వహించారు. గిరిజన నృత్యాలు, కోలాట ప్రదర్శనలు, డప్పుల శబ్దాలతో ఉర్రూతలూగించే సీపీఐ పాటలతో పాలకొండ పట్టణంలో ఉత్సాహకర వాతావరణం నెలకొంది. అనంతరం పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి కురంగి మన్మధరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈశ్వరయ్య మాట్లాడుతూ కార్పొరేటర్‌లకు అనుకూలంగా మోదీ పాలన సాగుతోందన్నారు. రైతులు, నిరుద్యోగులను పూర్తిగా విస్మరిస్తూ అమెరికాకు అనుకూలంగా నడుచుకుంటున్నారని విమర్శించారు. ప్రధాని మాటలు కోటలు దాటుతున్నాయే తప్ప ఆ స్థాయి అభివృద్ధి కనిపించడం లేదని ఎద్దేవా చేశారు.

రాష్ట్రంలో స్మార్ట్ మీటర్లు, విద్యుత్ చార్జీల పెంపు, ఎరువుల భారం, నిత్యవసర ధరలు పెరుగుదల వంటివన్నీ ప్రజలకు పెనుభారంగా మారాయని ఈశ్వరయ్య అన్నారు. చంద్రబాబు సైతం మోదీకి కొమ్ముకాస్తూ రాష్ట్రాభివృద్ధిని మరిచారని, వేలాది ఎకరాలు బడాబాబులకు కారు చౌకగా కట్టబెట్టి ప్రజలను దగా చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని, విలువైన ఆర్టీసీ స్థలాలను లూలూ సంస్థకి చౌకగా ఇచ్చేశారని, ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పడం సరికాదని ఈశ్వరయ్య అన్నారు. తల్లికి వందనం కింద నేటికీ 50 శాతం మందికి నిధులు అందలేదని చెప్పారు. ప్రజలను మభ్యపెట్టే పాలన రాష్ట్రంలో సాగుతోందన్నారు. వీధి వీధిన బెల్ట్ షాపులు ఉన్నాయని, మద్యం ఏరులై పారుతోందని విమర్శించారు. నాటు సారా దుకాణాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. ప్రజల పక్షాన నిలుస్తానని చెప్పిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గొంతు పూర్తిగా మూగబోయిందని, సనాతన ధర్మమంటూ నామాలు పెట్టుకుని గుడిమెట్లు కడుక్కుంటూ ఊరూరా తిరగడం తప్ప ఆయన చేసేది ఏమీ లేదని ఈశ్వరయ్య ధ్వజమెత్తారు. ప్రజల తరపు పోరాడేది సీపీఐ ఒక్కటేనని, బడుగు, బలహీనులు, కార్మికులు, కర్షకులకు ఎర్ర జెండా అండ ఎల్లప్పుడూ ఉంటుందని, వారి అభ్యున్నతికి నిరంతరం పోరాడుతుందని ఈశ్వరయ్య అన్నారు.

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.కామేశ్వరరావు మాట్లాడుతూ ఈనెల 20 నుంచి 25వ తేదీ వరకు ఒంగోలులో జరిగే సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఉత్తరాంధ్రలో జంఝావతి, నాగావళి, సువర్ణముఖి, వేగావతి వంటి నదులే కాక అనేక వాగులు-వంకలు ఉన్నా, రెండు పంటలు పండించలేక రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. పెండింగ్ ఉన్న ఉత్తరాంధ్ర ప్రాజెక్టులను తక్షణమే పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా సమగ్రాభివృద్ధి, హక్కుల కోసం ఐక్య పోరాటాలు అవశ్యమని, ఇందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు వందన సమర్పణ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంటి స్థలాలు, నిర్మాణ ఖర్చులు ఇవ్వాలన్నారు. సీపీఐ నాయకులు తోట జీవన్, ఈవీ నాయుడు, జి.సూరయ్య, ఏఐఎస్ఎఫ్ నాయకుడు రవికుమార్, నాయకులు సుశీల, గోపి నాయుడు, ఆర్‌వీఎస్ కుమార్, ఉత్తరావిల్లి మురళీమోహనరావు, నీలకంఠేశ్వర యాదవ్, బుడితి భారతి, ద్వారపూడి అప్పలనాయుడుతో పాటు సీపీఐ కార్యకర్తలు, అభిమానులు, గిరిజనులు పాల్గొన్నారు.

అమెరికా కపట విధానాన్ని తిప్పికొట్టాలి: నారాయణ



న్యూదిల్లీ: వాణిజ్యాన్ని అస్త్రంగా మలుచుకొని సుంకాల పేరిట భారత్‌పై అమెరికా తీవ్రస్థాయిలో ఒత్తిడి తెస్తున్నాగానీ రష్యా నుంచి చమురు కొనుగోళ్లు కొనసాగిస్తుండటం స్వాగతించదగ్గ అంశమని సీపీఐ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అన్నారు. ఇలా కొనుగోలు చేసిన చమురును ఇరత దేశాలకు ఎగుమతి చేస్తూ, వచ్చే లాభాలను ప్రజలతో ప్రభుత్వం పంచుకోవాలన్నారు. ఇందుకు భిన్నంగా డీజిల్, పెట్రల్ వంటి పెట్రోలియం ఉత్పత్తులను సొంత ప్రజలకు తక్కువ ధరలకు కేంద్రం ఇవ్వడం లేదని శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ లాభార్జనతో దేశ ప్రజలపై భారం పడుతోందన్నారు. రష్యాతో దీర్ఘకాలిక స్నేహాన్ని కొనసాగిస్తున్నందుకు కేంద్ర విదేశాంగ శాఖకు సీపీఐ తరపున నారాయణ కృతజ్ఞతలు తెలిపారు. కష్ట కాలంలో భారత్‌కు రష్యా అండగా నిలిచిందని, 1971 బంగ్లాదేశ్ లిబరేషన్ యుద్ధం సమయంలో భారత్ దళాలకు మద్దతుగా సోవియట్ జలాంతర్గాములు వచ్చాయని నారాయణ గుర్తుచేశారు. భారత్‌లో రిఫైనరీలను సోవియట్ యూనియన్ ఏర్పాటు చేసిందని, మరమ్మతుల కోసం సాంకేతిక నిపుణులను పంపిందని వెల్లడించారు. ప్రస్తుతం రష్యా నుంచి చమురు కొనుగోళ్లతో ఈ వారసత్వం కొనసాగుతోందని నారాయణ అన్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేయొద్దంటూ భారత్‌పై నేడు ఒత్తిడి తెస్తున్న అమెరికా గతంలో వీటిని ప్రోత్సహించిందని, తాజా పరిణామాలతో అగ్రరాజ్య కపటత్వం బహిర్గతమైందని నారాయణ వ్యాఖ్యానించారు. ఆర్టిఫీషియల్ ఇన్‌ఫాంట్ మిల్క్ (ఇన్‌ఫామిల్) దిగుమతి చేసుకోవాలని భారత్‌ను అమెరికా తీవ్రస్థాయిలో ఒత్తిడి చేస్తోందని, ఇలాంటి జోక్యాలతో భారత వాణిజ్య సార్వభౌమత్వానికి, ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) సిద్ధాంతాలకు విఘాతం కలుగుతుందని నొక్కిచెప్పారు. రిఫైనింగ్ ద్వారా వచ్చే లాభాలతో దేశ పౌరులకు ప్రయోజనం ఉండేలా ప్రధాని మోదీ చర్యలు తీసుకోవాలని నారాయణ డిమాండ్ చేశారు. వచ్చే లాభాలను ప్రజలతో పంచుకోవాలన్నారు. భారత్ తన సార్వభౌమ హక్కులను పరిరక్షించుకుంటూ... అమెరికా కపట విధానాన్ని తిప్పికొట్టాలని నారాయణ పిలుపునిచ్చారు.

నిధుల ఆలస్యంపై రాష్ట్రానికి కేంద్రం లేఖ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పంచాయతీలు/స్థానిక సంస్థలకు 2024-25లో రెండో విడత 15వ ఆర్థిక సంఘం నుంచి రూ.1,121 కోట్ల నిధుల ఆలస్యంపై వివరణ ఇవ్వాలని... రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర పంచాయతీరాజ్‌శాఖ లేఖ రాసినట్టు ఆంధ్రప్రదేశ్ పంచాయతీ పరిషత్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల దిల్లీలో కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ ఉన్నతాధికారులతో తాను సమావేశమవ్వగా... అందులో రాష్ట్రానికి సంబంధించిన గత వైసీపీ ప్రభుత్వంలో పంపిన 14వ ఆర్థిక సంఘం నిధులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని, ఆ నిధులను విడుదల చేయాలని, 15వ ఆర్థిక సంఘం నిధులను త్వరగా జమయ్యేలా చూడాలని ఉన్నతాధికారులకు వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. రెండో విడత 15వ ఆర్థిక సంఘం గ్రాంట్లను వడ్డీతో సహా తక్షణమే విడుదల చేయాలని కోరారు.

ఎస్ఐఆర్ కొత్తదేమీ కాదు: అమిత్ షా

సీతామర్హి (బీహార్): బీహార్‌లో ఎస్ఐఆర్‌ను వ్యతిరేకించడంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఎదురుదాడికి దిగారు. కొన్ని పార్టీలు దేశప్రయోజనాలను పక్కన పెట్టి... ఓటు బ్యాంకు రాజకీయాలకు ప్రాధాన్యత ఇవ్వడం వల్లే ఇదంతా జరుగుతోందని ఆయన అన్నారు. అమిత్ షా శుక్రవారం బీహార్‌లో పర్యటించారు. సీతామర్హిలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగించారు. బీహార్‌లో ప్రతిపక్ష పార్టీలైన ఆర్జేడీ, కాంగ్రెస్‌పై అమిత్ షా ఎదురుదాడికి దిగారు. చొరబాటుదారులు వారి ఓటు బ్యాంకు అని, అందుకే ప్రతిపక్ష పార్టీలు ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తున్నాయని అమిత్ షా ఆరోపించారు. ఎస్ఐఆర్ అనే ప్రక్రియ దేశంలో మొదటిసారి జరగడం లేదని, ఈ విధానాన్ని మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ప్రారంభించారని గుర్తుచేశారు. 'బీహార్‌లో త్వరలో ఎన్నికలు జరగబోతున్నాయి. నేను ఇక్కడికి వచ్చేముందు నన్ను విలేకర్లు ఎస్ఐఆర్ గురించి ప్రశ్నల మీద ప్రశ్నలు సంధించారు. అయితే, దీని గురించి నేను ప్రజలను అడగాలనుకుంటున్నాను. మనం ఓటర్ల జాబితా నుండి వలసదారులను తొలగించకూడదా? లాలూ ప్రసాద్ యాదవ్ ఎవరిని రక్షించాలనుకుంటున్నారు? బయటి నుండి వచ్చి బీహార్ ప్రజల ఉద్యోగాలు లాక్కునే బంగ్లాదేశీయులను మీరు రక్షించాలనుకుంటున్నారా?' అంటూ ప్రశ్నలు సంధించారు.

సీపీఐని బలోపేతం చేద్దాం

ముప్పాళ్ల నాగేశ్వరరావు పిలుపు

విశాలాంధ్ర- వినుకొండ: దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో బూర్జువా పార్టీలు అధికారంలో ఉన్నాయని, వాటిపై పోరాడే బాధ్యత భారత కమ్యూనిస్టు పార్టీ భుజస్కంధాలపై ఉందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. పల్నాడు జిల్లా ద్వితీయ మహాసభల సందర్భంగా రెండోరోజు శుక్రవారం స్థానిక గంగినేని కళ్యాణమండపంలో జిల్లా ప్రతినిధుల సభ జరిగింది. సభకు మందపాటి రమణారెడ్డి, బూదాల శ్రీనివాసరావు, నాగమణి, ఎం.రమేష్ అధ్యక్షవర్గంగా వ్యవహరించగా... సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి ఎ.మారుతీ వరప్రసాద్ వక్తలను వేదికపైకి ఆహ్వానించారు. ముప్పాళ్ల మాట్లాడుతూ ఒకనాడు పల్నాడు జిల్లా కక్షలకు, పంతాలకు నిలయంగా ఉండేదని, నేడు ఆ పరిస్థితులు మారి అభివృద్ధి పథంలో ముందుకు వెళుతున్నదన్నారు. సీపీఐ ఉద్యమాల ఫలితంగా దున్నేవాడిదే భూమి నినాదంతో లక్షలమంది పేదలకు భూములు పంపిణీ చేశామన్నారు. బ్యాంకుల జాతీయాకరణ, రాజభరణాల రద్దు సీపీఐ పోరాట ఫలితమేనన్నారు. భూ సంస్కరణల చట్టం ఘనత కూడా కమ్యూనిస్టులదేనన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ మరింత బలపడేందుకు యువతను దగ్గరకు తీసుకోవాలన్నారు.

మాజీ ఎమ్మెల్సీ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జల్లి విల్సన్ మాట్లాడుతూ కేంద్రంలో రాక్షస పాలన సాగుతున్నదని, అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగంపై పాలకులకు గౌరవం లేదని విమర్శించారు. లౌకిక రాజ్యం పరిరక్షణ కోసం పోరాటం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మోదీ హయాంలో న్యాయవ్యవస్థ స్వేచ్ఛగా పనిచేయడం లేదని, ముస్లింల ఆస్తులు కొల్లగొట్టేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంపైనా ఇక పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కమ్యూనిస్టుల ఒత్తిడి మేరకు జాతీయ గ్రామీణ హామీ పథకం చట్టరూపం దాల్చిందని, అయితే, ఈ చట్టాన్ని నీరుగార్చడానికి మోదీ సర్కారు యేటా నిధుల్లో కోత విధిస్తోందని మండిపడ్డారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జంగాల అజయ్ కుమార్ మాట్లాడుతూ అబద్ధాలకోరు ప్రధాని నరేంద్రమోదీ అని నిందించారు. అధికారం చేపట్టిన తర్వాత మోదీ ఒక్క హామీ అమలు చేయలేదన్నారు. అదానీ, అంబానీకి మాత్రం ఊడిగం చేస్తున్నారని విమర్శించారు. సీఆర్ ఫౌండేషన్ కోఆర్డినేటర్ వయ్యకంటి చెన్నకేశవరావు మాట్లాడుతూ తన తండ్రి వయ్యకంటి శివప్రసాద్, కుటుంబ సభ్యులు తుది వరకు పార్టీ కోసం కృషి చేశారని, తన తండ్రిని ఈ ప్రాంత ప్రజలు మర్చిపోకుండా వర్ధంతులు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. మూడేళ్లలో జిల్లావ్యాప్తంగా ప్రజా సమస్యలపై, రైతాంగ సమస్యలపై, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై నిర్వహించిన ఆందోళనలు, ధర్నాలు, కార్యక్రమాలపై మారుతీ వరప్రసాదరావు కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టారు. తొలుత ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి బైరాపట్నం రామకృష్ణ అధ్వర్యంలో కళాకారులు ఆలపించిన విప్లవ గేయాలు అలరించాయి. పార్టీ జెండాను సీపీఐ సీనియర్ నాయకులు, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ సంద్రపాటి సైదా ఆవిష్కరించగా, మృతవీరుల స్మారక స్థూపం వద్ద షేక్ బుడే పుష్పాంజలి ఘటించారు. సభలో సీపీఐ పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శులు షేక్ హుస్సేన్, కాసా రాంబాబు, ఏరియా కార్యదర్శులు బూదాల శ్రీనివాసరావు, పట్టణ కార్యదర్శి ఉలవలపూడి రాము, నాయకులు మహంకాళి సుబ్బారావు, ఎం.శ్రీనివాస్‌రెడ్డి, ఎం.రమణారెడ్డి, టి.బాబురావు, చక్రవరం సత్యనారాయణ రాజు, ఎం.శ్రీనివాసరావు, ఎం.రమేష్, కోట మాల్యాద్రి, సారమ్మ, కె.శరత్ చంద్రశ్రీ పాల్గొన్నారు. ముప్పాళ్ల నాగేశ్వరరావు, జల్లి విల్సన్, జంగాల అజయ్ కుమార్, వయ్యకంటి చెన్నకేశవలను దుశ్శాలువాతో సత్కరించారు.

రాహుల్ ఆరోపణలు నిజమైతే

ఈసీ రద్దు కావాలి

వినయ్ విశ్వం సవాల్

తిరువనంతపురం: ఎన్నికల సంఘంపై లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ తీవ్రమైన ఆరోపణలు చేశారని, బీజేపీ చేతిలో కీలుబొమ్మగా ఈసీ మారిందని కేరళ రాష్ట్ర కార్యదర్శి వినయ్ విశ్వం విమర్శించారు. రాహుల్ ఆరోపణలు నిజం కాకపోతే ఆయనపై చర్యలు తీసుకోవాలని, అవి నిజమని తేలితే ఈసీఐ రద్దు కావాలంటూ సవాల్ విసిరారు. ప్రజలు సమాధానాలు కోరుతున్నారని... స్వేచ్ఛగా, పారదర్శకంగా ఎన్నికలు జరగడం ప్రజల హక్కు, దీనిని పరిరక్షించడం ఈసీ ధర్మమన్నారు. దేశంలోని రాజ్యాంగబద్ధ సంస్థలన్నీ బీజేపీ చేతిలో ఆటబొమ్మలుగా మారిపోయాయని, స్వప్రయోజనం కోసం ఆ పార్టీ వీటన్నింటిని దుర్వినియోగిస్తోందని వినయ్ విశ్వం విమర్శించారు. అదే సమయంలో భారత్ దిగుమతలపై అమెరికా 50 శాతం వరకు సుంకాలు విధించడాన్ని ఆక్షేపించారు. ఈ సుంకాలతో రాష్ట్రంలోని మత్స్యసాగు, జీడిపప్పు పరిశ్రమపై ప్రభావం తీవ్రంగా ఉంటుందని తెలిపారు. ప్రధాని మోదీకి ఇవేమీ పట్టడం లేదని దుయ్యబట్టారు. అమెరికా అధ్యక్షుడు ఇష్టమొచ్చినట్లు వ్యాఖ్యలు చేస్తున్నాగానీ ఆయనను ఎదిరించే ధైర్యం మోదీకి లేకపోయిందని వినయ్ విశ్వం వ్యాఖ్యానించారు. డొనాల్డ్ ట్రంప్‌కు దాసోహమైన మోదీ ప్రభుత్వానికి, బీజేపీకి స్వదేశీ ఉద్యమం గురించి మాట్లాడే యోగ్యత లేదని ఆయనన్నారు.

సముద్రం నుంచే సంపద సృష్టి

విశాలాంధ్ర-సచివాలయం: రాష్ట్రంలో అత్యంత పొడవైన సముద్ర తీరాన్ని మహిళలు తమకు ఆదాయ వనరుగా మార్చుకుంటున్నారు. తూర్పు గోదావరి నుంచి శ్రీకాకుళం వరకూ సముద్ర తీరంలో సరికొత్త దృశ్యం ఆవిష్కారమవుతోంది. సాధారణంగా సముద్ర తీరంలో జీవించే మత్స్యకారులు చేపల వేటపైనే ఆధారపడ్డారు. కానీ ఇప్పుడు మరికొన్ని ఉపాధి మార్గాల ద్వారాలు తెరుచుకున్నాయి. సముద్రపు నాచు సాగుతో ఉత్తరాంధ్ర తీరం కొత్త ఉపాధి కేంద్రంగా మారబోతుంది. అనకాపల్లి జిల్లా తంతడి, రేవు పోలవరం గ్రామాల్లో ప్రారంభమైన ఈ నూతన ప్రయోగం ఇతర సముద్ర తీర ప్రాంతవాసులకు మోడల్‌గా మారే అవకాశం ఉంది. తీరప్రాంత మహిళల చేతుల్లోకి వనరులను అందించాలనే ఉద్దేశంతోనే నాచు సాగుకు ప్రభుత్వం ప్రాధాన్యత నిచ్చింది. గాజువాక, భీమిలి, ఉప్పాడ, తూర్పు గోదావరి తీరాల్లోకి విస్తరించనుంది. ప్రత్యేకంగా మహిళా సంఘాల అధ్వర్యంలో మెరైన్ క్లస్టర్ ఫార్మింగ్ జోన్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఎగుమతి మార్కెట్‌ను అనుసంధానం చేసే బాధ్యతను ఆంధ్ర ప్రదేశ్ మార్కెట్ ఇంటర్వెన్షన్ సొసైటీ (ఏపీ మార్క్ ఫెడ్) చేపట్టనుంది. ప్రస్తుతం విశాఖపట్నం పోర్టు ద్వారా ఎగుమతులు జరిగే అవకాశం ఉంది. డీఆర్డీఏ ఇప్పటికే కొన్ని జపాన్ కంపెనీలతో ఎంఓయూలు చేసేందుకు ప్రయత్నిస్తోంది. రైతులు ఉత్పత్తిని నేరుగా కంపెనీలకు ఇవ్వడం వల్ల మధ్యవర్తుల అవసరం లేకుండా ఎక్కువ ఆదాయం వస్తుంది. అనకాపల్లి జిల్లా తంతడి వద్ద సముద్రం ఒడ్డున కొన్ని కిలోమీటర్ల దూరాన కనిపించే అలల్లో తేలియాడే తెప్పలు అక్కడి సముద్రపు తీరం రూపురేఖలను మార్చేశాయి. ఇవి మామూలు తెప్పలు కావు. అధిక సాంద్రతగల పాలిథిలిన్‌తో తయారయిన తెప్పలు. వాటిలో సాగు చేస్తున్నారు. సముద్రపు ఉప్పు ప్రభావం పడకుండా ఉండేలా ఈ తెప్పలను తయారు చేశారు. సముద్రపు నాచు సాగు తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం తెచ్చిపెట్టే విధంగా ఉన్నాయి. సాధారణంగా ఒక్క తెప్పపై నెల రోజులపాటు సాగు చేస్తారు. జపాన్, దక్షిణ కొరియా, చైనా, అమెరికా, కొన్ని యూరప్ దేశాల్లో మంచి డిమాండ్ ఉంది. మార్కెట్ ధర టన్ను రూ.80 వేల నుంచి రూ.1.2 లక్షల వరకూ ఉంటుంది. తెప్ప ఖర్చు రూ.5 వేల రూ.10 వేల వరకూ ఉంటుంది. ప్రస్తుతం ఈ సాగు విధానంలో 80 మంది మహిళలు శిక్షణ పొందుతున్నారు. ఉత్తర తీరాంధ్రను మోడల్ హబ్ లక్ష్యంగా ఎంచుకున్నారు. సముద్రపు నాచు సాగు సముద్ర పక్కన ఉన్న గ్రామాల్లోని మహిళలకు ఆర్థిక మార్గంగా మారనుంది. ఈ ప్రాజెక్టులో ప్రధాన పాత్ర పోషిస్తున్నది తీర గ్రామాల మహిళలు. తంతడి, రేవుపోలవరం ప్రాంతాల్లోని మహిళా స్వయం సహాయక సంఘాల అధ్వర్యంలో సుమారు 80 మంది మహిళలు నాచు సాగులో ప్రాథమిక శిక్షణ పొందారు. మంచి నైపుణ్యాన్ని సంపాదించారు. మత్స్య శాఖ వారి కోసం ప్రత్యేకంగా శిక్షణ కార్యక్రమాలు, డెమో ప్లాట్లు ఏర్పాటు చేసింది. ఇదివరకు తమ జీవితం సముద్రానికి పక్కనే గడిచిపోయేది. మేమంటూ ఏమీ చేయలేకపోయేవాళ్లం కానీ అదే సముద్రం నుంచి స్థిరమైన ఆదాయం వస్తోందని వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సముద్రపు పాచి సాగు పర్యావరణానికి అనుకూలమైన వ్యవసాయ పద్ధతిగా నిపుణులు చెబుతున్నారు. ఇది సముద్రపు నీటిలోని కార్బన్ డై ఆక్సైడ్‌ను గ్రహించి వాతావరణ మార్పును తగ్గించడంలో సహాయపడుతుంది. మత్స్య సంపద పెరుగుతుంది. సముద్రపు జీవవైవిధ్యం మెరుగవుతుంది. తీరప్రాంత ఎరోషన్ తగ్గుతుంది. గాలి నాణ్యత పెరుగుతుంది. సముద్రపు పాచి సాగులో భారత తీర ప్రాంతాల్లో అపారమైన అవకాశాలు ఉన్నాయి.

స్వచ్ఛతా అవార్డుల్లో విశాఖ పోర్టుకు ప్రథమ స్థానం

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: స్వచ్ఛత పఖ్వాడా అవార్డులు-2024లో విశాఖపట్నం పోర్టు అథారిటీ దేశంలో మొదటి స్థానంలో నిలిచింది. తద్వారా విశాఖ ఖ్యాతిని జాతీయ స్థాయిలో నిలిపింది. పోర్టులు, షిప్పింగ్ అండ్ వాటర్‌వేస్ మంత్రిత్వ శాఖ నిర్వహించిన ఈ పోటీలో శ్యామ ప్రసాద్ ముఖర్జీ పోర్టు అథారిటీ రెండవ స్థానం, ఇండియన్ మెరిటైమ్ యూనివర్సిటీ మూడవ స్థానం పొందాయి. స్వచ్ఛత, పారిశుధ్య కార్యక్రమాల్లో విశేష కృషి చేసిన విశాఖపట్నం పోర్టును మంత్రిత్వ శాఖ ప్రత్యేకంగా అభినందించింది. మంత్రిత్వ శాఖ నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం 'స్వచ్ఛత కి భాగీదారీ, 'సంపూర్ణ స్వచ్ఛత' కార్యక్రమాల కింద పోర్టు అనేక ప్రభావవంతమైన కార్యక్రమాలు చేపట్టింది. వీటిలో పెద్ద ఎత్తున నిర్వహించిన స్వచ్ఛత కార్యక్రమాలు 'ఏక్ పెడ్ మా కే నామ్' మొక్కలు నాటే కార్యక్రమం, గోడలపై చిత్రలేఖనం, పాఠశాలలో అవగాహన కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, స్వచ్ఛ భారత్ సందేశాన్ని ప్రోత్సహించే సృజనాత్మక పోటీలు ఉన్నాయి. 15 సంవత్సరాలుగా మునిగిపోయి ఉన్న పడవలను తొలగించి, ఫిషింగ్ హార్బర్‌లో జరిగిన మెగా క్లీనప్ డ్రైవ్ ఈ కార్యక్రమాలలో విశేషంగా నిలిచింది. పోర్టు వైద్య విభాగం, పారిశుద్ధ్య కార్మికుల కోసం సఫాయి మిత్ర సురక్ష శిబిరం నిర్వహించింది. ఇందులో వ్యాధి నిరోధక ఆరోగ్య పరీక్షలు, పీపీఈ కిట్ల పంపిణీ, వైద్య సదుపాయాల కల్పన వంటి సేవలు అందించారు. పర్యావరణ సుస్థిరత వైపు బలమైన అడుగులు వేస్తూ... పోర్టు విస్తృత స్థాయిలో పచ్చదనం అభివృద్ధి, ల్యాండ్‌స్కేప్ రూపకల్పన చేపట్టి, అల్లూరి, అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల్లో మొత్తం 31,800 మొక్కలు నాటింది. కంభాలకొండ ఈకో టూరిజం పార్కులో 350 మందితో ట్రెక్కింగ్ శుభ్రత కార్యక్రమం నిర్వహించింది.

ఈ కార్యక్రమం సమాజంలో ఐక్యతను పెంచడంతో పాటు పార్కు పరిసరాలను మరింత అందంగా మార్చింది. స్వచ్ఛతలో విశాఖపట్నం పోర్టు దేశంలోనే ప్రథమ స్థానంలో నిలవడంపై పోర్టు చైర్మన్ డా.ఎం.అంగముత్తు ఆనందం వ్యక్తం చేశారు. పోర్టు సాధించిన ఈ విజయంపై సిబ్బంది, భాగస్వాములను అభినందించారు. స్వచ్ఛ భారత్ అభియాన్ లక్ష్యాల సాధనలో స్వచ్ఛమైన, పచ్చని ఆరోగ్యవంతమైన పర్యావరణం కోసం పోర్టు కట్టుబడి ఉందని ఆయన వెల్లడించారని పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పీఎం ఉజ్వల కొనసాగింపు

- అసోం, త్రిపురకు ప్రత్యేక ప్యాకేజీ
- చమురు కంపెనీలకు రూ.30వేల కోట్ల పరిహారం
- కేంద్ర కేబినెట్ నిర్ణయాలు

న్యూదిల్లీ: పీఎం ఉజ్వల యోజన కొనసాగించాలని ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర ఆర్థిక వ్యవహారాల కేబినెట్ శుక్రవారం నిర్ణయించింది. అందుకోసం రూ.12,060 కోట్లు కేటాయిస్తున్నట్లు తెలిపింది. అసోం, త్రిపుర రాష్ట్రాలకు ప్రత్యేక ప్యాకేజీకి నిర్ణయం తీసుకున్నది. రూ.7,250 కోట్ల చొప్పున ప్రత్యేక ప్యాకేజీని కేంద్రం ప్రకటించింది. సాంకేతిక విద్య కోసం రూ.4,200 కోట్లు ప్రకటించింది. 275 సాంకేతిక విద్యా సంస్థల్లో దీనిని అమలు చేయనున్నారు. నైపుణ్యాలు, ఉపాధి అవకాశాల పెంపు ప్రధాన లక్ష్యంగా ఈ పథకం చేపట్టడం ద్వారా దేశవ్యాప్తంగా 7.5 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందన్న అంచనా ఉంది. ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కాలేజీలు అప్‌గ్రేడ్ చేయాలని కూడా కేబినెట్ నిర్ణయించింది. నష్టాలబారిన పడిన ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ కంపెనీలకు ఎల్‌పీజీ సబ్సిడీగా రూ.30 వేల కోట్లు కేటాయించేందుకు ఆమోదం తెలిపింది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ), భారత్ పెట్రోలియం (బీపీసీఎల్), హిందూస్థాన్ పెట్రోలియం (హెచ్‌పీసీఎల్) కంపెనీలకు గత 15 నెలలుగా తక్కువ ధరకు ఎల్‌పీజీ అమ్మకాలతో వచ్చిన లాభాలకు పరిహారంగా ఈ మొత్తాన్ని కేటాయించింది. 12 విడతల్లో ఈ మొత్తాన్ని చమురు తయారీ కంపెనీల (ఓఎంసీ)కు చెల్లించనున్నట్లు అధికారిక ప్రకటన వెల్లడించింది. ఈ ప్రక్రియ పెట్రోలియం, సహజ గ్యాస్ మంత్రిత్వశాఖ పరిధిలో జరుగుతుంది. అంతర్జాతీయ ఇంధన మార్కెట్ల అస్థిర పరిస్థితుల నుంచి వినియోగదారులను కాపాడటానికి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఈ చర్య ద్వారా స్పష్టమవుతోందని ప్రకటన పేర్కొంది. ఇదిలావుంటే, మరక్కనం- పుదుచ్చేరి మధ్య 46 కిలోమీటర్ల నాలుగు లైన్ల జాతీయ రహదారి కోసం రూ.2,157 కోట్లు కేటాయింపునకు కేబినెట్ ఆమోదం లభించింది. హైబ్రిడ్ అన్యుటీ మోడ్ (హెచ్ఏఎం) ఈ ప్రాజెక్టును చేపడుతుంది. నాలుగు లేన్ల జాతీయ రహదారి అందుబాటులోకి వస్తే తమిళనాడులో మల్టీమోడ్ కనెక్టివిటీ మెరుగవుతుంది. చెన్నై, పుదుచ్చేరి రైల్వేస్టేషన్లు, విమానాశ్రయాల మధ్య అనుసంధానం ఏర్పడుతుంది. కుడ్డలూర్ మైనర్ పోర్టుకూ సౌకర్యం ఉంటుంది. ఈ ప్రాజెక్టు దాదాపు ఎనిమిది లక్షల మంది ప్రత్యక్షంగా, 10 లక్షల మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు కల్పించే అంచనా ఉంది. ఈ మేరకు కేబినెట్ నిర్ణయాలను కేంద్రమంత్రి అశ్వనీ వైష్ణవ్ తెలిపారు. అనంతరం అమెరికా విధించిన 50 శాతం సుంకాలపై కేబినెట్ చర్చించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన సుంకాలకు భారత్ దీటైన బదులిచ్చింది. అమెరికా నుంచి ఆయుధాల కొనుగోళ్లు నిలిపివేసినట్లు ప్రకటించింది. ఇప్పటికే క్షిపణుల కొనుగోళ్లు నిలిపివేసినట్లు తెలిపింది. తాజా పరిణామాల క్రమంలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తన అమెరికా పర్యటనను రద్దు చేసుకున్నట్లు తెలుస్తోంది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.